సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 105
గురువారం 6-7-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



**భారత జట్టులో తిలక్ వర్మ**
వెస్టిండీస్‌తో టి20 సిరీస్‌కు ఎంపికైన హైదరాబాద్ క్రికెటర్. - 12లో



**కట్నం ఇవ్వను**
12 పెళ్లి చూపులు భగ్నమయ్యాయి. విసిగి పోయిన ఆమె పోరాటానికి దిగింది. - 11లో



**మోదీ వల్లే నిరుద్యోగం పెరుగుదల**
దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగానికి మోదీ ప్రభుత్వ చేతగానితనమే కారణమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే మండిపడ్డారు.
- వివరాలు 6లో



**ఈడీని కట్టడి చేయాల్సిందే**
మనీ లాండరింగ్ కేసుల విచారణలో ఈడీకి అపరిమితాధికారాలు కట్టబెట్టారని సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే అన్నారు.
- వివరాలు 6లో



**ముగిసిన సైనిక ఆపరేషన్**
మిలిటెంట్లను ఏరివేయడమే లక్ష్యంగా వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయెల్ సైన్యం చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్ బుధవారం ముగిసింది.
- వివరాలు 6లో



**మహిళను నేలపైకి తోసి..**
అమెరికాలో సూపర్ మార్కెట్లో దొంగతనానికి పాల్పడిందంటూ ఓ మహిళతో పోలీసు అధికారి అనాగరికంగా వ్యవహరించాడు.
- వివరాలు 6లో

## మరో 8 కొత్త మెడికల్ కాలేజీలు..

- వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు
- వీటితో కలిపి జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కలిగిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ
- తొమ్మిదేళ్లలో 29 కొత్త కాలేజీలు అందుబాటులోకి..
- రాష్ట్రంలో పది వేలకు చేరువైన ఎంబీబీఎస్ సీట్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో ఎనిమిది ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024–25 వైద్య విద్యా సంవత్సరంలో జోగుళాంబ గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్‌అర్బన్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఈ కొత్త మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వస్తాయని తెలిపింది. ఒక్కో కాలేజీలో 100 ఎంబీబీఎస్ సీట్లతో మిగతా 3వ పేజీలో ▶

మెడికల్ | ఇంజనీరింగ్

## సీటు రద్దు చేసుకుంటే ఫీజు వాపస్

- యూజీసీ స్పష్టీకరణ
- కటాఫ్‌గా అడ్మిషన్ల ప్రక్రియ చివరి తేదీ
- 15 రోజుల కంటే ముందు అయితే 100% రిఫండ్
- 15 రోజుల తర్వాత అయితే సగం ఫీజే తిరిగి చెల్లింపు
- ఈ ఏడాది నుంచే అమలు



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యా సంస్థల్లో చేరిన విద్యార్థులు సీటు రద్దు చేసుకున్నప్పుడు అప్పటికే చెల్లించిన వార్షిక ట్యూషన్ ఫీజును తిరిగి ఇవ్వాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) స్పష్టం చేసింది. ప్రాసెసింగ్ ఫీజు రూ.1,000 మాత్రం సంబంధిత సంస్థలు తీసుకోవచ్చని తెలిపింది. సీటు రద్దు చేసుకునే సమయాన్ని బట్టి ట్యూషన్ ఫీజు చెల్లింపు ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు మార్గదర్శకాలతో కూడిన ఫీజు రిఫండ్ పాలసీని యూజీసీ విడుదల మిగతా 3వ పేజీలో ▶

## సమయం తక్కువ.. సవాళ్లు ఎక్కువ!

**బీజేపీ రాష్ట్ర కొత్త అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ముందున్న సవాళ్లెన్నో.. నేతల మధ్య సమన్వయం సాధించడమే కీలకం**

- తలకు మించిన భారంగా రాష్ట్ర కార్యవర్గం కూర్పు, జిల్లా అధ్యక్షుల నియామకం
- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం.. బీఆర్ఎస్ విమర్శలను దీటుగా తిప్పికొట్టడం
- అధ్యక్ష మార్పు, ఈటలకు కీలక పదవిపై అసంతృప్తితో ఉన్నవారు పార్టీని వీడకుండా చూడాల్సిన బాధ్యత..
- తనకు ఇష్టంలేని పదవి కట్టబెట్టడంపై కిషన్‌రెడ్డి అసంతృప్తి.. కీలక సమయంలో తనను తప్పించడంపై మనోవేదనలో బండి సంజయ్!



శంషాబాద్ విమానాశ్రయంలో కిషన్‌రెడ్డి, ఈటల

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: పార్టీలో సమన్వయ లోపం, పదవులు దక్కని అసంతృప్తులు, పాత–కొత్త నేతల మధ్య భేదాభిప్రాయాలను సరిదిద్దడం ఓ వైపు.. అధికార బీఆర్ఎస్‌ను, సీఎం కేసీఆర్ వ్యూహాలను ఎదుర్కొంటూ, విమర్శలను తిప్పికొడుతూ పార్టీని ముందుకు దూకించాల్సిన బాధ్యత ఇంకోవైపు.. ముంచుకొస్తున్న అసెంబ్లీ ఎన్నికలు మరోవైపు.. రాష్ట్ర బీజేపీ కొత్త అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి ముప్పేట ముసిరిన సవాళ్లు ఇవి. వీటన్నింటినీ చక్కదిద్ది రాష్ట్రంలో బీజేపీని విజయతీరాలకు నడిపించేందుకు ఆయనకు ఉన్న మిగతా 2వ పేజీలో ▶

**అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం** 2లో
రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పనిచేస్తా: కిషన్‌రెడ్డి



జస్టిస్ ఉజ్జల్ భూయాన్



జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్టి

## సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ భూయాన్, జస్టిస్ ఎస్వీ భట్టి

**తెలంగాణ, కేరళ హైకోర్టుల సీజేలను సిఫార్సు చేసిన కొలీజియం**
**ఏపీ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ భట్టి**

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసి, ప్రస్తుతం కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందిస్తున్న జస్టిస్ ఎస్.వెంకటనారాయణ భట్టిలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి మిగతా 10వ పేజీలో ▶

### న్యూస్‌రీల్

**మళ్లీ క్షేత్రస్థాయి పర్యటనలకు సీఎం కేసీఆర్**



గత నెలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, జిల్లాల పర్యటనలు, మహారాష్ట్ర టూర్ షెడ్యూల్‌తో బిజీగా గడిపిన సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఈ నెల మూడో వారం నుంచి మళ్లీ క్షేత్రస్థాయి పర్యటనలు మొదలు పెడుతున్నారు.
- వివరాలు 2లో

**బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా రాజగోపాల్ రెడ్డి**



కిషన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన మరునాడే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి పార్టీలో కీలక పదవి వరించింది. ఆయనను జాతీయ కార్యవర్గ సభ్యుడిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు.
- వివరాలు 2లో

**జీఎస్టీ అధికారులపై దాడి, కిడ్నాప్ టీడీపీ నేతల అరెస్టు**



జీఎస్టీ అధికారులను కిడ్నాప్ చేసిన కేసులో గుంటూరు టీడీపీ నేతలు, వారి కుటుంబ సభ్యులను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వెంటనే పోలీసులు పట్టుకున్నారు.
- వివరాలు 10లో

**రానున్న రెండు రోజులు విస్తారంగా వర్షాలు**



పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది.
- వివరాలు 3లో





బుధవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీకి జ్ఞాపికను అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- వివరాలు 10లో

## రూపు మారిన పురాలు

**మంత్రి కేటీఆర్ వెల్లడి**

- తొమ్మిదేళ్లలో గణనీయమైన అభివృద్ధి
- పురపాలక శాఖ ద్వారా రూ.1.21 లక్షల కోట్ల వ్యయం
- రాష్ట్రానికి 70 శాతం ఆదాయం పట్టణాల నుంచే
- మౌలిక వసతుల కోసం తెచ్చే అప్పులు భవిష్యత్తు పెట్టుబడే
- ఎంఏయూడీ వార్షిక నివేదిక, పట్టణాభివృద్ధి దశాబ్ది నివేదిక విడుదల



సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్లలో తెలంగాణలోని పట్టణాల అభివృద్ధిలో గణనీయమైన మార్పు వచ్చిందని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.తారక రామారావు చెప్పారు. పురపాలక శాఖ ద్వారా రూ.1.21 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రాష్ట్రానికి వస్తున్న ఆదాయంలో 70% పట్టణాల నుంచేనని, ఈ నేపథ్యంలో పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన కోసం అప్పులు తెచ్చినట్లు తెలిపారు. మౌలిక వసతుల కోసం తెచ్చే అప్పులు భవిష్యత్తు పెట్టుబడేనని ఆయన పేర్కొన్నారు. బుధవారం మెట్రోరైల్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో తొమ్మిదేళ్లలో పురపాలక శాఖ మిగతా 3వ పేజీలో ▶





### బాబాయ్, ఇక తప్పుకో!

- మహారాష్ట్రలో ఎన్సీపీపై ఆధిపత్యం కోసం పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్, చీలిక వర్గం నేత, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇరువురు నేతలు బుధవారం బల ప్రదర్శనకు దిగారు. నంబర్‌గేమ్‌లో బాబాయిపై అబ్బాయి అజిత్‌దే పైచేయి అయింది. 53 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేల్లో అజిత్ సభకు 32 మంది హాజరయ్యారని ఆయన వర్గం నేతలు వెల్లడించారు. శరద్ భేటీకి 18 మంది ఎమ్మెల్యేలే హాజరైనట్లు సమాచారం. కొందరు ఎమ్మెల్యేలు ఇరు భేటీల్లోనూ పాల్గొనడం విశేషం! - 6లో

## ఆ 23 గ్రామాలు ఆదివాసీలవే

- హైకోర్టు సీజే ధర్మాసనం తీర్పు
- మంగపేట మండలంలోని ఆ గ్రామాలు 5వ షెడ్యూల్ పరిధిలోకే వస్తాయి
- సింగిల్ జడ్జి ఉత్తర్వులకు సమర్థన.. ఆదివాసీయేతరుల అప్పీల్ కొట్టివేత
- ఫలించిన 75 ఏళ్ల పోరాటం

సాక్షి, హైదరాబాద్: ఆదివాసీల 75 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలించింది. ములుగు జిల్లా మంగపేట మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలు ఆదివాసీలకే చెందుతాయని పేర్కొంటూ హైకోర్టు ధర్మాసనం బుధవారం కీలక తీర్పునిచ్చింది. ఆ గ్రామాలన్నీ రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ పరిధిలోకే వస్తాయని తేల్చిచెప్పింది. 2014 ఏప్రిల్ 17న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఆ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం కనిపించడం లేదని చెప్పింది. ఆ గ్రామాలు 5వ షెడ్యూల్ పరిధిలోకి రావన్న మిగతా 2వ పేజీలో ▶

### ఇదండీ సంగతి



అలా చేస్తే యూత్‌కు అవకాశం ఇచ్చినట్లేగా సార్.. అన్ని పార్టీలూ అమలు చేస్తే ఎంత బావుండు!

## క్లుప్తంగా...

### బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ బీజేపీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన మరునాడే మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి పార్టీలో కీలక పదవి వరించింది. రాజగోపాల్‌రెడ్డిని జాతీయ కార్యవర్గ సభ్యుడిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు. గత కొంతకాలంగా పార్టీ రాష్ట్ర నాయకత్వంపై అసంతృప్తిగా ఉన్న రాజగోపాల్ రెడ్డి... మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో భేటీ అయ్యారన్న వార్తల నేపథ్యంలో బీజేపీ అధిష్టానం అప్రమత్తమై ఈ నిర్ణయం తీసుకుంది. బుధవారం ఈ మేరకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

### టీమ్ ఓబీసీ పేరుతో కాంగ్రెస్ నేతల భేటీ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో బీసీలకు ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేస్తూ టీమ్ ఓబీసీ పేరిట కాంగ్రెస్ నేతలు మరోసారి సమావేశమయ్యారు. గత నెల 28న రాష్ట్రంలోని 50 మందికి పైగా బీసీ నేతలు హైదరాబాద్‌లో సమావేశమై నిర్ణయించిన మేరకు బుధవారం కాంగ్రెస్‌లోని ముఖ్య నేతలను కలిశారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్, కత్తి వెంకటస్వామి నేతృత్వంలోని టీమ్ ఓబీసీ బృందం బుధవారం ఉదయం మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పదవులు, రానున్న ఎన్నికల్లో బీసీలకు టికెట్ల కేటాయింపుపై ఆయనకు వినతిపత్రం సమర్పించారు. తర్వాత టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్ యాదవ్‌లతోనూ సమావేశమై ఇవే అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు.

### బండి తొలగింపు అవమానమే..



సాక్షి, హైదరాబాద్: బీసీలను అవమానించడం బీజేపీకి అలవాటుగా మారిందని, అందులో భాగంగానే బండి సంజయ్‌ని పార్టీ పగ్గాల నుంచి అవమానకర రీతిలో తొలగించారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. పార్టీ కీలక పదవుల్లో ఉన్న బీసీలను తొలగించి వారి ఓట్లు ఎలా అడుగుతారని బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు.

### బీసీ సంక్షేమానికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం కేంద్రమంత్రి రాందాస్ అథవాలేను బుధవారం కలసి బీసీ డిమాండ్లపై చర్చించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉపకారవేతనాలను పెంచాలన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు.

### గొర్రెల తీరుగా విపక్షాల విన్యాసం

ఏపీ జితేందర్‌రెడ్డి ట్వీట్



సాక్షి, హైదరాబాద్: ఒక స్తూలుపైన గొర్రెలు నిలబడేందుకు ప్రయత్నిస్తూ ఒకదాన్ని మరొకటి కిందకు తోసి వేస్తున్న వీడియోను బీజేపీ నేత, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి ట్విట్టర్‌లో పోస్ట్ చేసి దానికి 'ప్రధాన మంత్రి అభ్యర్థి కోసం విపక్షాలు పోటీపడుతున్న తీరు ఇది' ...అని ట్వీట్ చేశారు. ప్రధాని సీటు కోసం ఈ గొర్రెల మాదిరిగా విపక్ష నేతలు పోటీపడుతున్నారనే అర్థం వచ్చేలా ఉన్న ఈ వీడియో వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది.

### సర్పంచ్ నవ్య ఆధారాలు అందజేయలేదు!

ధర్మసాగర్: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యపై ధర్మసాగర్ మండలం జానకీపురం సర్పంచ్ కురుసపల్లి నవ్య చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల్లో వాస్తవాలు లేవని పోలీసులు తేల్చినట్టు తెలిసింది. జూన్ 21న ఎమ్మెల్యే టి.రాజయ్య, ధర్మసాగర్ ఎంపీపీ నిమ్మ కవిత, ఎమ్మెల్యే పీఏ శ్రీనివాస్, నవ్య భర్త ప్రవీణ్‌లపై వేధింపుల ఆరోపణలు చేసిన నవ్య ధర్మసాగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిని సుమోటోగా తీసుకున్న జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్‌లు సర్పంచ్ నవ్య కేసుపై సమాచారం సేకరించాలని పోలీసులను ఆదేశించాయి. ఈ క్రమంలో వేధింపులకు సంబంధించిన ఆధారాలు అందజేయాలని కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, ధర్మసాగర్ సీఐ ఒంటేరు రమేశ్‌లు సర్పంచ్ నవ్యకు నోటీసులు జారీ చేశారు. ఆమె ఎలాంటి ఆధారాలూ సమర్పించలేదని చెప్తున్నారు. సర్పంచ్ నవ్య నిర్దీత సమయానికి ఆధారాలు సమర్పించలేదని జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్లకు బుధవారం పోలీసులు వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది.

# అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం!

- క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీని ముందుకు తీసుకెళ్తా: కిషన్‌రెడ్డి
- రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా ముందుకెళ్తామని వెల్లడి
- 8న ప్రధాని మోదీ సభను విజయవంతం చేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపు



సాక్షి, న్యూఢిల్లీ/ సాక్షి, హైదరాబాద్: ''నేను ఏనాడూ పార్టీని ఏదీ అడగలేదు. కేంద్ర మంత్రిని కావాలని కోరలేదు. పార్టీ ఇచ్చిన ఆదేశాలను పాటిస్తూ వస్తున్నాను. 1980 నుంచి ఈరోజు వరకు ఒక సైనికుడిలా పనిచేస్తూ వస్తున్నాను. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా శిరోధార్యంగా భావిస్తా. పార్టీ సిద్ధాంతం కోసం పనిచేసే ఒక క్రమశిక్షణ గల కార్యకర్తగా బాధ్యతలు నిర్వర్తిస్తా..'' అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 8న వరంగల్‌లో జరిగే ప్రధాని మోదీ సభను విజయవంతం చేయడంపై తొలుత దృష్టిపెట్టనున్నట్టు చెప్పారు. రాష్ట్ర బీజేపీ కొత్త అధ్యక్షుడిగా నియామకం అయ్యాక బుధవారం సాయంత్రం తొలిసారిగా ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో, తర్వాత హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

**సమష్టి కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్తాం**

గతంలో తాను ఉమ్మడి ఏపీకి 2 సార్లు, తెలంగాణ ఏర్పడ్డాక తొలి బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశానని.. ఇప్పుడు అధిష్టానం నాలుగోసారి పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతను అప్పగించిందని కిషన్‌రెడ్డి చెప్పారు. మార్పులు, చేర్పులు ఏవైనా పార్టీ నాయకత్వం అన్నీ ఆలోచించే చేస్తుందని వ్యాఖ్యానించారు. జాతీయ, రాష్ట్ర నేతలతో సమన్వయం చేసుకుంటూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ముందుకెళ్తామని చెప్పారు.

**రైల్వే మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా వరంగల్**

ప్రధాని మోదీ వరంగల్‌లో రైలు వ్యాగన్ల తయారీ ఫ్యాక్టరీకి భూమి పూజ చేయనున్నారని.. వరంగల్‌ను రాబోయే రోజుల్లో రైల్వే మ్యాన్యుఫాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని కిషన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రానికి ఇంత పెద్ద వర్క్‌షాప్, తయారీ యూనిట్ రావడం ఇదే మొదటిసారి అన్నారు. అలాగే రూ.6వేల కోట్ల విలువైన జాతీయ రహదారుల పనులకు ప్రధాని భూమిపూజ చేస్తార ని తెలిపారు. దక్షిణ భారత రాష్ట్రాల బీజేపీ ముఖ్య నేతల సమావేశం ఈ నెల 9న హైదరాబాద్‌లో జరుగుతుందని.. 10న బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర పదాధికారుల సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

**ప్రధాని సభను విజయవంతం చేద్దాం**

ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తిరిగివచ్చిన కిషన్‌రెడ్డికి శంషాబాద్ విమానాశ్రయంలో బీజేపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. కిషన్‌రెడ్డిని, ఆయనకు స్వాగతం పలికేందుకు వచ్చిన ఈటల రాజేందర్‌ను కార్యకర్తలు భుజాలపై ఎత్తుకుని నినాదాలు చేశారు. తర్వాత ఊరేగింపుగా బయలుదేరి.. సమీపంలోని ఓ స్టార్ హోటల్‌కు చేరుకుని రాష్ట్ర పదాధికారుల భేటీ, వరంగల్‌లో మోదీ సభ సన్నాహక సమావేశంలో నిర్వహించారు. ప్రధాని సభను విజయవంతం చేసి సత్తా చాటుదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, ఈటలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్సీ ఏవీఎస్ రెడ్డి, పార్టీ నేతలు విజయశాంతి, గరికపాటి మోహన్‌రావు, చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రెండు రోజులు వరంగల్‌లోనే..**

ప్రధాని మోదీ సభకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి జనసమీకరణ చేయనున్నట్టు కిషన్‌రెడ్డి తెలిపారు. గురు, శుక్రవారాల్లో తాను వరంగల్‌లోనే బసచేసి పర్యటన ఏర్పాట్లు, సభకు జన సమీకరణను పర్యవేక్షిస్తానని కిషన్‌రెడ్డి తెలిపారు. సీనియర్ నేత, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ కూడా రెండురోజులు అక్కడే ఉండి సభ ఏర్పాట్లను సమీక్షించనున్నట్టు వివరించారు.

# సమయం తక్కువ.. సవాళ్లు ఎక్కువ!

▶ మొదటి పేజీ తరువాయి

సమయం కూడా నాలుగైదు నెలలే.. రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై అవగాహన, సంఘ్ పరివార్ అండదండలున్న కిషన్‌రెడ్డికి తోడుగా.. కేసీఆర్ వ్యూహాలు, ఎత్తుగడలపై పూర్తి అవగాహన ఉన్న ఈటల రాజేందర్‌ను రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమించిన నేపథ్యంలో వారు పరిస్థితులను ఎలా అధిగమిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఇంత తక్కువ సమయంలోనే పార్టీని చక్కదిద్ది, ఎన్నికలకు సిద్ధం చేయడం కత్తిమీద సామేనని బీజేపీ వర్గాలే అభిప్రాయపడుతున్నాయి. అన్నింటికన్నా ముందు ఈ నెల 8న ప్రధాని మోదీ వరంగల్ పర్యటన, బహిరంగ సభను విజయవంతం చేయడం కిషన్‌రెడ్డి ముందున్న ప్రథమ లక్ష్యమని అంటున్నాయి.

**పార్టీని చక్కదిద్దడమే ప్రధాన ఎజెండాగా..**

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడిన నేపథ్యంలో రాష్ట్ర బీజేపీలో అయోమయ, గందరగోళ పరిస్థితులను చక్కదిద్దడం ప్రధాన ఎజెండాగా మారిందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. బండి సంజయ్ స్థానంలో అధ్యక్షుడిగా నియమితుడైన కిషన్‌రెడ్డి ఈ దిశగా అవసరమైన చర్యలు చేపట్టి పార్టీ నాయకులు, కేడర్‌లో విశ్వాసాన్ని నింపే చర్యలు చేపట్టాల్సి ఉంటుందని అంటున్నాయి. దాదాపు నాలుగేళ్లుగా (ఎంపీగా ఎన్నిక, కేంద్ర మంత్రి పదవి చేపట్టిన నాటి నుంచి) రాష్ట్ర పార్టీ వ్యవహారాలు, నిర్ణయాల్లో పెద్దగా జోక్యం చేసుకోకుండా ఉన్న కిషన్‌రెడ్డి.. ఇప్పుడు పార్టీని గాడిలో పెట్టేందుకు పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొంటున్నాయి.

**అయిష్టత.. అసంతృప్తి మధ్య..**

తనకు అధ్యక్ష బాధ్యతలను కట్టబెట్టడంపై కిషన్‌రెడ్డి ఒకింత అసంతృప్తిగా ఉన్నారని.. అయిష్టంగానే బాధ్యతల స్వీకరణకు సిద్ధమవుతున్నారని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. బుధవారం ఢిల్లీలో జరిగిన కేబినెట్ భేటీకి ఆయన హాజరుకాకపోవడంతో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారనే ప్రచారం జరిగింది. తర్వాత ఆయన హుటాహుటిగానే మీడియాతో మాట్లాడారు. అనారోగ్య కారణాలతోనే కేబినెట్ భేటీకి వెళ్లలేదన్నారు. అధిష్టానం నిర్ణయం శిరోధార్యమని, పార్టీ ఏది ఆదేశిస్తే దానిని సైనికుడిగా పాటిస్తానని సాయంత్రం మీడియాతో పేర్కొన్నారు.

### పార్టీలో సంస్థాగత మార్పులతో..

బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గం, పదాధికారులు, జిల్లా అధ్యక్షుల మార్పు వంటి సంస్థాగత చర్యలు కిషన్‌రెడ్డికి తలకు మించిన భారంగా మారే అవకాశం ఉందని పార్టీ నేతలు అంటున్నారు. అధ్యక్ష మార్పు, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ఈటల రాజేందర్‌కు కీలక పదవి ఇవ్వడంపై పార్టీలో అసంతృప్తితో ఉన్న నేతలను బుజ్జగించడం, పార్టీ మారకుండా చూడటంపైనా కిషన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్తున్నారు. అధికార బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగట్టడం, రాష్ట్ర ప్రభుత్వంపై, కేసీఆర్‌పై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను బీజేపీకి అనుకూలంగా మార్చుకోవడం కూడా కీలకమని అంటున్నారు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ప్రాధాన్యత తగ్గించి.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటేననే భావాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తున్నారు. మొత్తంగా బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అనేలా ప్రజల్లో అభిప్రాయం కలిగించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉందని పేర్కొంటున్నారు. నాలుగైదు నెలల్లో ఎన్నికలు జరిగే నేపథ్యంలో ఆలోగా వీటన్నింటినీ ఏ మేరకు చక్కదిద్దగలరనే చర్చ జరుగుతోంది.

### ఢిల్లీలోనే సంజయ్.. పెద్దలతో చర్చలు

అత్యంత కీలకమైన ఎన్నికల సమయంలో తనను అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగించడంపై బండి సంజయ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని.. ఈ క్రమంలో కేంద్ర మంత్రి పదవి ఇస్తామన్నా స్వీకరించేందుకు అయిష్టత చూపుతున్నారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఈ విషయాన్ని ఆయన పార్టీ జాతీయాధ్యక్షుడు నడ్డాతోపాటు ఇతర పెద్దలకు వివరించినట్టు ప్రచారం జరుగుతోంది. సంజయ్‌తో సునీల్ బన్సల్ భేటీ అయి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వెనక్కి తగ్గలేదని అంటున్నారు. అయితే తనకు వ్యతిరేకంగా పనిచేసిన కొందరు నేతల అంశాన్ని బన్సల్ వద్ద ప్రస్తావించారని.. తనతోపాటు అధిష్టానం పెద్దలపై ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యల విషయాన్ని వివరించారని చెప్తున్నారు. ఈ క్రమంలో రఘునందన్‌రావుపై చర్యలు తీసుకునే విషయంపై అధిష్టానం సమాలోచనలు చేస్తున్నట్టు పేర్కొంటున్నారు. మరోవైపు పార్టీ తీసుకునే నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని సంజయ్ ఢిల్లీలో మీడియాకు చెప్పారు. రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌తో అపాయింట్‌మెంట్ ఉన్న కారణంగా బుధవారం ఢిల్లీలోనే ఆగి.. గురువారం హైదరాబాద్ వెళుతున్నట్టు వివరించారు.

### రైల్వే మంత్రితో బండి భేటీ

కాజీపేట–కరీంనగర్ కొత్త రైల్వేలైన్‌పై ప్రతిపాదన



సాక్షి, న్యూఢిల్లీ: కాజీపేట (హసన్‌పర్తి) నుంచి కరీంనగర్‌కు కొత్త రైల్వే లైన్ నిర్మించాలని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి ప్రతిపాదనలు అందజేశారు. ఈనెల 8న వరంగల్‌లో కాజీపేట వ్యాగన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, పీవోహెచ్‌కు భూమి పూజ జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై అశ్విని వైష్ణవ్ బండి సంజయ్‌తో చర్చించారు. కాజీపేట (హసన్‌పర్తి) నుండి కరీంనగర్‌కు కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా బండి సంజయ్ కోరారు. సానుకూలంగా స్పందించిన అశ్విని వైష్ణవ్ వెంటనే ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్)ను తెప్పించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో కేంద్ర జలవనరుల శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప పాల్గొన్నారు.

### రఘునందన్‌రావును అదుపులోకి తీసుకున్న పోలీసులు



అల్వాల్: గజ్వేల్‌లో రెండ్రోజుల క్రితం జరిగిన ఓ గొడవకు సంబంధించి బాధితుల తరఫున వాదించేందుకు కోర్టుకు వెళ్తున్న బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావును అల్వాల్ పోలీసులు బుధవారం హకీంపేట్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. సుమారు 2 గంటల పాటు స్టేషన్‌లో ఉంచిన అనంతరం ఆయనను పోలీసులు ఇంటికి తరలించారు. ఈ క్రమంలో ఆయనకు సంఘీభావంగా అల్వాల్, మచ్చబొల్లారం, మల్కాజిగిరి నుంచి పలువురు బీజేపీ నాయకులు పీఎస్‌కు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ...రెండ్రోజుల క్రితం గొడవకు దిగిన వారిని సకాలంలో అరెస్టు చేయకపోవడం వల్లే ఇరువర్గాల మధ్య అక్కడ ఘర్షణ జరిగినట్లు రఘునందన్‌రావు తెలిపారు. అక్కడ ఐదుగురిని అక్రమంగా అరెస్టు చేసి కరీంనగర్ జైలుకు పంపించారని, వారి తరఫున వాదించేందుకు వెళ్తుండగానే తనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని వివరించారు. బాధితుల పక్షాన పోరాడి వారికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఆ 23 గ్రామాలు ఆదివాసీలవే

▶ మొదటి పేజీ తరువాయి

ఆదివాసీయేతరుల వాదనలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డితో కూడిన ధర్మాసనం తప్పుబట్టింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ 2014 మేలో దాఖలు చేసిన రిట్ అప్పీల్‌ను కొట్టివేసింది. సింగిల్ జడ్జి అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే ఉత్తర్వులు జారీ చేశారని స్పష్టం చేసింది.

**75 ఏళ్ల క్రితం నుంచీ వివాదం..**

దాదాపు 75 ఏళ్ల క్రితం నుంచి ఈ గ్రామాలకు సంబంధించి ఆదివాసీ, ఆదివాసీయేతరుల మధ్య వివాదం ఉంది. ఇరువర్గాలు ఈ వివాదంపై పలుమార్లు కోర్టులను కూడా ఆశ్రయించాయి. మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల సర్పంచ్ ఎన్నికలు 2005 వరకు జనరల్ రొటేషన్ (జనాభా దామాషా) పద్ధతిన జరిగాయి. అయితే 2006లో రాష్ట్ర ప్రభుత్వం ఈ గ్రామాలను 'షెడ్యూల్డ్ ఏరియా'గా పేర్కొంటూ, ఎస్టీలకు 100% రిజర్వేషన్ ప్రకటిస్తూ సంబంధిత చట్టాల మేరకు ఎన్నికలు నిర్వహించడానికి నోటిఫికేషన్ ఇచ్చింది. దీనిపై ఆదివాసీయేతరులు కొందరు కోర్టును ఆశ్రయించారు. కానీ కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టేయడంతో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత ఇదే అంశంపై వివాదం కొనసాగుతుండటం, గిరిజనేతరులు కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలు నిలిచిపోయాయి. ఇదే క్రమంలో 2014లో వరంగల్ జిల్లాకు చెందిన మర్రి వెంకటరాజం, మరికొందరు హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వ నిర్ణయం చట్ట విరుద్ధమని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21లను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 ప్రకారం రాష్ట్రపతి ఈ గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాగా గుర్తించకున్నా.. ప్రభుత్వం మాత్రం వీటి పరిధిలో ఎన్నికలను ఆ చట్టాల మేరకే నిర్వహిస్తోందని తెలిపారు. ఈ గ్రామాల పరిధిలోని అన్ని పదవులను ఆదివాసీలకే రిజర్వు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ఈ పిటిషన్‌పై సింగిల్ జడ్జి విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు పూర్తిగా విన్న న్యాయమూర్తి.. సరిగా పరిశీలన చేయని కారణంగానే రాజ్యాంగం ప్రకారం ఈ గ్రామాలు షెడ్యూల్డ్ ప్రాంతాల జాబితాలోకి చేరలేదని చెప్పారు. పిటిషన్‌ను కొట్టివేస్తూ, ఆ గ్రామాలు షెడ్యూల్డ్ ప్రాంతం కిందికే వస్తాయని తీర్పునిచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ వెంకటరాజం అప్పీల్ దాఖలు చేయగా, విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ ధర్మాసనం..తీర్పును వెలువరించింది.

### ఈ తీర్పుతో సకల హక్కులు

హైకోర్టు తీర్పుతో ఆ 23 గ్రామాల్లో ఆదివాసీ చట్టాలు పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు ఆటంకం తొలగిపోనుంది. ఈ ఎన్నికల్లో ఆదివాసీయేతరులు పోటీ చేయడానికి అనర్హులు. ఆదివాసీలు మాత్రమే పోటీ చేయాలి. అటవీ హక్కుల చట్టం ఈ గ్రామాలకు కూడా వర్తిస్తుంది. ఇకపై ఇతర ఆదివాసీలు పొందిన 5వ షెడ్యూల్‌లోని హక్కులన్నీ వీరూ పొందుతారు.

– న్యాయవాది చిక్కుడు ప్రభాకర్

### తప్పుడు కేసులతో ఎన్నో కోల్పోయాం



తప్పుడు లిటిగేషన్ కేసులతో ఎన్నో ఏళ్లుగా విద్య, ఉద్యోగాలు, ఉపాధి, నీరు, నిధులు కోల్పోయాం. రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను పొందేందుకు 2005 నుంచి వివిధ గిరిజన ప్రజా సంఘాలు, ఉద్యోగ, విద్యార్థి సంఘాల సహకారంతో పోరాటం ప్రారంభించాం. 2006లో కేసు గెలిచాం. హైకోర్టు తీర్పుతో పూర్తి స్థాయిలో విజయం సాధించాం.

– గొప్ప వీరయ్య, మన్యసీమ పరిరక్షణ సమితి, డోలుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు

# మోదీ పర్యటనలో రూ.6,100 కోట్ల పనులకు శంకుస్థాపన

- 8న ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రధాని మోదీ
- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, రహదారుల పనులకు భూమిపూజ
- కాజీపేటలో రైల్వే వ్యాగన్ల యూనిట్‌కు శంకుస్థాపన



సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: ఈ నెల 8న ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతోపాటు హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ పర్యటనలో ఆయన రాష్ట్రంలో రూ.6,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధాని మోదీ 8వ తేదీన ఉదయం 10:45 గంటలకు వరంగల్‌కు చేరుకుని రూ.5,55 0 కోట్ల వ్యయంతో చేపట్టే 176 కి.మీ జాతీయ రహదారి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. నాగ్‌పూర్–విజయవాడ కారిడా ర్ కింద 108 కిలోమీటర్ల మంచిర్యాల–వరంగల్ సెక్షన్ ఇందులో భాగంగా ఉంది. దీనివల్ల మంచిర్యాల–వరంగల్ మధ్య 34 కి.మీ దూరం తగ్గుతుంది. 44, 65 జాతీయ రహదారులపై వాహన రద్దీ తగ్గుతుంది. దీంతోపాటు కరీంనగర్–వరంగల్ సెక్షన్‌లో 68 కి.మీ మేర 2 వరుసలుగా ఉన్న రహదారిని 4 వరుసలుగా అభివృద్ధి చేసే పనులకు శంకుస్థాపన చేస్తారు. హైదరాబాద్–వరంగల్ పారిశ్రామిక కారిడార్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేటలో రూ. 500 కోట్లతో చేపట్టనున్న రైలు వ్యాగన్ల తయారీ కర్మాగారం నిర్మాణానికి మోదీ శంకుస్థాపన చేస్తారు.

# మళ్లీ క్షేత్ర స్థాయి పర్యటనలకు కేసీఆర్

- సీఎం పర్యటన షెడ్యూలుపై కసరత్తు
- ఈ నెల మూడో వారం నుంచి జిల్లాల్లో వరుస కార్యక్రమాలు
- మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో బహిరంగ సభల నిర్వహణ



సాక్షి, హైదరాబాద్: గత నెలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, జిల్లాల పర్యటనలు, మహారాష్ట్ర టూర్ షెడ్యూలుతో బిజీగా గడిపిన ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఈ నెల మూడో వారం నుంచి మళ్లీ క్షేత్ర స్థాయి పర్యటనలు మొదలు పెడుతున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంతో పాటు ఈ ఏడాది చివరలో జరిగే ఎన్నికల సన్నద్ధతను మరింత వేగవంతం చేయాలని భావిస్తున్నారు. సీఎం కేసీఆర్ ఈ నెల మూడో వారం నుంచి పాల్గొనే వరుస కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూలు సిద్ధమవుతోంది. జిల్లా కలెక్టరేట్ సముదాయాలు, బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయాల ప్రారంభంతో పాటు బహిరంగ సభల్లో కేసీఆర్ పాల్గొంటున్నారు. జూలైలో మరో ఐదు జిల్లాల్లో పర్యటించనున్నారు. సీఎం జిల్లాల పర్య టన షెడ్యూలును మరో రెండు రోజుల్లో ప్రకటించే అవకాశముందని సమాచారం. సీఎం పర్యటించే జిల్లాల జాబితాలో సూర్యాపేట, నల్లగొండ, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉన్నాయి. ఆదిలా బాద్ జిల్లాలో ఈ నెల 15 తర్వాత సీఎం పర్యటన ఉండే అవకాశం ఉండగా, జిల్లా కలెక్టరేట్ సముదాయం, పార్టీ కార్యాలయంతో పాటు చనాకా–కొరాటా ప్రాజెక్టును ప్రారంభించే అవకాశముందని చెపుతున్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోనూ కలెక్టరేట్ సముదా యంతో పాటు మెడికల్ కాలేజీని కేసీఆర్ ప్రారంభిస్తారని తెలుస్తోంది. సూర్యాపేట లేదా కోదాడలో బస చేసి మరుసటి రోజు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే సభకు హాజరయ్యేలా సీఎం షెడ్యూలు ఉంటుందని తెలుస్తోంది. మెదక్, కరీంనగర్ జిల్లాల కలెక్టరేట్ సముదా యాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, నెలాఖరు లోగా కేసీఆర్ ప్రారంభిస్తారని ఆ వర్గాలు తెలిపాయి.

**ఇతర జిల్లాల్లోనూ బహిరంగ సభలు**

జిల్లా కలెక్టరేట్ల ప్రారంభం లేని చోట కూడా బహిరంగ సభలు నిర్వహించే యోచనలో బీఆర్ఎస్ అధినేత ఉన్నట్లు పార్టీ వర్గాల సమా చారం. 2018 ఎన్నికల తర్వాత నారాయణపేట జిల్లాలో అడుగు పెట్టని సీఎం కేసీఆర్, ఈ జిల్లాలో త్వరలో పర్యటించే అవకాశముందని స్థానిక బీఆర్‌ఎస్ నేతలు చెపుతున్నారు. గత నెలలో మహారాష్ట్రలోని నాగపూర్, సోలాపూర్‌లలో పర్యటించిన కేసీఆర్.. త్వరలో పుణే లేదా భివండీలో సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలుస్తోంది. మరోవైపు మధ్యప్రదేశ్‌లోనూ పార్టీ కార్యకలాపాలు ప్రారంభం కావడంతో అక్కడా సభల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహారాష్ట్రలోని ఔరంగాబాద్, పుణేలలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలను ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నెల 8తో మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు, సంస్థాగత కమిటీల ఏర్పాటు షెడ్యూలు కొలిక్కి రానుంది. ఇప్పటికే 20 లక్షల మంది బీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకున్నట్లు మహా రాష్ట్ర నేతలు వెల్లడించారు. సంస్థాగత కమిటీల శిక్షణ కార్యక్రమానికి ఈ నెల 20 తర్వాత మహారాష్ట్రలో సీఎం పర్యటించే అవకాశ ముంది. ఏడాది చివరలో జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఈ నెల 18 లేదా 19న మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాష్ట్ర కార్యవర్గం, కార్పొరేషన్, జిల్లా పరిషత్ చైర్మన్లతో సమావేశం ఉంటుందని తెలంగాణ భవన్ వర్గాలు వెల్లడించాయి.

# ఖర్చుపెట్టిందే రూ.80వేల కోట్లు.. లక్షకోట్ల అవినీతి ఎలా?

కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో అవినీతి ఆరోపణలపై మంత్రి హరీశ్‌రావు ధ్వజం



సిద్దిపేటలో తుంపర సేద్యం పరికరాలను పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్ రావు

సాక్షి, సిద్దిపేట: కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని రాహుల్ గాంధీ చెప్పడం విడ్డూరంగా ఉందని, ఆ ప్రాజెక్టుకు ఖర్చు పెట్టిందే రూ.80 వేల కోట్లు అయితే లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పూజ, తుంపర సేద్య పరికరాలు, దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్క చెరువు అయినా బాగు చేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, వాళ్లది నోరా.. మోరీయా అని మండిపడ్డారు. చేతకాని దద్దమ్మలే ఇలాంటి విమర్శలు చేస్తారని, వారి నోళ్లను ఫినాయిల్‌తో కడగాలని ధ్వజమె త్తారు. కాళేశ్వరం దండగ అంటున్నారని, కానీ దాని వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరిందో ఇక్కడికి వచ్చి చూస్తే అర్థం అవుతుందన్నారు. కాళేశ్వరం పూర్తవడంవల్లే కదా యాసంగిలో అంత పంట పండింది అని హరీశ్‌రావు గుర్తు చేశారు. గత ప్రభు త్వాల హయాంలో రాత్రి వేళ కరెంటు వచ్చేదని, కానీ ఇవాళ సీఎం కేసీఆర్ నాయకత్వంలో 24 గంటలూ సరఫరా జరుగుతోందన్నారు. రైతులు అధైర్య పడవద్దని, కాలం ఎత్తి పోయినా.. కాళేశ్వరం ద్వారా పొలాలకు నీళ్లు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. తమ తొమ్మిదేళ్ల పాలనలో రైతు ల కరెంటుకు రూ.60 వేల కోట్లు వెచ్చించామని, రూ.72 వేల కోట్లు రైతుబంధు కింద అందించామని వివరించారు. దేశంలోనే అత్యధిక పింఛన్‌ను తెలంగాణలో ఇస్తున్నామని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో వెయ్యి రూపాయలకు మించి ఇవ్వడం లేదని అన్నారు.

# పార్టీలో మార్పులు చేర్పులు నిరంతర ప్రక్రియ

- అధిష్టానం తీసుకునే నిర్ణయాలకు అందరూ కట్టుబడి పని చేయాలి
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్



మోదీ తొమ్మిదేళ్ల పాలనకు సంబంధించిన పుస్తకాలను అందజేస్తున్న లక్ష్మణ్

ముషీరాబాద్ (హైదరాబాద్): బీజేపీలో మార్పులు చేర్పులు నిరంతర ప్రక్రియ అని, పార్టీలో ఎవరి సేవలు ఎక్కడ కావాలో అధిష్టానం ఆలోచిస్తుందని, పార్టీ భవిష్యత్తు కోసం అధిష్టానం తీసుకున్న నిర్ణయాలకు అందరూ కట్టుబడి ఉండాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా మోదీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే 'సంపర్క్‌సే సమర్థన్'కార్యక్రమంలో భాగంగా కె.లక్ష్మణ్ బుధవారం అడిక్‌మెట్ డివిజన్‌లోని పలువురు డాక్టర్లు, ఇంజనీర్లు, రిటైర్డ్ ఉద్యోగుల నివాసాలకు వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర ప్రజలు గంపెడు ఆశతో బీజేపీ వైపు ఎదురు చూస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కలిసికట్టుగా పని చేస్తూ వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. బీజేపీకి ప్రధాన ప్రత్యర్థి ఎవరో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు తేల్చుకోవాలని, బీఆర్‌ఎస్‌కు బీ టీమ్‌గా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్‌కు బీ టీమ్‌గా ఢిల్లీలో బీఆర్‌ఎస్ పార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ దూతగా యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ రెండ్రోజుల క్రితం కేసీఆర్‌ను కలిసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గత తొమ్మిదేళ్లలో ప్రధాని మోదీ చేసిన కార్యక్రమాలను పుస్తక రూపంలో తీసుకువచ్చినట్లు తెలిపారు.

## క్లుప్తంగా...

### అమ్మతో కలిసి నానమ్మ ఊరికి..

- వచ్చే వారం కోనాపూర్‌కు కేటీఆర్
- సొంతంగా నిర్మించిన బడి ప్రారంభం

సాక్షి, కామారెడ్డి: మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ కామారెడ్డి జిల్లా కోనాపూర్‌లో తన నానమ్మ పేరిట నిర్మించిన పాఠశాల భవనాన్ని.. తల్లి శోభమ్మతో కలిసి ప్రారంభించనున్నారు. నానమ్మ పుట్టి పెరిగిన కోనాపూర్‌లో కేటీఆర్ సొంత డబ్బులతో పాఠశాలను నిర్మించడం తెలిసిందే. ఇప్పటికే పాఠశాల భవనం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో భవన ప్రారంభోత్సవ కార్యక్రమం వచ్చేవారం ఉంటుందని అధికార వర్గాలకు సమాచారం అందింది. కార్యక్రమానికి తానూ వస్తానని కేటీఆర్ తల్లి శోభమ్మ కేటీఆర్‌కు చెప్పినట్టు సమాచారం. విదేశాల్లో ఉన్న శోభమ్మ తిరిగి రాగానే కోనాపూర్ కార్యక్రమం తేదీ ఖరారు కానుంది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కోనాపూర్ పాఠశాల ప్రారంభోత్సవంతో పాటు కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించడానికి కేటీఆర్‌ను ఆహ్వానించారు. జిల్లా కేంద్రంలో నర్సన్నపల్లి నుంచి టేక్రియాల్ వరకు నిర్మించిన 6 వరుసల రోడ్డు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభిస్తారని తెలుస్తోంది.

### రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసులు భాగస్వాములు కావాలి

మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసులు భాగస్వాములు కావాలని, తెలంగాణకు చేయూతనివ్వాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం టంపాలో బీఆర్‌ఎస్ యూఎస్‌ఏ కన్వీనర్ చందు తాళ్ల అధ్యక్షతన జరిగిన ప్రవాస తెలంగాణవాసుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. తొమ్మిదేళ్లలో తెలంగాణ స్వరూపం మారిపోయిందని, పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక దిగ్గజాలు క్యూ కడుతున్నారని పేర్కొన్నారు. ఎదుగుతున్న తెలంగాణకు మట్టిబిడ్డల సహకారం కావాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి కానుగంటి, టోని జాను, మోహిత్ కర్పూరం, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఫ్లోరిడా అధ్యక్షుడు అనిల్ బందారం, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి కంచర్ల, తెలుగు అసోసియేషన్ ఆఫ్ ఫ్లోరిడా అధ్యక్షురాలు మహతిరెడ్డి, నాట్స్ చైర్మన్ శ్రీనివాస్ గుత్తికొండ తదితరులు పాల్గొన్నారు.

### సివిల్స్ శిక్షణ అభ్యర్థులకు హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ పరిధిలోని ఎస్సీ స్టడీసర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్‌టికెట్లను ఎస్సీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డైరెక్టర్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3,405 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఈనెల 9వ తేదీన హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్‌లోని యూనివర్సిటీ పీజీ కాలేజీ, దోమల్‌గూడలోని ఏవీ కళాశాల, నాంపల్లిలోని సరోజినీ నాయుడు వనితా మహా విద్యాలయ, కోఠీలోని మహిళా కళాశాల, వరంగల్ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, నిజామాబాద్ గవర్నమెంట్ గిరిరాజ్ కళాశాలలో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ వివరించారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష సాగుతుందని, ప్రతిభ ఆధారంగా ఉచిత శిక్షణ కు ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.tsstudy circle.co.in వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

### 'రవాణారంగ కార్మికుల సంరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలి'



అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు

పంజగుట్ట (హైదరాబాద్): రవాణారంగ కార్మికుల కోసం సంరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ రవాణారంగ కార్మికుల ఐక్యసమితి (జేఏసీ) డిమాండ్ చేసింది. రవాణారంగం వల్ల కోట్ల రూపాయలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ట్యాక్సుల రూపంలో ఆదాయం చేకూరుతున్నా వారి సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్ ఎస్.దయానంద్ మాట్లాడుతూ, ఆటో, క్యాబ్, లారీ, ప్రైవేట్ బస్, ప్రైవేట్ డ్రైవర్స్, మెకానిక్స్, ఆటో మొబైల్స్ ఇలా రవాణా రంగంపై సుమారు రెండున్నర కోట్ల మంది ఆధారపడి ఉన్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రవాణారంగ కార్మికులకు కనీసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా ప్రభుత్వాలకు రాకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. వెంటనే కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఓలా, ఉబర్, ర్యాపిడో, బైక్స్ ట్యాక్సీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ట్యాక్సీ నెంబర్ లేని ర్యాపిడో టూవీలర్లకు ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. 10 సంఘాలు ఐక్యమై జేఏసీ ఏర్పాటు చేసుకున్నామని, డిమాండ్లు సాధించే వరకు జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని వెల్లడించారు.

# ఆటో, ఐటీకి కేరాఫ్‌గా తెలంగాణ

- ఉత్తమ మౌలిక సదుపాయాలు, మానవ వనరులతో అభివృద్ధి: కేటీఆర్
- మొబిలిటీ రంగంలో దేశంలోనే తొలి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇక్కడే
- పలు సంస్థల కార్యాలయాలను ప్రారంభించిన మంత్రి

హఫీజ్‌పేట్ (హైదరాబాద్): దేశంలో ఆటో, ఐటీకి తెలంగాణ రాష్ట్రం కేరాఫ్‌గా మారిందని.. రాష్ట్రంలో ఆటోమోటివ్, మొబిలిటీ పరిశ్రమను మరింత బలోపేతం చేస్తామని మంత్రి కె.తారకరామారావు చెప్పారు. ఉత్తమ మానవ వనరులు, నైపుణ్యానికి హైదరాబాద్ నగరం ఎంతో గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో పలు సంస్థల కార్యాలయా లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మాట్లాడారు. ప్రపంచంలోని ప్రముఖ ఆటోమేకర్లలో ఒకటిగా, మొబిలిటీ ప్రొవైడర్‌గా గుర్తింపు పొందిన స్టెల్లాంటిస్ డిజిటల్ హబ్ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించడం ఒక మైలురాయి అని కేటీఆర్ పేర్కొన్నారు. సుస్థిర మొబిలి టీకి మాత్రమే భవిష్యత్తు ఉందని చెప్పారు.

**మొబిలిటీలో తొలి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇక్కడే..**

మంత్రి కేటీఆర్ సమక్షంలో టీ–హబ్ ప్రాంగణంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, హ్యుందాయ్ మొబిస్ ఇన్, బిట్స్ హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వాల మధ్య వ్యూహాత్మక సహకారానికి సంబంధించి ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మొబిలిటీ రంగంలో దేశంలోనే తొలి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారనుందని చెప్పారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో కోర్సుల రూపకల్పన, పరిశోధన, అభివృద్ధి, విద్యార్థులకు శిక్షణలో ఈ భాగస్వామ్యం ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు.

**రిసోర్స్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా హైదరాబాద్**

నానక్‌రాంగూడలో రైట్ సాఫ్ట్‌వేర్ సంస్థ కొత్త డెవలప్‌మెంట్ సెంటర్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. తెలంగాణ ఏర్పాటయ్యాక ఐటీ రంగంలో హైదరాబాద్ ఎంతో ప్రగతి సాధించిందని.. రిసోర్స్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా మారిందని చెప్పారు. 2014లో 3.23 లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉండగా.. ఇప్పుడు 9.05 లక్షల మందికి చేరారని, ఐటీ ఎగుమతులు రూ.2.41 లక్షలకు పెరిగాయని వివరించారు.



రైట్ సాఫ్ట్‌వేర్ సెంటర్‌లో రోబోను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

# మరో 8 కొత్త మెడికల్ కాలేజీలు..

▶ మొదటి పేజీ తరువాయి



మెడికల్ కాలేజీలు ప్రకటించడంతో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి సబితారెడ్డి

తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. అంటే కొత్తగా 800 మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. రాష్ట్రంలోని 33 జిల్లాలకుగాను ఇప్పటికే 25 జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటయ్యాయి. ఈ ఎనిమిది కూడా అందుబాటులోకి వస్తే.. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం చేరుకున్నట్టు అవుతుంది. వీటితో కలిపి రాష్ట్రంలోని మొత్తం ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 34కు చేరుతుంది. అంతేకాదు.. దేశంలో అన్ని జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ రికార్డు నెలకొల్పనుంది.

**భారీగా పెరిగిన వైద్య సీట్లు:** తెలంగాణ ఏర్పాటయ్యాక రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వైద్య కళాశాలలతో రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లు గణనీయంగా పెరిగాయి. 2014లో ప్రభుత్వ కాలేజీల్లో 850 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా.. ఈ ఏడాది నాటికి 3,790కి పెరిగాయి. కొత్తగా రానున్న 8 మెడికల్ కాలేజీల్లో మరో 800 మెడికల్ సీట్లు ఉంటాయి. దీంతో మొత్తంగా రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,590 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ, ప్రైవేటు కలిపి చూస్తే.. 2014కు ముందు రాష్ట్రంలో 20 మెడికల్ కాలేజీలు ఉంటే.. ఈ ఏడాది ఆ సంఖ్య 56కు చేరుకుంది. ఇదే సమయంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 2,850 నుంచి 8,340కు చేరింది. కొత్త మెడికల్ కాలేజీల సీట్లనూ కలిపితే 9,140 సీట్లకు చేరుతుంది. కొత్తగా దరఖాస్తు చేసుకున్న ప్రైవేటు మెడికల్ కాలేజీల ద్వారా మరికొన్ని సీట్లు రానున్నాయి. అంటే తెలంగాణలో మొత్తంగా 10 వేల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే ప్రతి లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లతో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉండగా.. సగటున 7.5 పీజీ సీట్లతో రెండో స్థానంలో నిలిచింది. 2023–24లో దేశవ్యాప్తంగా కొత్తగా అందుబాటులోకి వచ్చిన 2,118 మెడికల్ సీట్లలో ఒక్క తెలంగాణలోనివే 900 (43 శాతం) కావడం గమనార్హం.

**రాష్ట్రంలో వైద్య విద్య విప్లవం**

జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని ప్రకటించి, అనతి కాలంలోనే మాట నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. మెడికల్ కాలేజీల ఏర్పాటు ద్వారా రాష్ట్ర విద్యార్థులకు వైద్య విద్యను, పేద ప్రజలకు స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేశారు. కొత్త మెడికల్ కాలేజీలు, లోకల్ రిజర్వేషన్ వల్ల డాక్టర్ కావాలనుకునే తెలంగాణ విద్యార్థులకు అపార అవకాశాలు అందుతున్నాయి.

– హరీశ్‌రావు, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి

**'జిల్లాకో మెడికల్ కాలేజీ' ఇలా..**

- 2014కు ముందు రాష్ట్రంలో గాంధీ (1954), ఉస్మానియా (1946), కాకతీయ (1959), రిమ్స్ ఆదిలాబాద్, నిజామాబాద్ మెడికల్ కాలేజీ ఉన్నాయి.
- 2016–17లో మహబూబ్‌నగర్, సిద్దిపేట జిల్లాల్లో, 2018–19లో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కాలేజీలు ఏర్పాటయ్యాయి.
- గత ఏడాది (2022–23)లో మంచిర్యాల, రామగుండం, జగిత్యాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డి జిల్లాల్లో ఏర్పాటు చేశారు.
- ఈ ఏడాది (2023–24) కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగాం జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్నాయి.
- వచ్చే ఏడాది (2024–25)లో జోగుళాంబ గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ప్రారంభం కానున్నాయి.

# రూపు మారిన పురాలు

▶ మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి నివేదిక, ఎంఏయూడీ వార్షిక నివేదికను మంత్రి విడుదల చేశారు. పట్టణాల అభివృద్ధిపై 2014 మొదలుకుని ప్రతి ఏటా ప్రగతి నివేదికను విడుదల చేస్తున్నామని, ఈసారి దశాబ్ది నివేదిక పేరిట 2014 నుంచి సాధించిన ప్రగతిని అందులో పొందుపరిచినట్లు తెలిపారు.

**గత పదేళ్లలో 462 శాతం ఎక్కువ వ్యయం**

2004 నుంచి 2014 వరకు పట్టణాల్లో మౌలిక వసతుల కోసం చేసిన రూ.26,211.50 కోట్ల ఖర్చుతో పోలిస్తే.. గత పదేళ్లలో 462 శాతం ఎక్కువ వెచ్చించామన్నారు. ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.1,21,294 కోట్లలో రూ. 1,11,360 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ నిధులు కాగా, కేవలం రూ.9,934 కోట్లు మాత్రమే కేంద్ర ప్రభుత్వ నిధులని తెలిపారు. అన్ని రంగాలలో గతంలో కంటే అనేక రెట్లు ఎక్కువ ఖర్చు చేశామని, మౌలిక వసతుల కల్పనలో గణనీయమైన వృద్ధి సాధించామని, ఇందులో భాగంగానే 26 మున్సిపాలిటీలకు కేంద్రం అవార్డులు ఇచ్చిందని చెప్పారు.

**అధిక శాతం జీహెచ్‌ఎంసీ పరిధిలోనే..**

పదేళ్లలో పట్టణాల్లో మౌలిక సదుపాయాల కోసం చేసిన వేల కోట్ల వ్యయంలో అధిక భాగం జీహెచ్‌ఎంసీ పరిధిలోనే జరిగిందని కేటీఆర్ వివరించారు. 2004–14 కాలంలో రూ.4,636.38 కోట్లు వెచ్చిస్తే, 2014–23 మధ్య కాలంలో రూ.44,021.99 కోట్లు వెచ్చించామని, ఇది దాదాపు 850 శాతం అధికమని అన్నారు. ఈ మధ్య కాలంలో జీహెచ్‌ఎంసీ ఎస్‌ఆర్‌డీపీ, సీఆర్‌ఎంపీ, హెచ్‌ఆర్‌డీసీ, ఎస్‌ఎన్‌డీపీ వంటి ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రణాళికా బద్ధంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం వల్లనే ఇది సాధ్యమైందని చెప్పారు. ఎస్‌ఆర్‌డీపీ ద్వారా సుమారు 35 పై ఓవర్లు నిర్మించామని, కానీ ఉప్పల్, అంబర్‌పేట పై ఓవర్లను నేషనల్ హైవే అథారిటీ పూర్తి చేయలేక పోతోందని అన్నారు.

**మున్సిపాలిటీల్లో రూ.238 కోట్లతో పనులు**

హైదరాబాద్ చుట్టూ ఉన్న మున్సిపాలిటీల్లో రూ.238 కోట్లతో 19 పనులు చేపట్టామని, అందులో ఏడు పనులు పూర్తి కాగా, మిగతావి కూడా వేగంగా జరిగేలా ఆదేశాలిచ్చినట్లు కేటీఆర్ తెలిపారు. నగరంలో ప్రధాన రహదారుల నాణ్యత పెరిగిందని, వరద ఇబ్బందులను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చెరువుల సుందరీకరణను పెద్ద ఎత్తున చేపట్టామని, ఎస్‌ఎన్‌డీపీ కింద నాలాలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. గతంలో ముంపు వల్ల 150 కాలనీలు ఇబ్బంది పడేవని, ఎస్‌ఎన్‌డీపీ వల్ల ఈ బాధ తప్పిందని పేర్కొన్నారు. 2050 నాటికి నగరంలో తాగునీటి సమస్య లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ప్రజారవాణాను మెరుగుపర్చడంలో భాగంగా మెట్రో విస్తరణ, బస్సుల ఎలక్ట్రిఫికేషన్, పాతబస్తీకి మెట్రో కనెక్టివిటీ, భవిష్యత్తులో నిరంతర నీటి సరఫరా, నాలాల మరమ్మతు లాంటి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. శామీర్‌పేట్, మేడ్చల్ వైపు డబుల్ డెక్కర్ స్కైవేలు కట్టనున్నట్లు చెప్పారు. మెట్రో రైళ్లలో రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో కోచ్‌ల సంఖ్యను పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

## 8న పాస్‌పోర్టు ప్రత్యేక డ్రైవ్

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): పాస్‌పోర్టు దరఖాస్తుల సమర్పణకు సుదీర్ఘ కాలం సమయం పడుతుండటంతో విదేశాంగ శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 8వ తేదీన పాస్‌పోర్టు అపాయింట్మెంట్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలోని బేగంపేట, అమీర్‌పేట్, టోలిచౌకి, నిజామాబాద్, కరీంనగర్‌లోని పాస్‌పోర్టు సేవా కేంద్రాలతో పాటు 14 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో కూడా అపాయింట్మెంట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ నెల 15, 22, 29 తేదీల్లో వచ్చే శనివారాల్లో కూడా ప్రత్యేక డ్రైవ్ ఉంటుందని వివరించారు. ఒక్కొక్క తేదీన 3641 సాధారణ, తత్కాల్ పాస్‌పోర్టు దరఖాస్తులతో పాటు పీసీసీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## కీలక పోస్టులు ఎందుకు భర్తీ చేయరు?

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై హైకోర్టు అసహనం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అత్యంత కీలకమైన, రాజ్యాంగ బద్ధమైన పోస్టులను కూడా ఎందుకు భర్తీ చేయరని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మానవ హక్కుల కమిషన్ చైర్మన్, సమాచార చీఫ్ కమిషనర్ (సీఐసీ), సమాచార కమిషనర్ (ఐసీ).. లాంటి పోస్టులను ఖాళీగా ఉంచడంపై అసహనం వ్యక్తం చేసింది. వీలైనంత త్వరగా సీఐసీ, ఐసీ పోస్టులు భర్తీ చేయాలని ఆదేశించింది. కొన్ని నెలలుగా సీఐసీ, ఐసీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వం నియామకం చేపట్టడం లేదని పేర్కొంటూ హైకోర్టులో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేసింది. ప్రజల దరఖాస్తులు పెద్ద ఎత్తున పేరుకుపోతున్నాయని, సమస్యలు పరిష్కారం కాక వారు ఇబ్బంది పడుతున్నారని పేర్కొంది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. కాగా, సీఐసీ, ఐసీ పోస్టుల భర్తీ కోసం చర్యలు చేపట్టామని, అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతూ ఓ పత్రికలో ప్రకటన కూడా ఇచ్చామని ఏజీ బీఎస్ ప్రసాద్ కోర్టుకు చెప్పారు. ఆగస్టు 4 వరకు ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. దీంతో హైకోర్టు తదుపరి విచారణను ఆగస్టు 23కు వాయిదా వేసింది.

## ఇన్నాళ్లూ ఏం చేశారు?: హైకోర్టు

- ఆక్రమణల తొలగింపుపై మధ్యంతర స్టే
- రెండు వేల కుటుంబాలకు ఇబ్బందులు కలిగించొద్దని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం నడిగడ్డలో 40 ఎకరాల్లోని ఆక్రమణల తొలగింపుపై హైకోర్టు స్టే ఇచ్చింది. ప్రస్తుతానికి తొలగింపు ప్రక్రియ ఆపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఆర్‌పీఎఫ్‌ను ఆదేశించింది. ఆక్రమించుకుని 40 ఏళ్లుగా ఉంటున్న వారిపై ఇప్పటివరకు ఎందుకు మౌనంగా ఉన్నారని.. ఇప్పుడు భూమి స్వాధీనానికి ఎందుకు అంత తొందర పడుతున్నారని ప్రశ్నించింది. 2వేల కుటుంబాలకు ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు, రేషన్‌కార్డులు ఇచ్చి, ఇప్పుడు భూ స్వాధీనం కోసం తొందరపడటం సుముచితం కాదని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ వరకు స్టే ఉత్తర్వు అమల్లో ఉంటుందని, అప్పటివరకు వారికి ఎలాంటి అంతరాయం కలిగించవద్దంటూ విచారణను ఆగస్టు 23కు వాయిదా వేసింది. ఈ విషయంలో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సీఆర్‌పీఎఫ్ డీజీ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. నడిగడ్డలోని సుభాష్ చంద్రబోస్ నగర్, ఓంకార్ నగర్‌లోని భూమిలో 40 ఏళ్లుగా ఉంటున్న 2 వేల కుటుంబాలను బలవంతంగా వెళ్లగొడుతున్నారని పేర్కొంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. మానవ హక్కులను ఉల్లంఘిస్తూ ప్రభుత్వం తొలగింపు చర్యలు చేపడుతోందని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. కేంద్రం తరఫున డీఎస్‌జీ గాడి ప్రవీణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. 2వేల కుటుంబాలు సీఆర్‌పీఎఫ్ భూమిని ఆక్రమించాయని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. తొలగింపుపై స్టే విధిస్తూ, విచారణను వాయిదా వేసింది.

## రానున్న రెండు రోజులు విస్తారంగా వర్షాలు

**పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం**

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 1.5 కిలోమీటర్ల నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, కుమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాలలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని సూచించింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలలో కొన్ని ప్రాంతాల్లో అతిభారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉంది.

**ఈ సీజన్‌లో 10.5 సెంటీమీటర్ల వర్షపాతం...**

నైరుతి రుతుపవనాల సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 10.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూన్ 1వ తేదీ నుంచి జూలై 5వ తేదీ వరకు 15.4 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. కానీ రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో వర్షాలు మందగించాయి. దీంతో రాష్ట్రంలో లోటు వర్షపాతం ఉంది. ఈ సీజన్‌లో సాధారణ వర్షపాతం కంటే 32శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 2.51 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా సిద్దిపేట జిల్లాలో 6.24 సెంటీమీటర్లు, జనగామ జిల్లాలో 6.21 సెంటీమీటర్లు, పెద్దపల్లి జిల్లాలో 4.71 సెంటీమీటర్లు, నిర్మల్ జిల్లాలో 4.60 సెంటీమీటర్ల వర్షం కురిసింది.



**బుధవారం అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు (సెం.మీ.లలో)**

| ప్రాంతం | సెంటీమీటర్లు |
|---|---|
| షేక్‌పేట్ | 7.68 |
| జాఫర్‌గఢ్ | 5.53 |
| దమ్మపేట | 5.18 |
| గంగారం | 4.53 |
| సుజాతనగర్ | 3.58 |

## టీఎస్‌పీఎస్సీ కేసులో మరో ఇద్దరు అరెస్టు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ హైటెక్ మాస్ కాపీయింగ్ కేసులో మరో ఇద్దరు నిందితులను సిట్ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో సూత్రధారిగా ఉన్న మాజీ ఏఈ పూల రమేష్‌కు వీరిద్దరూ సహకరించారన్న ఆరోపణలున్నాయి. టీఎస్‌పీఎస్సీ పరీక్ష కేంద్రంగా ఉన్న కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ కళాశాల లెక్చరర్ విశ్వప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

## ఆర్‌ఎంసీ సమావేశాన్ని వాయిదా వేయండి

కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసేందుకు ఈ నెల 14న నిర్వహించతలపెట్టిన ఆర్‌ఎంసీ సమావేశాన్ని వాయిదా వేయాలని కృష్ణా బోర్డుకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి.మురళీధర్ తాజాగా లేఖ రాశారు. ఈ నెల 12 నుంచి 14 వరకు కృష్ణా ట్రిబ్యునల్ విచారణ నిర్వహించనుందని, ఈ నేపథ్యంలో ఆర్‌ఎంసీ సమావేశాన్ని వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు.

## 23న బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం

లింగోజిగూడ: ఈనెల 23వ తేదీన కరీంనగర్ ఉమ్మడి జిల్లా హుజూరాబాద్‌లో బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు ధూప దీప నైవేద్య జేఏసీ చైర్మన్, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. ఎల్‌బీనగర్ శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్లో బుధవారం బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర కార్యవర్గ సమావే శం నిర్వహించారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు మాట్లాడుతూ ఆగస్టులో బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో గద్వాల జిల్లా ఆలంపూర్ జోగులాంబ దేవాలయం నుండి చైతన్య యాత్ర నిర్వహించను న్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో తిరుగుతూ భద్రాచలంలో ముగింపు సభను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 16 లక్షల జనాభా కలిగిన బ్రాహ్మణులకు వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ సీట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.



# సీటు రద్దు చేసుకుంటే ఫీజు వాపస్

▶ మొదటి పేజీ తరువాయి

చేసింది. అన్ని కౌన్సెలింగ్‌లు ముగిసి, అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తేదీని కటాఫ్‌గా నిర్ధారించింది. చెల్లింపు ప్రక్రియను ఐదు కేటగిరీలుగా విభజించింది. ఈ పాలసీని ఈ ఏడాది నుంచే ముందుకు తీసుకెళ్లాలని అన్ని రాష్ట్రాల ఉన్నత విద్యా మండళ్లకు సూచించింది. ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ (ఎఫ్‌ఆర్‌సీ) నిర్ణయించిన మేరకు ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఒక్కో కాలేజీలో ఒక్కో విధంగా ఉంటుంది. కొన్ని కాలేజీల్లో ఇది లక్షల్లో ఉంది.

**'ప్రైవేటు' వేధింపుల నేపథ్యంలోనే...**

సీటు వచ్చిన తర్వాత విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ సమయంలో రూ.1,000 చెల్లిస్తారు. సీటు ఖరారైనప్పుడు కాలేజీకి మొత్తం ట్యూషన్ ఫీజు చెల్లించడంతో పాటు సర్టిఫికెట్లు ఇస్తారు. అయితే కొన్నిసార్లు విద్యార్థులకు ఇతర అవకాశాలు వస్తాయి. అప్పుడు అప్పటికే చేరిన కాలేజీలో సీటు వదిలేస్తారు. ఇలాంటి సందర్భాల్లో కాలేజీ లు విద్యార్థుల సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వకుండా, చెల్లించిన ఫీజు రిఫండ్ చేయకుండా వేధిస్తున్నట్టు ఫిర్యాదులున్నాయి. వీటిపై యూజీసీ గత నెల 27న నిర్వహించిన సమావేశంలో చర్చించింది. ఈ అంశంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని నిర్ణయించింది. అయితే ఇది కేవలం మొదటి సంవత్సరం విద్యార్థులకే పరిమితమవుతుందా? ఏ సంవత్సరంలో సీటు వదులుకున్నా వర్తిస్తుందా? అనే దానిపై యూజీసీ స్పష్టత ఇవ్వలేదు. అడ్మిషన్ల ప్రక్రియ చివరి తేదీని కటాఫ్‌గా నిర్ణయించడం వల్ల కేవలం మొదటి సంవత్సరం విద్యార్థులకే ఇది పరిమితమని ప్రైవేటు కాలేజీలు అంటున్నాయి.

**ఐదు కేటగిరీలుగా..**

ఈ సంవత్సరం అన్ని రాష్ట్రాల్లోనూ అడ్మిషన్ల ప్రక్రియను అక్టోబర్ 31లోగా పూర్తి చేయాలని యూజీసీ సూచిస్తోంది. ఈ తేదీకి ముందు, ఆ తర్వాత సీటు రద్దు చేసుకునే విద్యార్థులను వివిధ కేటగిరీలుగా విభజించారు.

- అక్టోబర్ 31కి 15 రోజుల కంటే ముందే సీటు రద్దు చేసుకుంటే 100 శాతం ట్యూషన్ ఫీజు తిరిగి చెల్లించాలి.
- ప్రవేశాల నోటిఫికేషన్ ఇచ్చిన తేదీకి ముందు 15 రోజుల్లో సీటు రద్దు చేసుకుంటే 90 శాతం ఫీజు తిరిగి ఇవ్వాలి.
- అడ్మిషన్ల ముగింపు తేదీ తర్వాత 15 రోజుల్లో ఎప్పుడు సీటు రద్దు చేసుకున్నా 80 శాతం ఫీజు తిరిగి ఇవ్వాలి.
- అడ్మిషన్ తేదీ ముగిసిన 15 నుంచి నెల రోజుల్లో సీటు వద్దనుకునే విద్యార్థులకు 50 శాతం ఫీజు వాపసు ఇవ్వాలి. ఆ తర్వాత సీటు వద్దనుకునే వారికి చెల్లించిన ఫీజు ఏమాత్రం తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు.

**స్పష్టత కొరవడిన యూజీసీ ఆదేశాలు**

ఫీజు వాపసు ఇచ్చేందుకు యూజీసీ ఇచ్చిన ఆదేశాలు మరింత స్పష్టంగా ఉంటే బాగుండేది. మార్గదర్శకాలు మొదటి సంవత్సరం విద్యార్థులకే సంబంధించినవిగా కన్పిస్తున్నాయి. అలా కాకుండా కోర్సు పూర్తయ్యే వరకూ వర్తిస్తుందనే విషయాన్ని స్పష్టం చేసి ఉంటే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– డాక్టర్ వి.బాలకృష్ణారెడ్డి (రాష్ట్ర సాంకేతిక, వృత్తి విద్యా సంస్థల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు)





# సాక్షి

గురువారం, 6 జూలై 2023

## అది మన నిర్లక్ష్యానికి మూల్యమే!

నెల రోజుల క్రితం దిగ్భ్రాంతికి గురిచేసిన ఒరిస్సా ఘోర రైలు ప్రమాద ఘటనకు కారణాలు ఇప్పుడిప్పుడే విచారణలో బయటకొస్తున్నాయి. గడచిన మూడు దశాబ్దాలలో అతి దారుణమైనదిగా నమోదైన ఈ ప్రమాదానికి మానవ తప్పిదం, సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలే కారణమని రైల్వే శాఖ దర్యాప్తులో వెల్లడైనట్టు వస్తున్న వార్తలు మన భారతీయ రైల్వేలోని లోపాలకు అద్దం పడుతున్నాయి. అనేక స్థాయుల్లో లోపాల వల్లే 293 మంది ప్రాణాలను బలిగొన్న బాలాసోర్ ప్రమాదం జరిగినట్టు రైల్వే భద్రతా కమిషనర్ (సీఆర్ఎస్) ఎ.ఎం. చౌధరి తన దర్యాప్తు నివేదికలో తేల్చినట్టు తాజా సమాచారం. దాదాపు 1200 మందికి పైగా గాయపడిన ఈ ప్రమాదంపై భద్రతా కమిషనర్ దర్యాప్తు ఏం చెబుతుందా ఎదురుచూస్తున్న వేళ ఎట్టకేలకు గత నెల 28న నివేదికను రైల్వే బోర్డుకు సమర్పించారు. మరోపక్క కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సైతం ఈ ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉందా అని నేర దర్యాప్తు చేస్తున్నందున ఈ తొలి నివేదికను బయటపెట్టడం లేదు. అయితేనేం, వివిధ మార్గాల్లో బయట కొచ్చిన ఈ నివేదికలోని అంశాలు మిగిలిన దర్యాప్తుకూ, సత్వరం చేపట్టాల్సిన చర్యలకూ స్పష్టమైన సూచికలుగా నిలిచాయి.

రైల్వే సిబ్బందిని విచారించి, వాఙ్మూలాలను నమోదు చేసుకొని, అలాగే ప్రమాద స్థలం, రైల్వే ఆస్తులకు సంబంధించిన వివిధ కోణాలను పరిశీలించాక సీఆర్ఎస్ నివేదికను సిద్ధం చేశారు. దాదాపు 40 పేజీల నివేదికలో అవన్నీ పేర్కొన్నారు. ఒరిస్సాలోని బాలాసోర్ వద్ద బాహానగా బజార్ రైల్వే స్టేషన్ సమీపంలో జూన్ 2న జరిగిన ఈ రైలు ప్రమాదంలో చెన్నై – కోల్‌కతా 'కోరమాండల్ ఎక్స్‌ప్రెస్' అప్ – లూప్ లైనులోకి ప్రవేశించి, అప్పటికే ఆ లైనులో ఉన్న ఓ గూడ్స్ రైలును గుద్దుకుంది. అలా ఆ రెండు రైళ్ళు గుద్దుకోవడంతో బోగీలు పట్టాలు తప్పి, పక్కనే మరో పట్టాలపై వెళుతున్న బెంగుళూరు – హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లోని చివరి కొద్ది బోగీలపై పడడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ (ఎస్ అండ్ టి) విభాగంలో అనేక స్థాయుల్లో లోపాలతోనే ఇంతటి ప్రమాదానికి కారణమైందన్న నివేదిక సారాంశం అత్యంత కీలకం.

ఈ ఘోర రైలు ప్రమాదానికి ప్రాథమిక కారణమేమిటనే విషయంలో నెలకొన్న గందరగోళాన్ని సీఆర్ఎస్ నివేదిక పోగొట్టిందనే చెప్పుకోవాలి. ప్రధానంగా మూడు అంశాలను ఈ నివేదిక బయటపెట్టింది. ఒకటి – గతంలో 2018లో ఒకసారి, తాజా ప్రమాద ఘటనకు కొద్ది గంటల ముందు మరోసారి చేసిన మరమ్మతులు అరకొరగా, నిర్లక్ష్యపూరితంగా సాగాయి. ఫలితంగా సిగ్నలింగ్ వ్యవస్థ రాజీ పడ్డట్టయింది. రెండు – పదేపదే చేస్తూ వచ్చిన తప్పుల్ని ముందుగా పసిగట్టివుంటే, ఈ ఘోరం జరిగి ఉండేది కాదు. వివరంగా చెప్పాలంటే, 2018లో కేబుల్ లోపం తలెత్తింది. దాన్ని సరిచేసినా, కీలకమైన సర్క్యూట్ బోర్డ్‌పై దాన్ని మార్క్ చేయలేదు. లోపం సరిచేసేందుకు అప్పట్లో సర్క్యూట్ షిఫ్టింగ్ పని చేశారు. అందుకు ప్రామాణిక పద్ధతులేమీ పాటించనే లేదు. పైపెచ్చు టెర్మినల్స్ మీద అక్షరాలు తప్పుగా పేర్కొన్నారు. అయిదేళ్ళుగా అలక్ష్యం చేసిన ఆ లోపభూయిష్ఠమైన పని ఇప్పుడు ప్రాణాల మీదకు తెచ్చింది. మూడు – తప్పుడు వైరింగ్, కేబుల్ ఫాల్ట్ వల్ల తలెత్తే సమస్యలేమిటో నిరుడు పశ్చిమ బెంగాల్‌లోనే చూశారు. అయినా సరే దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు.

అలాగే బాహానగా బజార్ రైల్వేస్టేషన్‌కు సరిపడేలా ముందస్తు ఆమోదంతో సర్క్యూట్ డయాగ్రమ్‌ను మార్చి ఉన్నా రాంగ్ సిగ్నలింగ్ అయ్యేది కాదు. ఈ ఘోరం జరిగేది కాదు. ఎస్ అండ్ టి విభాగాన్ని వేలెత్తి చూపే ఈ లోపాలే కీలకమైన వేళ ఘోర ప్రమాదానికి కారణమై, అమాయకుల్ని బలిగొన్నాయని నివేదిక చెబుతున్న మాట. ఇక, రైల్వేలలో ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సిగ్నలింగ్ విధానానికి కీలక కేంద్రస్థానం రిలే రూమ్. రైళ్ళను నియంత్రించే మెకానిజమ్‌లు, అలాగే లెవల్ క్రాసింగ్‌లకు సంబంధించిన సిగ్నలింగ్ సామగ్రి అయిన 'రిలే హట్స్' ఈ రిలే రూమ్‌లలోనే ఉంటాయి. అలాంటి రూమ్ ఏ స్థాయి వారికి, ఎలా అందుబాటులో ఉండాలనే విషయంలోనూ అనేక లోపాలున్నాయి. సీఆర్ఎస్ నివేదిక ఈ సంగతీ వెల్లడించింది. నివేదికను సమర్పణకు సరిగ్గా కొద్ది రోజుల ముందే రిలే రూమ్‌కు ఒకటికి రెండు తాళాలు వేయాలని రైల్వే నిర్ణయించడం గమనార్హం.

ఎప్పుడో 2018లో జరిగిన తప్పు ఇప్పుడు ప్రాణాలు బలి తీసుకుందంటే, క్రమం తప్పకుండా చేయాల్సిన చెకింగ్‌లు సవ్యంగా సాగడం లేదనే! రైల్వే స్టేషన్లలో మార్పులు చేసిన సర్క్యూట్లన్నీ సవ్యంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి, పరీక్షించడానికి ఇకపై ప్రత్యేక బృందాన్ని నియోగించాలని సీఆర్ఎస్ సిఫార్సు చేయడం గమనార్హం. అలాగే, ప్రమాద సందర్భంలో సత్వర స్పందనకు జోనల్ రైల్వేలలో ఏర్పాట్లను సమీక్షించాలంది. కళ్ళెదుటే లోపాలు కనిపిస్తున్నాయి గనక ఇకనైనా నిద్ర మేల్కోవాలి. లోపరహిత వ్యవస్థను సృష్టించాలి. అయితే, అందుకు అవసరమైన ప్రాథమిక వసతుల కల్పన ఎంతో ఖర్చుతో, శ్రమతో కూడింది. దీర్ఘకాలికమైన ఆ పని చేయాలంటే రాజకీయ కృతనిశ్చయం ఉండాలి. రైల్వేలో భారీగా పెట్టుబడి పెట్టాలి. పార్టీల తేడాలు లేకుండా కేంద్రంలో గద్దె మీదున్న ప్రతి ప్రభుత్వంలోనూ అవి కొరవడ్డాయి. ప్రపంచంలోనే అతి పెద్ద రైల్వే వ్యవస్థల్లో ఒకటైన భారతీయ రైల్వే సవ్యంగా నడవాలంటే బండికి నట్లు, బోల్టులు అన్నీ సక్రమంగా బిగించి ఉండడం అవసరమని ఇకనైనా గ్రహించాలి. ఎడాపెడా వందే భారత్ రైళ్ళ కన్నా ప్రస్తుతం ఇదే ఎక్కువ అవసరం! ఒరిస్సా దుర్ఘటన, దానిపై సీఆర్ఎస్ నివేదిక ఆ సంగతే గుర్తు చేస్తున్నాయి. గుర్తుపట్టే నాథుడు లేక ఇప్పటికీ బాలాసోర్‌లో పడివున్న 80కి పైగా మృతదేహాలూ మౌనంగా ప్రశ్నిస్తున్నాయి.

# ముఖ్యమంత్రి సలహానే కీలకం


విశ్లేషణ



పి.డి.టి. ఆచారి

ముఖ్యమంత్రి సలహా లేకుండా ఒక మంత్రిని తొలగించే అధికారం గవర్నర్‌కు ఉందా అనేది కీలకమైన ప్రశ్న. భారత గణతంత్రంలోని గవర్నర్లకు, బ్రిటిష్ కాలంనాటి గవర్నర్ల లాగా మంత్రులను ఎంపిక చేసే అధికారం లేదు. ఆర్టికల్ 164ను రూపొందిస్తున్నప్పుడు, ఒక మంత్రిని ఎంపికచేసే, ఏకపక్షంగా తొలగించే వలసకాల గవర్నర్ అధికారాలను తొలగించారు. సీఎం సిఫార్సు చేసిన వ్యక్తిని మాత్రమే గవర్నర్ నియమించగలరని ఈ నిబంధన స్పష్టం చేస్తోంది. కాబట్టి, ముఖ్యమంత్రి సలహా లేకుండా ఒక మంత్రిని తొలగించే అధికారం గవర్నర్‌కు లేదనేది స్పష్టం.

ముఖ్యమంత్రి సలహా లేకుండా సిట్టింగ్ మంత్రిని తొలగించడం ద్వారా తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి రాజ్యాంగపరంగా అరుదైన సాహసోపేత ప్రయోగం చేశారు. వాస్తవానికి, ఆదేశం జారీ చేసిన కొన్ని గంటల్లో, ఆయన దానిని నిలిపివేశారు. అయినా ఈ చర్య రాజకీయ వర్గాల్లో కలకలం రేపడంతో పాటు రాజ్యాంగవేత్తలను దిగ్భ్రాంతికి గురి చేసింది. అటార్నీ జనరల్ అభిప్రాయం తీసుకోవాలంటూ కేంద్ర హోంశాఖ సూచించిందని అనంతరం గవర్నర్ వెల్లడించారు. దేశంలోని అత్యున్నత న్యాయ అధికారిని సంప్రదించకుండా, ముఖ్యమంత్రి తప్పనిసరి సలహా లేకుండా, అసెంబ్లీలో పూర్తి మెజారిటీ ఉన్న ప్రభుత్వ మంత్రిని తొలగించాలనే అపూర్వమైన ఉత్తర్వు జారీ చేయడం విస్మయం కలిగిస్తోంది.



ముఖ్యమంత్రి సలహా లేకుండా మంత్రిని తొలగించే అధికారం గవర్నర్‌కు ఉందా అనేది కీలకమైన ప్రశ్న. ఆర్టికల్ 164 ప్రకారం, సీఎం సలహా మేరకు మంత్రులను గవర్నర్ నియమిస్తారు. సీఎం సిఫార్సు చేసిన వ్యక్తిని మాత్రమే గవర్నర్ నియమించగలరని ఈ నిబంధన స్పష్టం చేస్తోంది. తన మంత్రులను ఎంపిక చేయడం లేదా తొలగించడం పూర్తిగా సీఎం ప్రత్యేకాధికారం. ఒక మంత్రిని వద్దనుకుంటే, తదనుగుణంగా గవర్నర్‌కు సలహా ఇస్తాడు. పార్లమెంటరీ ప్రభుత్వ విధానాన్ని అనుసరించే అన్ని దేశాల్లోనూ ఇదే వాడుకగా ఉంటోంది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 164, 'గవర్నర్ సంతుష్టి (ప్లెజర్)తో ఉన్నంతకాలం మంత్రులు తమ బాధ్యతలు నిర్వహిస్తారు' అని చెబుతోంది. ఇది ఒక మంత్రి మనుగడ పూర్తిగా గవర్నర్ ఇష్టానిష్టాలపై ఆధారపడి ఉందనీ, ఏ మంత్రి పట్ల అయినా గవర్నర్ తన సంతుష్టిని ఉపసంహరించుకోవచ్చనీ అభిప్రాయాన్ని కలిగించవచ్చు. 'గవర్నర్ సంతుష్టి' అనేది ఇక్కడ కీలకమైన అంశం. దాని నిజమైన భావాన్ని అర్థం చేసుకోవాలంటే, మనం భారత ప్రభుత్వ చట్టం, 1935లోని సెక్షన్ 51కి వెళ్లాలి. సెక్షన్ 51లోని సబ్‌సెక్షన్ (1) ప్రకారం, గవర్నర్ తన విచక్షణ మేరకే మంత్రులను పదవుల్లోకి ఎన్నుకోవాలి. అదేవిధంగా సెక్షన్ 51లోని సబ్–సెక్షన్ (5) మంత్రుల ఎంపికకు, తొలగింపునకు సంబంధించి గవర్నర్ తన విధిని విచక్షణతో అమలు చేయాలని చెబుతోంది. ఆ విధంగా, భారత ప్రభుత్వ చట్టం, 1935లోని సెక్షన్ 51, మంత్రులను ఎన్నుకోవడానికీ, వారిని తొలగించడానికీ గవర్నర్‌కు విచక్షణాధికారాలను అందిస్తోంది. సంతుష్ట సిద్ధాంతం ఇక్కడ పూర్తిగా పనిచేస్తోంది.

భారత ప్రభుత్వ చట్టంలోని నిబంధనలను మన రాజ్యాంగం పెద్ద ఎత్తున పునరుత్పాదన చేసిందనేది అందరికీ తెలిసిన విషయమే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 163, 164లో సెక్షన్ 51 గణనీయంగా పునరుత్పాదన అయింది. అటువంటి నిబంధనలో సంతుష్ట సిద్ధాంతం ఒకటి. కానీ రాజ్యాంగ నిర్మాతలు దీనికి సంబంధించి కీలకమైన మార్పు చేశారు. ఆర్టికల్ 164ను రూపొందిస్తున్నప్పుడు, వారు ఒక మంత్రిని ఎంపికచేసే, ఏకపక్షంగా తొలగించే వలసకాల గవర్నర్ అధికారాలను తొలగించారు. అంటే భారత గణతంత్రంలోని గవర్నర్లకు, బ్రిటిష్ కాలంనాటి గవర్నర్ల లాగా మంత్రులను ఎంపిక చేసే అధికారం లేదు. పైగా ముఖ్యమంత్రి సలహా లేకుండా మంత్రిని తొలగించే విచక్షణాధికారం గవర్నర్‌కు లేనప్పుడు సంతుష్ట సిద్ధాంతం దాని బలాన్ని కోల్పోతుంది. పైగా రాష్ట్ర కార్యనిర్వాహక అధిపతి అయిన ముఖ్యమంత్రి నుండి సలహా వచ్చినప్పుడు దాన్ని నిర్వర్తించడం లాంఛనప్రాయంగా మారుతుంది. కాబట్టి, ముఖ్యమంత్రి సలహా లేకుండా ఒక మంత్రిని తొలగించే అధికారం గవర్నర్‌కు లేదని స్పష్టంగా నిర్ధారించవచ్చు.

గవర్నర్ తీసుకునే అలాంటి చర్య రాజ్యాంగ వ్యవస్థపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందో కూడా మనం తీవ్రంగా పరిగణించాలి. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేసిన గవర్నర్, మంత్రులను ఇష్టానుసారంగా తొలగించడం ద్వారా రాజ్యాంగ వ్యవస్థను అస్థిరపరిచే ప్రమాదం ఉంది. స్వతంత్రంగా అమలు చేయగల కార్యనిర్వాహక అధికారం గవర్నర్‌కు లేదని గుర్తుంచుకోవాలి. ఆర్టికల్ 153 ప్రకారం, రాజ్యాంగంలో పేర్కొన్న విచక్షణ విధులు మినహా, అతని అన్ని విధులు మంత్రిమండలి సహాయం, సలహాపై మాత్రమే నిర్వహించబడతాయి. 1974 నాటి శంషేర్ సింగ్ కేసులో, ఎన్నుకోబడిన ప్రభుత్వానికి సంబంధించినంతవరకు గవర్నర్ అధికారాలకు సంబంధించిన చట్టాన్ని సుప్రీంకోర్టు స్పష్టంగా నిర్దేశించింది. తదుపరి నిర్ణయాలన్నీ దానిని పునరుద్ఘాటించాయి. కాబట్టి, మన రాజ్యాంగ వ్యవస్థలో గవర్నర్ స్థానంపై చట్టం స్థిరపడింది.

అలాగే, మంత్రిని నియమించడం లేదా తొలగించడంలో గవర్నర్‌కు విచక్షణాధికారం లేదని ఆర్టికల్ 164 స్పష్టం చేసింది. రెండూ సీఎం పరిధిలోనే ఉన్నాయి. గవర్నర్‌పై కాకుండా సీఎం విశ్వాసం ఉన్నంత వరకు మాత్రమే మంత్రులు క్యాబినెట్‌లో ఉండగలరు.

గవర్నర్ అత్యున్నత రాజ్యాంగ కార్యనిర్వాహకుడు. ఆయన ఆదర్శప్రాయమైన నిష్పాక్షికతతో వ్యవహరించాలి. క్రియాశీల రాజకీయ నాయకులను గవర్నర్లుగా నియమించకూడదని రాజ్యాంగ అసెంబ్లీలో కొంతమంది సభ్యుల నుండి డిమాండ్ వచ్చింది. అటువంటి సూచనలు ఆ సమయంలో తీసుకోనప్పటికీ, రాజకీయ నాయకులు లేదా మాజీ అధికారులు రాజ్‌భవన్‌లో పని చేసిన సమయంలో ప్రశంసనీయంగా పనిచేశారు. ఈ మహోన్నతమైన, ముఖ్యమైన రాజ్యాంగ పదవిని స్వీకరించే స్త్రీ పురుషులకు ఉంటున్న అనుకూలత, అర్హతల గురించి భారతీయ సమాజం చర్చను ప్రారంభించాల్సిన సమయం ఇది. మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా కొన్ని రాష్ట్రాల్లో రాజకీయాల కేంద్రం మెల్లగా రాజ్ భవన్ వైపు మొగ్గుతోంది. ఇది కచ్చితంగా సానుకూలమైన ఆలోచన మాత్రం కాదు.

వ్యాసకర్త లోక్‌సభ మాజీ కార్యదర్శి
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




సోషల్ మీడియా

### అయ్యో పాపం!



తెలంగాణ బీజేపీలో చిత్రమైన పరిస్థితి. పదవి వీడుతున్న, పదవిలోకి వస్తున్న రాష్ట్రాధ్యక్షులు ఇద్దరూ వారి నియామకాల పట్ల సంతోషంగా లేరు.

– నిస్తులా హెబ్బర్, జర్నలిస్ట్

### అదరగొట్టారు!



శక్తి, పట్టుదల, ఉక్కు నరాలను చూపిన అద్భుతమైన ప్రదర్శన! సౌత్ ఏసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్న మన భారత జట్టుకు అభినందనలు.

– సచిన్ టెండూల్కర్, క్రికెటర్

### పరిణామ క్రమం



నెమ్మదిగానే అయినప్పటికీ, ముల్లాలు కూడా పరిణామం చెందుతున్నారు. 1930లో ముల్లాలు ఫొటోలు తీసుకోవడం హరామ్ (నిషిద్ధం) అనేవారు. 1950 నాటి ముల్లాలు రేడియో వినడం హరామ్ అనేవారు. 1990లో ముల్లాలు టీవీ చూడటం హరామ్ అన్నారు. 2023 ముల్లాలు తమ యూట్యూబ్ ఛానల్‌కు సబ్‌స్క్రయిబ్ చేసుకొమ్మని చెబుతున్నారు.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

### ఎలా పెడుతున్నారు?



ఇండియాలో సగటున పది లక్షల మందికి ఉన్న వైద్యుల సంఖ్య: 931. పదిలక్షల మందికి ఉన్న పోలీసుల సంఖ్య: 1,528. అదే ఇండియాలో పది లక్షల మందికి ఉన్న ఎన్జీవోల సంఖ్య: 2,357.

– ఆనంద్ రంగనాథన్, 'స్వరాజ్య' కన్సల్టింగ్ ఎడిటర్

### ఇంత ఘోరమా?



సోషల్ మీడియాలో నేను చూసిన అత్యంత ఘోరమైన విషయం, ఒక అగ్రకులస్థుడు ఒక గిరిజన యువకుడిపై మూత్రవిసర్జన చేయడం. దాన్ని నేను మరిచిపోలేకపోతున్నా. ఇది అత్యంత ఆందోళనకరం. ఈ ఇరవై ఒకటో శతాబ్దంలో కూడా ఇలాంటిది ఎలా జరుగుతున్నదో అర్థం కావడం లేదు.

– రజా అహ్మద్ రూమీ, రచయిత

### శిక్ష పడాల్సిందే కానీ...



పర్వేశ్ శుక్లా (గిరిజనుడిపై మూత్ర విసర్జన చేసినవాడు) ఒక నేరస్థుడు. అతడు కఠిన శిక్షకు అర్హుడు. కానీ దానికి అతడి ఇల్లును బుల్‌డోజర్‌తో కూల్చడం పరిష్కారం కాదు. అందులో అతడి కుటుంబం ఉండొచ్చు. ఒక వేళ ఆ ఇల్లు అక్రమ నిర్మాణమైతే, ముందు దానికి అనుమతి ఎలా ఇచ్చారు? బుల్‌డోజర్‌ను వినియోగించే అధికార దుర్వినియోగాన్ని ఇవాళ సమర్థిస్తే, ఏదో ఒకరోజు అదే బుల్‌డోజర్ మిమ్మల్ని కూడా లక్ష్యంగా చేసుకుంటుంది.

– తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

### మితమే హితం



టొమాటోల ధర కిలో 102 రూపాయలకు పెరిగింది. హిమాచల్ ప్రదేశ్‌లో యాపిల్స్ పండించే వారికన్నా ఇది ఎక్కువ ధర. ఇందులో రైతులకు పెద్ద సందేశం ఇమిడివుంది. రైతులు తక్కువ ఉత్పత్తి చేయాలి. మిగులు ఉత్పత్తి చేయడాన్ని ఆపాలి. తక్కువ ఉత్పత్తి చేస్తే ఎక్కువ ధరలు వస్తాయి.

– దేవీందర్ శర్మ, వ్యవసాయ రంగ నిపుణులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

## సమాన హక్కుల కోసమే...

ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ దేశంలో 'ఉమ్మడి పౌర స్మృతి' (యూనిఫామ్ సివిల్ కోడ్) అమలుపై చర్చను రేకెత్తిస్తోంది. పైగా దాని రాజకీయ అజెండాలో అది భాగమై కూర్చుంది. ఈ నేపథ్యం చాలా క్లిష్టమైనది. 'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్' అమలులో ఉన్నప్పుడు దీన్ని ఎందుకు అమలు చేయకూడదు అనే విషయాన్ని భారతీయ జనతా పార్టీ దేశ ప్రజల ముందు ఉంచింది. అన్ని వర్గాల ప్రజల అభిమానాలను చూరగొనే కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి పౌరస్మృతిని ఎప్పుడో అమలు చేసి ఉండవలసింది. సంతుష్టీకరణ రాజకీయాలతో ఆ పార్టీ ఈ విషయంలో వెనుకడుగు వేసిందని చెప్పాలి. ఉమ్మడి పౌర స్మృతి అమలు గురించి రాజ్యాంగ సభలో అనేక వాదోపవాదాలు జరిగాయి.



చివరికి రాజ్యాంగ ఆదేశిక సూత్రాల్లోని 44 నిబంధనలో దీన్ని చేర్చారు. రాజ్యం దేశ ప్రజలందరికీ ఉమ్మడి పౌరస్మృతి చట్టాన్ని అమలు చేయాలనీ, ఇందుకు దేశ ప్రజల అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగాలనీ స్పష్టంగా ఈ ఆదేశిక సూత్రం నిర్దేశించింది.

అందుకే 22వ లా కమిషన్ ఈ అంశంపై దేశ ప్రజల అభిప్రాయాలను తెలియజేయండి అని కోరింది. ఉమ్మడి పౌర స్మృతి అమలు అంశం మోదీ ప్రభుత్వం ప్రతి పక్షాలను గోతుల్లో పడేసే కుట్రగా కొందరు మోదీ వ్యతిరేకులు అభివర్ణించడంలో అర్థం లేదు. 1985 షాబానో మనోవర్తిపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో యూసీసీ (యూనిఫామ్ సివిల్ కోడ్) అమలు చేయాలని అనేక ప్రజా సంఘాల వాళ్లూ, ప్రజాస్వామ్య వాదులూ రాజకీయ పార్టీలపై ఒత్తిడి పెంచారు. వాస్తవంగా న్యాయ వ్యవస్థ అనేక మార్లు యూసీసీ అవసరాన్ని నొక్కి వక్కాణించింది. సరళా ముద్గల్ కేసు తీర్పు (1995)లో లింగ సమానత్వాన్నీ, స్త్రీలకు సమాన హక్కులనూ అందించడానికి ఉమ్మడి పౌర స్మృతి చాలా అవసరమని సుప్రీం కోర్టు స్పష్టంగా పేర్కొన్నది. బీజేపీ తన హిందూ మత అజెండా అమలులో భాగంగా ఉమ్మడి పౌర స్మృతి పాటను నెత్తికి ఎత్తుకొని రాజకీయ లబ్ధి పొందేందుకు వీలుగా అడుగులు వేస్తోందని ఆ పార్టీని అనవసరంగా దూషించే, ద్వేషించే వారి వాదన పసలేనిదని కోర్టు వ్యాఖ్యలతో రుజువయింది.

ప్రపంచంలోని అన్ని ఆధునిక ప్రజాస్వామ్య దేశాల్లో ఉమ్మడి పౌర స్మృతి చట్టాలు అమలౌతున్నాయనేది వాస్తవం కాదా? ఇస్లామిక్ దేశాల్లో షరియా చట్టాన్ని ఉమ్మడి పౌర స్మృతిగా ఆయా దేశాలు అమలు చేస్తున్నాయనేది అక్షర సత్యం. మన దేశంలో పోర్చుగీసు పాలనలో ఉండి, 1961లో విముక్తి పొందిన గోవా రాష్ట్రంలో యూసీసీ అమలులో ఉన్న విషయం తెలిసిందే. పోర్చుగీసు దేశ చట్టాన్నే 1962 గోవా, డామన్, డయ్యూ చట్టం అంగీకరించింది. ఇక చివరగా ఉమ్మడి పౌరస్మృతిపై ముస్లిం సమాజంలో అనేక అపోహలున్నాయి. వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి విషయాలలో దేశ ప్రజలు అందరినీ ఒకే చట్టం కిందకి తేవడమే ఉమ్మడి పౌర స్మృతి ముఖ్యోద్దేశం. ఈ విషయంలో ముస్లిం సమాజంలోని మేధావులు, ప్రజాస్వామ్య వాదులు మతకోణం నుండి బయటకి వచ్చి, ఈ దేశంలో ముస్లిం సమాజానికి స్థిరమైన ప్రాతిపదికను ఏర్పరచడం ఎంతో అవసరం.

– ఉల్లి బాల రంగయ్య, సామాజిక, రాజకీయ విశ్లేషకులు

## ప్రజాస్వామ్యాన్ని ప్రజలే రక్షించుకోవాలి!

అభిప్రాయం



చాడ వెంకటరెడ్డి

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇష్టానుసారం ఎంఎల్ఏలను, ఎంపీలను నయానో భయానో లొంగదీసుకొని ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను అత్యంత దుర్మార్గంగా కుప్పకూలుస్తోంది. ఈ వికృత చర్యను మరింత ముందుకు తీసుకుపోయి ప్రతిపక్ష అధికార కూటమిలోనే చీలికలు తీసుకువచ్చి, ఆయా పార్టీల అధ్యక్షుల కుర్చీలకే ఎసరు పెడుతున్నారు. అందుకు తాజా నిదర్శనమే ఎన్సీపీలో చీలిక.

నిరంకుశ, రాజ్యాంగ వ్యతిరేక బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలు ఒక్కటవుతుండడంతో కాషాయ పార్టీకి గుబులు పుడుతోంది. ఇటీవల కర్ణాటకలో బీజేపీ ఓటమితో దక్షిణ భారతంలో ఆ పార్టీకి చోటు లేకుండా పోయింది. ఇంతలో 15 ప్రతిపక్షాలు బిహార్‌లోని పట్నాలో సమావేశమై బీజేపీకి వ్యతిరేకంగా చేతులు కలిపాయి. అందులో శరద్ పవార్ సైతం కీలక పాత్ర పోషించారు. ఈ పరిణామాలతో నిద్రపట్టని బీజేపీ ప్రతిపక్షాలను బలహీన పరచేందుకు మహారాష్ట్రలో కుటిల పన్నాగం పన్నింది. ఇప్పటికే శివసేనను చీల్చి మహారాష్ట్రలోని 'మహా వికాస్ అఘాడీ' ప్రభుత్వాన్ని కూల్చి, దొంగదారిలో బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చింది. తాజాగా ప్రస్తుత రాజకీయాలలో అత్యంత సీనియర్ రాజకీయకుడు, ఎన్సీపీ అధ్యక్షుడు అయిన శరద్ పవార్ సొంత సోదరుని కుమారుడు అజిత్ పవార్‌కు వలవేసి ఎన్సీపీ చీలిపోయేలా చేసింది.

నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజ్యాంగం ప్రకారం ఏర్పడిన స్వతంత్ర సంస్థలైన ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థల స్వయంప్రతిపత్తిని నీరు గారుస్తోంది. ప్రతిపక్ష ప్రభుత్వాల పట్ల గతంలో ఎన్నడూ లేని విధంగా గవర్నర్ల జోక్యం పెరిగిపోతోంది. ఇది సర్కారియా కమీషన్ సిఫారసులకు విరుద్ధం. ఇది ఫెడరల్ విధానానికి తిలోదకాలిచ్చే వ్యవహారం. తమిళనాడు గవర్నర్ డీఎంకే మంత్రికి ఉద్వాసన పలికి ఉపసంహరించుకున్న తీరు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌ల గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాలను ఇరుకునపెడుతున్న తీరు. ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ అడుగడుగునా జోక్యం చేసుకొని ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్న వైనం గవర్నర్ల వ్యవహార శైలికి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 'ప్రపంచంలోనే ప్రజాస్వామ్యానికి భారతదేశం తల్లి లాంటిది' అని ఘనంగా చెప్పుకున్నారు. కానీ ఆయన చేస్తున్నదేమిటి? ప్రతిపక్షాలు లేని ప్రజాస్వామ్యం ఉంటుందా? ఒకవైపు స్వదేశంలో ప్రతిపక్షాలను కక్షపూరితంగా అంతమొందించే అడుగులు కదుపుతూ, మరో వైపు విదేశాలలో ప్రజాస్వామ్య పాఠాలను వల్లె వేస్తున్నారు. భావి తరాలకు ప్రజాస్వామ్యం గురించి తెలియకుండా పాఠ్యాంశాల నుండి ప్రజాస్వామ్యం పాఠాలను తొలగిస్తోంది మోదీ ప్రభుత్వం.



నరేంద్ర మోదీ ప్రమాదకర ధోరణిని గుర్తించిన సీపీఐ 2015లోనే పుదుచ్చేరిలో జరిగిన మహాసభలో దేశం ప్రమాదంలో పడబోతున్నదనీ, అందుకని రాజ్యాంగ వ్యవస్థలను రక్షించుకోవడానికి లౌకిక, ప్రజాతంత్ర, ప్రగతిశీల, వామపక్ష శక్తులతో ఒక వేదిక ఏర్పాటు ఆవశ్యకతను నొక్కిచెపుతూ తీర్మానం చేసింది. అంతేకాదు 'ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం, రాజ్యాంగాన్ని నిలబెట్టుకుందాం, లౌకిక వ్యవస్థను కాపాడుకునే రీతిలో అడుగులు వేద్దామని' తీర్మానించింది. దీనిని ప్రతిపక్షాలు పట్టించుకోలేదు. గత 9 ఏళ్లుగా ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తూ, ప్రశ్నించే గొంతుకులకు కళ్లెం వేస్తూ, రాజద్రోహం కేసులు పెడుతూ, భయభ్రాంతులకు గురిచేస్తున్న తీరు; సీబీఐ కేసులు, న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు పెరిగిపోయాయి. ఈడీ. ఐటీ దాడులూ పెరిగాయి. ఈ తప్పులన్నింటికీ వెల చెల్లించుకునే సమయం బీజేపీ సర్కార్‌కు ఆసన్నమయింది. ఇప్పటికే పట్నాలో ఒకసారి సమావేశమైన 15 ఎన్డీఏ వ్యతిరేక పార్టీలు జూలై 13న బెంగళూరులో రెండోసారి సమావేశం కాబోతున్నట్లు తెలుస్తున్నది. ప్రతిపక్షాల ఓట్లు చీలకుండా పరస్పర పోటీ నివారణకు ఒక అవగాహనకు రావడం మంచి పరిణామమే.

గత పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి సీట్లు ఎక్కువగా వచ్చినా ఓట్ల శాతం కేవలం 36.7 శాతం మాత్రమే. అందుకనే ప్రతిపక్షాల ఓట్లు చీలకుండా చేసే ప్రయత్నం ప్రయోజనకారిగా ఉంటుంది.


75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇప్పటికీ 50 శాతం పేదరికం ఉందంటే సిగ్గుపడాలి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు కొరవడటం, కొనుగోలు శక్తి పడిపోవడం దేనికి సంకేతాలు? ఈ అంశాలపై రాజీలేని పద్ధతులలో పాలకులపై ప్రజలు ఒత్తిడి పెంచాలి. ఎన్నికలంటే జాతర కాదు. అవి ప్రజల భవిష్యత్‌కు బాటలు వేసేవి. పవిత్రమైన ఓటును ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులను మాత్రమే గెలిపించడానికి ఉపయోగించాలి. 2024 ఎన్నికల్లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలా లేదా అనేది ప్రజలే తేల్చుకోవాలి.

వ్యాసకర్త సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

## అపాత్ర దానం తగదు

వ్యవసాయ దారునికి సుక్షేత్రం, నాణ్యమైన విత్తనాలు దొరికితే ఎంత ఆనంద పడతాడో, దాతకు యోగ్యుడైన దాన గ్రహీత, దానమివ్వటానికి తగిన సంపద ప్రాప్తిస్తే అంత కంటే ఎక్కువ సంతోషపడతాడు. హాలికునికి సుక్షేత్రం ఉండి, నాసిరకం విత్తనాలు లభిస్తే మంచి పంట పండదు. అలాగే సంపద మిక్కుటంగా ఉండి, పాత్రుడైన గ్రహీత కాకపోతే, ఆ దానం తృప్తి నివ్వదు. ధనాది సంపదలు దానం చేసేటప్పుడు పాత్రుడైన వ్యక్తికి చేస్తే అది సార్థక మవుతుంది. లేకపోతే వ్యర్థ దానమౌతుంది. ఉత్తమ దానం మనిషిని కీర్తివంతుని చేస్తుంది.

వామనుడు, బలి చక్రవర్తిని మూడడుగుల నేల దానమిమ్మని అడిగాడు. అప్పుడు వామన రూపంలో వచ్చింది విష్ణువనీ, ఇతడు మూడడుగుల పేరుతో ముల్లోకాలను ఆక్రమించి, బ్రహ్మాండం అంతటా నిండుతాడనీ, ఈ దానం వద్దనీ గురువు శుక్రాచార్యులు చెపుతాడు. అందుకు బలి... ఎవరైతే ఉత్తమ దానాలూ, సార్థక దానాలూ చేస్తారో వారిని లోకం ఎప్పటికీ మరవదని అంటాడు.




చరిత్రలో ఎంతమంది రాజులు కాలేదు? రాజ్యాలు పొందలేదు? అహంకరించలేదు? వారంతా కాలగర్భంలో కలిసిపోయారు. వారు సంపదను మూటగట్టుకుని పోలేదు. వారి పేరైనా మనం తలచుకోము. కాని, శిబి చక్రవర్తి వంటి ప్రముఖుల్ని ఎప్పటికీ తలచుకుంటున్నాము. వారి త్యాగం, గొప్పదనం అటువంటిది అని చెపుతూ బలి, 'మహిమాన్వితుడైన హరి చేయి కిందది కావటం, దానమిచ్చే నా చేయి పైనది కావటం నాకు మాత్రమే దక్కిన అదృష్టం. ఈ సదవకాశం ముందు రాజ్యం, శరీరం ఇవేవీ ముఖ్యం కాదం'టాడు. ఇక్కడ దాన గ్రహీత సాక్షాత్తూ భగవంతుడైన హరి. ఇంతకంటే ఉత్తమ దానం బలి చక్రవర్తికి ఇంకేముంటుంది? ఉత్తమ దాతలలో మొదటి వరస ప్రముఖులలో బలి పేరుంటుంది.

పాత్రత చూడకుండా చేయగల దానం అన్నదానం ఒక్కటే. ఆకలి ఒక్కటే ఈ దానానికి అర్హత. మిగతావన్నీ పాత్రత, అవసరం ఎరిగి చేయదగ్గ దానాలే! సార్థక దానం వ్యక్తిని ఉత్తమ దాతను చేస్తుంది.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.తదియ ఉ.10.36 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** శ్రవణం ఉ.7.19 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** ప.11.02 నుండి 12.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.45 వరకు, తదుపరి ప.3.07 నుండి 3.57 వరకు, **అమృతఘడియలు:** రా.7.56 నుండి 9.24 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.34, **సూర్యాస్తమయం:** 6.35.

## క్లుప్తంగా...

### నేడు టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు




సాక్షి, హైదరాబాద్: జూన్‌లో జరిగిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను శుక్రవారం విడుదల చేస్తున్నట్టు టెన్త్ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఫలి తాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు.ఫలితాల కోసం www.bse.telangana.gov.inలేదా http://results.bsetelangana.orgవెబ్‌సైట్లకు లాగిన్ కావాలని సూచించారు. టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను వేగంగా అందించేందుకు సాక్షి ఏర్పాట్లు చేసింది. www.sakshieducation.comకు లాగిన్ అయి ఫలితాలు తెలుసుకోవచ్చు.

### ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు నేడు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియేట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను శుక్రవారం వెల్లడిస్తున్నట్టు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. సాయంత్రం 2 గంటలకు అధికారిక వెబ్‌సైట్లలో ఫలితాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. ఫలితాల కోసం https://tsbie.cgg.gov.in లేదా https://results.cgg.gov.in వెబ్‌సైట్లకు లాగిన్ అవ్వాలని తెలిపింది. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలను www.sakshieducation.comలో కూడా చూడవచ్చు.

### నేటి నుంచి బాసర ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్



భైంసా: బాసర ట్రిపుల్ ఐటీలో 2023–24 విద్యాసంవత్సరానికి సీట్లు దక్కించుకున్న విద్యార్థులకు శుక్రవారం నుంచి 3రోజుల పాటు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువా రం ఆయన కౌన్సెలింగ్ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. అధికారులు సూచించిన విధంగా సర్టిఫికెట్లు తీసుకురావాలని, ఫీజు చెల్లించేందుకు కౌన్సెలింగ్ ఆవరణలోనే ఎస్ బీఐ కౌంటర్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాల నివృత్తి కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తామ న్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

### 38 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల ఉన్నతీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 38 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను ఇంటర్మీడియెట్ వరకు ఉన్నతీకరించినట్టు విద్యాశాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి వెల్లడించారు. వీటిలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ఫస్టియర్, 2024–25 నుంచి సెకండియర్ క్లాసులు మొదలవుతాయని మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ప్రభుత్వంపై ఏటా రూ.7.60 కోట్ల భారం పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 475 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు ఉండగా, ఇప్పటివరకు 245 విద్యాలయాలను ఇంటర్మీడియెట్ వరకు అప్‌గ్రేడ్ చేసినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం 38 కస్తూర్బా గాంధీ బాలికావిద్యాలయాలను అప్‌గ్రేడ్ చేయడం వల్ల ఈ సంవత్సరం 3,040 మంది బాలికలకు ప్రయోజనం కలుగుతుందని మంత్రి పేర్కొన్నారు. 475 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో 1,33,879 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. తాజాగా అప్‌గ్రేడ్ చేసిన విద్యాలయాల్లో రెండేసి గ్రూపులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

### సీనియారిటీ ఆధారంగానే డీఎంహెచ్‌వో పోస్టుల భర్తీ

**తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం వినతి**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేయనున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పోస్టులను సీనియారిటీ ప్రాతిపదికన భర్తీ చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కోరింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాలూ ప్రసాద్ రాథోడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కల్యాణ్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి దీన్ దయాల్, కోశాధికారి ప్రశాంత్.. వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీని కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగంలోని వైద్యులకు ఎన్నో ఏళ్ల సర్వీసు ఉన్నా, పదోన్నతులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సీనియారిటీ ప్రకారం 33 జిల్లాల్లో పోస్టులను భర్తీ చేయాలని కోరారు.


### పాలిసెట్ కౌన్సెలింగ్‌లో మార్పులు

సాక్షి, హైదరాబాద్: పాలిసెట్ ఆఖరి దశ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు చేశారు. టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం వెల్లడవుతున్న నేపథ్యంలో, ఉత్తీర్ణులయ్యే వారికి అవకాశం కల్పించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

**ముఖ్య తేదీలు..**

| | |
|---|---|
| స్లాట్ బుకింగ్ చివరి తేదీ | 9.7.23 |
| ఆప్షన్లకు ఆఖరి గడువు | 11.7.23 |
| సీట్ల కేటాయింపు | 14.7.23 |
| సెల్ఫ్ రిపోర్టింగ్ | 14 నుంచి 17.7.23 |
| తరగతులు ప్రారంభం | 21.7.23 |

# కంప్యూటర్ సైన్స్‌లో పెరిగాయ్..




- ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో అందుబాటులోకి సీట్లు..
- డిమాండ్ లేని బ్రాంచీల నుంచి ఇతర బ్రాంచీలకు 7,635 సీట్లు మార్పు
- ఇదే సమయంలో కొత్తగా 6,930 సీట్లకు అనుమతి
- మార్చిన, కొత్త సీట్లలో చాలా వరకు కంప్యూటర్ సైన్స్ కోర్సులవే..
- కొత్త సీట్ల చేరిక నేపథ్యంలో ఎంసెట్ షెడ్యూల్‌లో మార్పులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీలలో కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించిన సీట్లు భారీగా పెరిగాయి. ప్రైవేటు కాలేజీల విజ్ఞప్తి మేరకు పెద్దగా డిమాండ్ లేని బ్రాంచీల నుంచి ఇతర బ్రాంచీలకు 7,635 సీట్లను మార్చగా.. అదనంగా 6,930 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో చాలా వరకు కంప్యూటర్ సైన్స్ బ్రాంచీలకు సంబంధించిన సీట్లేకావడం గమనార్హం. మొత్తంగా డిమాండ్ ఉన్న బ్రాంచీలకు సంబంధించి ఈసారి (2023–24) కొత్తగా 14,565 ఇంజనీరింగ్ సీట్లను ఎంసెట్ కౌన్సెలింగ్‌లో చేర్చుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన సీట్లలో దాదాపు 10,195 సీట్లు కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. ఇలా ఇంజనీరింగ్‌లో సీట్ల పెంపుతో రూ.27.39 కోట్ల మేర అదనంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ భారం పడుతుందని ప్రభుత్వం పేర్కొంది. విద్యార్థుల నుంచి డిమాండ్ లేని బ్రాంచీలు, సీట్లు రద్దు చేసుకుని.. ఆ మేర డిమాండ్ ఉన్న కోర్సుల్లో పెంచుకోవడానికి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఇటీవల అనుమతించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వందకుపైగా కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయి. సుమారు 50కిపైగా కాలేజీలు సీఎస్‌సీ, ఇతర కంప్యూటర్ కోర్సుల్లో భారీగా సీట్లు పెంచుకున్నాయి.

#### మొత్తం 1.15 లక్షలకు చేరిన సీట్లు..

➤ రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశ ఎంసెట్ కౌన్సెలింగ్‌లో 66,112 సీట్లను అందుబాటులో పెట్టారు. తాజాగా పెరిగిన సీట్లను కూడా చేరిస్తే ఈ సంఖ్య 80,677 సీట్లకు పెరుగుతోంది. యాజమాన్య కోటా సీట్లనూ కలిపితే రాష్ట్రంలో 1.15 లక్షల ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉండనున్నాయి. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్‌తోపాటు మరికొన్ని కంప్యూటర్ కోర్సుల్లో గత సంవత్సరం 41,506 సీట్లు అందుబాటులో ఉండగా.. ఈసారి 56 వేల వరకూ చేరనున్నాయి. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్‌తోపాటు ఇతర బ్రాంచీల్లో గత ఏడాది 29,780 సీట్లు ఉండగా.. ఈసారి 22,145 సీట్లకు తగ్గిపోనున్నాయి.

#### ఎంసెట్ షెడ్యూల్‌లో మార్పు

ఇప్పటికే ఎంసెట్ మొదటి విడత కౌన్సెలింగ్ చివరి దశకు చేరకుంది. ఈ నెల 12న సీట్ల కేటాయింపు జరగాల్సి ఉంది. కొత్త సీట్లకు అనుమతి ఇవ్వడంతో.. వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు ఎంసెట్ షెడ్యూల్‌లో మార్పులు చేశారు. దీని ప్రకారం ఈ నెల 8 వరకూ అభ్యర్థులు స్లాట్ బుక్ చేసుకోవచ్చు. 9న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 12 వరకు ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పించారు. ఈ నెల 16న సీట్ల కేటాయింపు చేపడతారు. సీటు వచ్చిన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోగా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. రెండో దశ ఎంసెట్ కౌన్సెలింగ్ ఈ నెల 24 నుంచి మొదలవుతుంది.

#### పెంపు మంచి నిర్ణయం..



ఇంజనీరింగ్ సీట్ల పెంపు నిర్ణయం ఆహ్వానించదగ్గ పరిణామం. దీనివల్ల అదనంగా 10వేల మందికిపైగా సీట్లు పొందే అవకాశం వస్తుంది. డిమాండ్ ఉన్న కోర్సుల్లో చేరాలనుకునే వారికి ఇది ప్రయోజనకరం.

– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యా మండలి చైర్మన్

#### ఫ్యాకల్టీకి ఉద్యోగ భద్రత కల్పించాలి

సంప్రదాయ బ్రాంచీల్లో సీట్లు తగ్గించడం వల్ల కొన్ని సెక్షన్లు రద్దవుతాయి. ఈ కారణంగా ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న అధ్యాపకులను తొలగించే ప్రమాదం ఉంది. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి. అవసరమైతే వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మిగతా బ్రాంచీల్లో బోధించే నైపుణ్యం కల్పించాలి.

– వి.బాలకృష్ణ, సాంకేతిక, వృత్తి విద్యా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

# ఏకేద్దాం.. బీ రెడీ!

▶ మొదటి పేజీ తరువాయి

రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహానికి పదును పెడుతున్నారని వివరిస్తున్నాయి.

**'ఏ టీం, బీ టీం'పై ఆగ్రహం**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. పరస్పరం తలపడాల్సిన కాంగ్రెస్, బీజేపీ రెండూ బీఆర్‌ఎస్‌ను లక్ష్యంగా చేసుకోవడాన్ని కేసీఆర్ సీరియస్‌గా పరిగణిస్తున్నారు. బీఆర్‌ఎస్‌ను 'ఏ టీం', 'బీ టీం' అంటూ కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న ఆరోపణలను నిలువరించకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కు నష్టం వాటిల్లుతుందని అంచనా వేస్తున్నారు. బీజేపీలో జరుగుతున్న పరిణామాలను బీఆర్‌ఎస్‌ను జతచేస్తూ జరుగుతున్న ప్రచారానికి అడ్డుకట్ట వేయడంపై దృష్టి సారించారు. జాతీయ స్థాయిలో పెరుగుతున్న బీఆర్‌ఎస్ ప్రభావాన్ని నిలువరించేందుకు కాంగ్రెస్, బీజేపీ తమను లక్ష్యంగా చేసుకున్నట్టుగా భావిస్తున్నా రు. ఈ నేపథ్యంలో రెండు జాతీయ పార్టీలను ఏకకాలంలో ఇరుకున పెట్టేందుకు అవసరమైన కార్యాచరణపై కసరత్తు చేస్తున్నారు.

**పార్లమెంటు సమావేశాల్లో దూకుడుగా..**

ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో అనేక అంశాల్లో కాంగ్రెస్, ఇతర విపక్షాలతో కలసి బీఆర్‌ఎస్ ఆందోళన చేసింది. మళ్లీ ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. ఈసారి బీజేపీ, కాంగ్రెస్‌లకు సమదూరం పాటిస్తూ బీఆర్‌ఎస్ గొంతు వినిపించేలా కేసీఆర్ వ్యూహరచన చేస్తున్నారు. దీనికి సంబంధించి వచ్చే వారం బీఆర్‌ఎస్ ఎంపీలతో భేటీ నిర్వహించి దిశానిర్దేశం చేయనున్నట్టు తెలి సింది. బీజేపీ, కాంగ్రెస్ వైఫల్యాలను జాతీయ స్థాయిలో ఎత్తిచూపేలా తమ కార్యాచరణ ఉంటుందని పార్టీ ఎంపీ ఒకరు వెల్లడించారు.

**విపక్షాల్లోని అసంతృప్త నేతలకు గాలం..!**

బీఆర్‌ఎస్‌లోని అసంతృప్త నేతలను చేర్చుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ఆ రెండు జాతీయ పార్టీల్లోని సంస్థాగత లోపాలను అనువుగా మలుచుకోవాలని.. అసంతృప్త, అసమ్మతి నేతలకు గాలం వేసి, పార్టీ చేర్చుకోవాలని బీఆర్‌ఎస్ నిర్ణయించినట్టు తెలిసింది. దీనికి సంబంధించి కేసీఆర్ ఆదేశాల మేరకు కీలక నేతలు పలువురితో మంతనాలు జరుపుతున్నట్టు సమాచారం. ఇప్పటికే మునుగోడు ఉప ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి దాసోజు శ్రవణ్, స్వామిగౌడ్, భిక్షమయ్య గౌడ్, కాంగ్రెస్ నుంచి పల్లె రవికుమార్ బీఆర్‌ఎస్ గూటికి చేరుకున్నారు. ప్రస్తుతం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఓ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆయన రాకను నిరసిస్తూ సంబంధిత నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కేడర్ సమావేశమై తమ అభిప్రాయాన్ని అధిష్టానానికి తెలియజేశారు కూడా. గతంలో రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్‌లో చేరి, ఎంపీ టికెట్ దక్కకపోవడంతో పార్టీ మారిన నేత కూడా బీఆర్‌ఎస్‌లో చేరడం ఖాయమైనట్టు ప్రచారం జరుగుతోంది. సదరు నేతకు పెద్దపల్లి లోక్‌సభ స్థానం లేదా ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టికెట్ ఇస్తామనే హామీ బీఆర్‌ఎస్ నుంచి వచ్చినట్టు సమాచారం. ఇదే తరహాలో మరికొందరు నేతలపైనా బీఆర్‌ఎస్ ఫోకస్ చేసినట్టు తెలిసింది.

### టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో వీఏఎస్ అభ్యర్థుల హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: పశు సంవర్థక శాఖ పరిధిలోని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (వీఏఎస్) ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్‌టికెట్లు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి. అభ్యర్థులు వీటిని వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ కార్యదర్శి సూచించారు. ఈనెల 13, 14 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5వరకు వీఏఎస్ అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. హాల్‌టికెట్‌తో పాటు నిబంధనలు సైతం వెబ్ సైట్‌లో ఉన్నా యని, వాటిని అభ్యర్థులు తప్పకుండా అనుసరించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు మాక్‌టెస్ట్‌లో పాల్గొనవచ్చని, ఇందుకు కమిషన్ వెబ్‌సైట్ తెరిచి నిర్దేశించిన లింకు ద్వారా పరీక్ష రాయొచ్చని సూచించారు.

### గ్రూప్–2 దరఖాస్తు సవరణకు అవకాశం

**ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు సవరణ**

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–2 ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సవరణ అవకాశం కల్పించింది. ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులో పొరపాట్లను సవరించుకునే వీలుంటుంది. సవరణ ప్రక్రియ కేవలం ఒక్కసారి మాత్రమే ఉంటుందని, దరఖాస్తును ముందుగా తెరిచి ఎక్కడ పొరపాట్లు ఉన్నాయో గుర్తించి వాటిని సవరించుకోవాలని స్పష్టం చేసింది. ఎడిట్ ఆప్షన్ కోసం దరఖాస్తును తెరిచి ఎంట్రీ చేసిన వివరాలను తుది వివరాలుగా పరిగణిస్తామని కమిషన్ స్పష్టం చేసింది. పేరు, ఆధార్ వివరాలు, పుట్టిన తేదీ తదితరాలను సవరించుకోవాల్సి వస్తే అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సవరణ తర్వాత పీడీఎఫ్ దరఖాస్తును భవిష్యత్ అవసరాల కోసం డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ కార్యదర్శి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఐఏఎస్ అధికారి నవీన్ మిత్తల్‌కు రూ.10 వేల జరిమానా

**కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు ఆదేశం**

సాక్షి, హైదరాబాద్: కోర్టు ధిక్కరణ కేసులో సీనియర్ ఐఏఎస్ నవీన్ మిత్తల్‌కు హైకోర్టు రూ.10 వేల జరిమానా విధించింది. గతంలో కళాశాల విద్యాకమిషనర్‌గా ఉన్నప్పుడు కోర్టు ఆదేశాలను పాటించనందుకు ఈ మేరకు ఆదేశించింది. కళాశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ యాదగిరికి కూడా రూ.10 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించుకుంటే నెల జైలుశిక్ష అనుభవించాలని పేర్కొంది. కల్వకుర్తి గవర్నమెంట్ మోడల్ డిగ్రీ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రావు కోవిడ్ కాలంలో ఉద్యోగానికి రాలేదని సర్వీసు నుంచి తొలగిస్తూ మిట్టల్ అప్పట్లో ఆదేశాలు జారీచేశారు. దీనిపై శ్రీనివాస్ కోర్టును ఆశ్రయించగా ఆ ఆదేశాలను కొట్టేసింది. అయితే శ్రీనివాస్‌రావును సర్వీసులోకి తీసుకోకుండానే మళ్లీ ఆయన్ను రీజినల్ జాయింట్ డైరెక్టర్ తొలగించారు. దీంతో శ్రీనివాసరావు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మాధవీదేవి విచారణ చేపట్టారు. వాదనలు విన్న ధర్మాసనం అధికారులిద్దరికీ జరిమానా విధించారు.

# విద్యుత్ సంస్థలకు కొత్త బాస్‌లు?

- ఇంధన శాఖలో జోరందుకున్న ఊహాగానాలు
- తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న ట్రాన్స్‌కో/ జెన్‌కో, ఎస్పీడీసీఎల్ సీఎండీ, డైరెక్టర్లు
- వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు
- బాధ్యతల నుంచి తప్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు
- కొత్తవారి నియామకంపై సర్కారు దృష్టి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ సంస్థల సీఎండీలు, డైరెక్టర్ల మార్పు, కొత్తవారి నియామకంపై ఊహా గానాలు ఊపందు కున్నాయి. కొత్త సీఎండీలు, డైరెక్టర్ల నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని, ఇందుకు సంబంధించిన కసరత్తును ప్రారంభించిందని చెబుతున్నారు. సింగరేణి సంస్థ సీఎండీగా ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఎన్.శ్రీధర్.. ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల సీఎండీ రేసులో ముందు వరుసలో ఉన్నట్టు సమాచారం. అయితే ఆయన ఇప్పటికే ఆయన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ సీఎండీగా ఎంపికైనా, ఇంకా నియామక ఉత్తర్వులు జారీ కాలేదు. శ్రీధర్ కాకుంటే, సీఎంకు అత్యంత విశ్వసనీయంగా ఉండే సీనియర్ ఐఏఎస్ అధి కారుల్లో ఒకరిని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది.

**తనకు విముక్తి కల్పించాలంటున్న ప్రభాకర్‌రావు..**

తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) సీఎండీగా, విద్యుత్ సరఫరా సంస్థ(ట్రాన్స్‌కో)ల ఇన్‌చార్జి సీఎండీగా డి.ప్రభాకర్‌రావు గత నెలతో 9 ఏళ్లు, 2019 జనవరి 10 నాటికి విద్యుత్ సంస్థల్లో 50 ఏళ్ల సుదీర్ఘ సర్వీసు పూర్తి చేసుకుని రికార్డు సృష్టించారు. ఆయన అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా 1969 జనవరి 10న ఎలక్ట్రిసిటీ బోర్డులో చేరారు. విద్యుత్ రంగానికి సంబంధించిన విధానాల రూపకల్పన, నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ స్టేట్ పవర్ కోఆర్డినేషన్ కమిటీ (టీఎస్‌పీసీసీ) చైర్మన్ హోదాలో ఆయన డిస్కంల నిర్వహణను సైతం పర్యవేక్షించారు. ఆయనకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ సీఎస్) హోదాను కట్టబెట్టి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రస్తుతం 76 ఏళ్ల వయస్సులో ప్రభాకర్‌రావు వయోభారం, అనా రోగ్య సమస్యలతో ఇబ్బందులు పడు తున్నారు. తనను బాధ్యతల నుంచి తప్పిస్తే విశ్రాంతి తీసు కుంటానని గతంలో ఆయన విజ్ఞప్తి చేయగా సీఎం కేసీఆర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలోనే గత నెల రోజులుగా ఆయన బహిరంగ సభల్లో తనకు బాధ్యతల నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. సమీప భవిష్యత్తులో తాను బాధ్యతల నుంచి తప్పు కున్నా మరో విధంగా భావించవద్దని విద్యుత్ ఉద్యోగులకు ఆయన తాజా గా విజ్ఞప్తి చేశారు. తన విజ్ఞప్తులపై ప్రభుత్వం నుంచి సాను కూల సంకేతాలు అందిన నేపథ్యంలోనే ఆయనీ ప్రకటనలు చేశారని విద్యుత్ శాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**డైరెక్టర్లు కూడా దీర్ఘకాలంగా..**

టీఎస్ఎస్పీడీసీఎల్‌లో 8 మంది, టీఎస్ఎన్పీడీసీఎల్‌లో ఆరుగురు, ట్రాన్స్‌కోలో జేఎండీ, మరో నలుగురు డైరెక్టర్లు, జెన్‌కోలో ఆరుగురు డైరెక్టర్లు ఉన్నారు. వీరిలో చాలామంది 9 ఏళ్లకు పైగా ఆయా పదవుల్లో కొనసాగుతున్నారు. వీరిలో చాలామంది 70 ఏళ్లకు పైబడిన వారే. కొన్ని విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల సంఖ్య మంజూరైన పోస్టుల సంఖ్య కంటే పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో కొందరు డైరెక్టర్లను సాగనంపి వారి స్థానంలో కొత్తవారిని నియమించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

**80 ఏళ్లకు చేరువలో ఉత్తర డిస్కం సీఎండీ..**

ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్) సీఎండీగా ఎ.గోపాల్ రావు ఆరున్నరేళ్లు పూర్తి చేసుకున్నారు. ఆయన 2003లో చీఫ్ ఇంజనీర్‌గా రిటైరయ్యారు. ప్రస్తు తం ఆయన వయస్సు 78 ఏళ్లకు పైనే. వరంగల్ కేంద్రంగా పనిచేస్తున్న ఆయన వృద్ధాప్య సమస్యల వల్ల తరుచుగా హైదరాబాద్‌కు రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యుత్ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని అంటున్నాయి. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) సీఎండీగా జి.రఘుమా రెడ్డి సైతం ఈ నెలలో 9 ఏళ్లను పూర్తి చేసుకోనున్నారు. ప్రస్తుతం ఆయన వయస్సు కూడా 71 ఏళ్లకు పైనే. ఒక వేళ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా నాన్ ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వం భావిస్తే ఈయన పేరును సైతం పరిశీలించే అవకాశం ఉంది.



తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ నవీన్‌రావు, ఆలిండియా జ్యుడీషియల్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జి.లక్ష్మారెడ్డి తదితరులు

# గురుకుల సీటుకు సిఫారసు కట్

- సంక్షేమ గురుకుల విద్యాసంస్థల అడ్మిషన్లలో మెరిట్‌కే ప్రాధాన్యం
- ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసులను అనుమతించొద్దని సొసైటీల నిర్ణయం
- మెరిట్ అభ్యర్థులు లేకుంటే సీట్లు ఖాళీగా ఉంచాలని నిర్ణయం
- ప్రస్తుతం తొలివిడత ప్రవేశాలతో సరిపెట్టిన సొసైటీలు



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో సిఫా రసు లేఖలకు కాలం చెల్లింది. గురుకులాల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిశాక మిగులు సీట్ల భర్తీలో మంత్రులు, ప్రజాప్రతినిధుల సిఫా రసు లేఖలను ఏమాత్రం పరిగణ నలోకి తీసుకో రాదని... కేవలం మెరిట్ ఆధారంగానే అడ్మిషన్లు ఇవ్వాలని గురుకుల సొసైటీలు నిర్ణయించాయి. గత నెలలో ప్రవే శాల ప్రక్రియను ప్రారంభించిన గురుకుల సొసై టీలు తొలివిడత కౌన్సెలింగ్ చేపట్టి సీట్లు పొందిన విద్యార్థులకు గడువులోగా నిర్దేశిత విద్యాసంస్థల్లో రిపోర్టు చేయాల్సిందిగా స్పష్టం చేశాయి. మెజారిటీ విద్యార్థులు ఆయా సంస్థల్లో చేరగా మిగులు సీట్లకు సంబంధించి మరో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తారని ఆశావహులు భావించారు. కానీ గురుకుల సొసైటీలు మాత్రం ఇప్పటికీ పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ చేయలేదు. మరోవైపు అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు తరగతులు ప్రారంభమవగా బోధన సైతం వేగంగా కొనసాగుతోంది.

**మెరిట్‌కే పరిమితం...:** రాష్ట్రంలో ఐదు గురుకుల విద్యాసంస్థల సొసైటీలున్నాయి. మహాత్మా జ్యోతిభాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతులు సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల సొసైటీలు సంబంధిత సంక్షేమ శాఖల పరిధిలో కొనసాగుతున్నాయి. తెలంగాణ గురుకుల విద్యాసంస్థల సొసైటీ మాత్రం పాఠశాల విద్యాశాఖ పరిధిలో కొనసాగుతోంది. ఐదు సొసైటీల పరిధిలో 1005 పాఠశాలలు, కళాశాలలున్నాయి. వాటిలో ఐదో తరగతి అడ్మిషన్లతోపాటు 6, 7, 8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలు, ఇంటర్ ఫస్టియర్, డిగ్రీ ఫస్టియర్‌కు ఏటా అడ్మిషన్లు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల సొసైటీల పరిధిలో ఐదో తరగతికి ఉమ్మడి ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. మిగతా తరగతులకు మాత్రం సొసైటీలు వేరువేరుగా ప్రకటనలు జారీ చేసి అర్హత పరీక్షలు నిర్వహించి మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు ఇస్తాయి.

## సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఎంబీబీఎస్ సీట్లలో రిజర్వేషన్

**రామగుండం మెడికల్ కాలేజీ పేరు ఇకనుంచి 'సిమ్స్'**

సాక్షి, హైదరాబాద్: సింగరేణి ఉద్యోగులకు, వారి పిల్లలకు శుభవార్త. పెద్దపల్లి జిల్లా రామగుండం మెడికల్ కాలేజీ పేరును సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)గా మార్చడంతోపాటు, అక్కడి ఉద్యోగుల పిల్లలకు ఎంబీబీఎస్ సీట్లలో రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సింగరేణి ఉద్యోగుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న సీఎం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రామగుండం మెడికల్ కాలేజీలో మొత్తం 150 ఎంబీబీఎస్ సీట్లుండగా, 23 సీట్లు ఆలిండియా కోటాకి వెళ్తాయి. మిగతా 127 ఎంబీబీఎస్ సీట్లలో 5% రిజర్వేషన్ ప్రకారం, అంటే 7 సీట్లు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు కేటాయించనున్నారు. నీట్ మెరిట్ ప్రకారం భర్తీ చేసే ఈ సీట్ల విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు పరిగణనలోకి తీసుకుంటారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. కాగా, ఈ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలోని 50 శాతం పడకలను సింగరేణి ఉద్యోగులకు కేటాయించినట్లు ప్రకటించారు. ఇదిలావుండగా, తెలంగాణ మెడికల్, డెంటల్ కాలేజీల అడ్మిషన్ నిబంధనలను కొన్నింటికి సవరణలు చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇవన్నీ కూడా గతంలో ఉన్న ఉత్తర్వులేనని వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది.

## ఎంబీబీఎస్, బీడీఎస్‌లో ప్రవేశాల ప్రక్రియ షురూ..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదుకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేయనున్నారు. జాతీయ స్థాయి అర్హత పరీక్ష నీట్–2023లో అర్హత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో వెల్లడించారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుండి 14వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుంది. దరఖాస్తుతో పాటు అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులు, ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారు. దీనికి సంబంధించి వ్యక్తిగతంగా ఎలాంటి సమాచారం పంపరు. వెబ్‌సైట్‌ను మాత్రమే చూడాలి. తుది మెరిట్ జాబితా విడుదల అనంతరం వెబ్ ఆప్షన్లకు యూనివర్సిటీ మరో ప్రకటన జారీ చేస్తుంది. తదనుగుణంగా అభ్యర్థులు ప్రాధాన్య క్రమంలో ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం జాతీయ స్థాయి నుంచి వచ్చే కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర స్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఎంబీబీఎస్, డెంటల్ కోర్సుల కోసం రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజును ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ. 3,500గా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 2,900గా నిర్ధారించారు. ఫీజును డెబిట్ కార్డ్ / క్రెడిట్ కార్డ్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించాలి.

**దరఖాస్తులో ఇబ్బంది ఎదురైతే..:** అడ్మిషన్ కోసం వెబ్ ఆప్షన్ల కోసం ప్రత్యేకంగా షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తును సమర్పించడానికి విద్యార్థికి ఏదైనా ఇబ్బంది ఎదురైతే 93926 85856, 78425 42216, 9059672216 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు. లేదా tsmedadm2023@gmail.comకు ఈ–మెయిల్ చేయొచ్చు. ప్రవేశాలకు సంబంధించిన అర్హతలు, ఇతర సమాచారానికి యూనివర్సిటీ వెబ్‌సైట్ www.knruhs. telangana.gov.in ను సందర్శించాలని యూనివర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

### గిరిజన వర్సిటీ హామీ ఏమైంది?

**గవర్నర్ తమిళిసైకి రెడ్కో చైర్మన్ లేఖ**

సాక్షి, హైదరాబాద్: ములుగులో జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కేంద్రం ఆమోదముద్ర వేసే బాధ్యత తీసుకుంటానన్న హామీ ఏమైందని గవర్నర్ తమిళిసైని రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ (రెడ్కో) చైర్మన్ వై.సతీశ్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం గవర్నర్‌కి బహిరంగ లేఖ రాశారు. వర్సిటీకి ప్రభుత్వం భూమి కేటాయించినా.. మీరిచ్చిన హామీ నాలుగేళ్లవుతున్నా వర్సిటీ ఏర్పాటు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## క్లుప్తంగా...

### జూలై 4.. మహోష్ణ దినం

వాషింగ్టన్: గత 1,25,000 సంవత్సరాల్లో ఈ ఏడాది జూలై 4వ తేదీ భూగోళంపై అత్యంత వేడి దినంగా రికార్డుకెక్కింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన దినంగా ఈ నెల 3వ తేదీ రికార్డు సృష్టించింది. ఆ రికార్డు ఒక్కరోజులోనే బద్దలు కావడం విశేషం. 3న ప్రపంచవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రత 17.01 డిగ్రీల సెల్సియస్‌కు చేరినట్లు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మెయిన్‌కి చెందిన క్లైమేట్ చేంజ్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. 4వ తేదీన ఇది 17.18 డిగ్రీల సెల్సియస్(62.92 డిగ్రీల ఫారన్‌హీట్)కు ఎగబాకినట్లు తెలియజేసింది. ఈ ఉష్ణోగ్రతను గణించడానికి మోడలింగ్ సిస్టమ్‌ను 1979 నుంచి ఉపయోగిస్తున్నారు. దీని ప్రకారం లక్షల సంవత్సరాల క్రితం నాటి ఉష్ణోగ్రతను సైతం అంచనా వేయొచ్చు.

**గిరిజన యువకునిపై మూత్ర విసర్జన...**

### నిందితుని అరెస్టు

**బీజేపీకి చెందినవాడన్న కాంగ్రెస్**

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాలో గిరిజన యువకునిపై మూత్ర విసర్జన ఘటనలో నిందితున్ని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతడు బీజేపీకి చెందినవాడని కాంగ్రెస్ ఆరోపించింది. తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. బీజేపీ దళిత, గిరిజన ద్వేషానికి ఈ ఉదంతం అద్దం పడుతోందని కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా దుయ్యబట్టారు. బీజేపీ హయాంలో వారిపై అత్యాచారాలు పేట్రేగిపోతున్నాయని రాహుల్ ఆరోపించారు. అయితే ఆ వ్యక్తితో తమ పార్టీకి సంబంధం లేదని బీజేపీ పేర్కొంది. దీనిపై విచారణకు నలుగురు వ్యక్తుల కమిటీ వేస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర శాఖ ప్రకటించడం విశేషం. ఈ చర్య హీనమైనదని హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా అన్నారు. ఈ ఉదంతం కొద్ది నెలల నాటిదని చెబుతున్నారు.

### డేటా బిల్లుకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ: డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ బిల్లు (డీపీడీపీ)కి కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. జూలై 20 నుంచి ఆగస్టు 11 దాకా జరిగే పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా ఈ బిల్లును ప్రవేశపెడతారని అధికార వర్గాల సమాచారం. గోప్యత హక్కులో భాగంగా పౌరుల డేటా సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్ విషయంలో ఇంటర్నెట్ కంపెనీలు, మొబైల్ యాప్స్, వ్యాపార సంస్థల్లో జవాబుదారీతనం పెంచడం దీని లక్ష్యం. గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా గత ఆగస్టులో సుప్రీంకోర్టు ప్రకటించిన అనంతరం డేటా పరిరక్షణ బిల్లు తయారీ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ బిల్లు ఆమోదం పొందితే ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలు డేటా సేకరణకు ముందు పౌరుల అనుమతి తీసుకోవాలి.

**ఇజ్రాయెల్ ఆక్రమిత ఉత్తర వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థుల శిబిరం 20 సంవత్సరాల తర్వాత మళ్లీ ప్రపంచవ్యాప్తంగా ప్రముఖంగా వార్తల్లోకి వచ్చింది.**

**జెనిన్ క్యాంప్‌లో ఉగ్రవాదులను ఏరివేయడానికి ఇజ్రాయెల్ సైన్యం చేపట్టిన ఆపరేషన్ ఎట్టకేలకు ముగిసింది. లక్ష్యం నెరవేరిందని ఇజ్రాయెల్ చెబుతోంది. జెనిన్ రెఫ్యూజీ క్యాంప్‌నకు దాదాపు ఏడు దశాబ్దాల కన్నీటి చరిత్ర ఉంది. ఇజ్రాయెల్ సైన్యం, పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్‌ల మధ్య ఘర్షణలకు ఈ ప్రాంతం వేదికగా మారుతుండడంతో శరణార్థులకు కష్టాలు ఎదురవుతున్నాయి. చెల్లాచెదురై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇజ్రాయెల్ మిలటరీ ఆపరేషన్ వల్ల గత 3 రోజుల్లో వేలాది మంది జెనిన్ క్యాంప్ విడిచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో అసలు ఈ క్యాంప్ ఎందుకు ఏర్పాటయ్యిందో, ఇక్కడి పరిస్థితులేమిటో తెలుసుకుందాం..**

ఇజ్రాయెల్ సైనిక ఆపరేషన్‌తో జెనిన్ క్యాంప్‌లో మృత్యుభయం

**వలసబాట పట్టిన వేలాది మంది శరణార్థులు**

సైన్యం, మిలిటెంట్ల మధ్య ఘర్షణలతో నలిగిపోతున్న బాధితులు

# మురికివాడలో శరణార్థుల గోస





అమెరికాతోపాటు పశ్చిమ దేశాల అండతో 1948లో యూదుల కోసం ఇజ్రాయెల్ ఆవిర్భవించింది. విస్తీర్ణంలో చిన్నదైనా తన చుట్టుపక్కల దేశాల భూభాగాలను బలప్రయోగంతో ఆక్రమించుకోవడం మొదలుపెట్టింది. ప్రాచీన కాలంలో ఆ ప్రాంతాలన్నీ యూదు రాజ్యంలో అంతర్భాగమేనని వాదించింది. అలా పొరుగు దేశమైన పాలస్తీనాపై కన్నేసింది. ఇజ్రాయెల్ సైన్యం దాడులను తట్టుకోలేక పాలస్తీనా పౌరులు సొంత ఊళ్లు వదిలేసి శరణార్థులుగా మారి వలస బాట పట్టారు. అంతర్జాతీయ సమాజం ఒత్తిడి

**శరణార్థుల గడ్డ.. మిలిటెంట్ల అడ్డా**

మేరకు ఇజ్రాయెల్ ప్రభుత్వం 1950వ దశకంలో పాలస్తీనా శరణార్థుల కోసం వెస్ట్ బ్యాంక్‌లో పలు శిబిరాలను ఏర్పాటు చేసింది. అందులో ఒకటి జెనిన్ రెఫ్యూజీ క్యాంప్. నిజానికి ఇదొక మురికివాడ అని చెప్పొచ్చు. పేదరికానికి, ఆకలి చావులకు మారుపేరు. పాలస్తీనా మిలిటెంట్లు తమ కార్యకలాపాల కోసం జెనిన్‌ను అడ్డాగా మార్చుకున్నారు. తరచుగా ఇజ్రాయెల్‌పై దాడులకు పాల్పడుతున్నారు. మిలిటెంట్ల చర్య స్వాతంత్ర్యం కోసం జరుగుతున్న సాయుధ తిరుగుబాటు అని పాలస్తీనా సానుభూతిపరులు చెబుతుండగా, అది ముమ్మాటికీ ఉగ్రవాదమేనని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. పాలస్తీనియన్ మిలిటెంట్ కమాండ్ సెంటర్లు జెనిన్‌లో ఉన్నాయని అంటోంది.

**వేలాది మందికి ఆవాసం**

జెనిన్ క్యాంప్ పాలస్తీనా శరణార్థులతో కిక్కిరిసిపోయి కనిపిస్తుంది. ఇక్కడ ప్రస్తుతం 18,000 మంది నివసిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు చెబుతున్నాయి. అసలైన లెక్క ఎంతన్నది తెలియదు. ఐక్యరాజ్యసమితి పాలస్తీనియన్ రెఫ్యూజీ ఏజెన్సీ అందించిన సమాచారం ప్రకారం 14,000 మంది ఉంటున్నారు. 2020 నాటి పాలస్తీనా ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం 12,000 మంది శరణార్థులు నివసిస్తున్నారు.

జెనిన్ క్యాంప్‌లో 2002లో జరిగిన ఘర్షణలో 50 మందికిపైగా పాలస్తీనా జాతీయులు, 23 మంది ఇజ్రాయెల్ సైనికులు బలయ్యారు. యూదు సెలవు దినం సందర్భంగా మతపరమైన వేడుక కోసం గుమికూడిన యూదు జాతీయులపై మిలిటెంట్లు ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 30 మంది యూదు జాతీయులు మరణించారు. దాంతో మిలిటెంట్ల భరతం పట్టడానికి ఇజ్రాయెల్ సైన్యం వెస్ట్‌బ్యాంక్‌పై విరుచుకుపడింది. పాలస్తీనాలోకి సైతం సైన్యం అడుగుపెట్టింది. రమల్లా నగరంలో అప్పటి పాలస్తీనా అధినేత యాసర్ అరాఫత్ ఇంటిని చుట్టుముట్టింది. ఇజ్రాయెల్ సైనికులు, పాలస్తీనా మిలిటెంట్ల నడుమ కొన్ని రోజులపాటు హోరాహోరీగా యుద్ధంకొనసాగింది. ఇరువైపులా ప్రాణనష్టంతో యుద్ధం ముగిసింది. జెనిన్ క్యాంప్ అప్పటి నుంచి నివురుగప్పిన నిప్పులా మారింది. 20 ఏళ్ల తర్వాత మళ్లీ భారీ సైనిక ఆపరేషన్ జరిగింది. దీనివెనుక పలు కారణాలు కనిపిస్తున్నారు.

**యుద్ధానికి దారితీసిన ఆత్మాహుతి దాడి**

**మిలిటెంట్ల దుశ్చర్యపై ఆగ్రహావేశాలు**

రెండు వారాల క్రితం జెనిన్ క్యాంప్‌లో మిలిటెంట్లు రెచ్చిపోయారు. జెనిన్ నుంచి ఇజ్రాయెల్ భూభాగంపైకి రాకెట్ ప్రయోగించారు. దీంతో భారీ పేలుడు చోటుచేసుకుంది. ఏడుగురు ఇజ్రాయెల్ జవాన్లు గాయపడ్డారు. వారిని హెలికాప్టర్లలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మిలిటెంట్ల దుశ్చర్యంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ చేతగానితనంలోనే ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారంటూ ఇజ్రాయెల్‌లో ప్రతిపక్షాలు ఆరోపణలు గుప్పించాయి. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూపై ఒత్తిడి పెరిగింది. దానికితోడు వెస్ట్‌బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిలర్స్‌లో ఎక్కువమంది నెతన్యాహూ మద్దతుదారులే ఉన్నారు. మిలిటెంట్లను కఠినంగా అణచివేయాలంటూ వారు సైతం ఒత్తిడి తెచ్చారు. దాంతో జెనిన్ క్యాంప్‌లో సైనిక ఆపరేషన్‌కు నెతన్యాహూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. ఈ నెల 3వ తేదీన ఇజ్రాయెల్ సైన్యం రంగంలోకి దిగింది. జెనిన్‌లో శరణార్థుల ఇళ్లలో సోదాలు నిర్వహించింది. ముష్కరుల స్థావరాలుగా భావిస్తున్న ప్రాంతాలపై డ్రోన్లతో దాడులు చేసింది.

**సాక్షి, నేషనల్ డెస్క్**

## వెస్ట్‌బ్యాంక్‌లో ముగిసిన సైనిక ఆపరేషన్

- 12 మంది పాలస్తీనా జాతీయులు, ఒక ఇజ్రాయెల్ జవాను మృతి
- వెనక్కి వెళ్లిపోయిన ఇజ్రాయెల్ సైన్యం

వెస్ట్‌బ్యాంక్

మిలిటెంట్లను ఏరివేయడమే లక్ష్యంగా వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ సైన్యం చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్ బుధవారం ముగిసింది. ఇజ్రాయెల్ బలగాలను వెనక్కి వెళ్లిపోయాయి. సోమవారం, మంగళవారం జరిగిన దాడుల్లో 12 మంది పాలస్తీనావాసులు, ఒక ఇజ్రాయెలీ జవాను మృతిచెందారు. తాము నిర్వహించిన డ్రోన్ దాడుల్లో చనిపోయినవారంతా మిలిటెంట్లేనని ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది. జెనిన్ శరణార్థుల శిబిరంలో భయం ఇంకా తొలగిపోలేదు. జనం ఇప్పుడిప్పుడే ఇళ్ల నుంచి బయటకు వస్తున్నారు. వీధులను శుభ్రం చేసుకుంటున్నారు. దుకాణాలు తెరుచుకుంటున్నారు. ప్రాణభయంతో ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు క్రమంగా తిరిగివస్తున్నారు. క్యాంప్‌లో ఎక్కడ చూసినా భీతావహ వాతావరణం కనిపిస్తోంది. ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. చాలా ఇళ్లు దెబ్బతిన్నాయి. తాగునీరు, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇంకా పునరుద్ధరించలేదు. ఇంటర్నెట్ సేవలు సైతం ఆగిపోయాయి. డ్రోన్ దాడుల్లో మిలిటెంట్ ముఠాలకు భారీగా నష్టం వాటిల్లిందని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. వెస్ట్‌బ్యాంక్ నుంచి ఉగ్రవాదులు ఖాళీ చేసి వెళ్లిపోవాలని, లేకపోతే భవిష్యత్తులో ఇలాంటి సైనిక ఆపరేషన్లు పునరావృతం కావడం తథ్యమని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూ హెచ్చరించారు. జెనిన్ శివారులోని ఓ సైనిక స్థావరాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడమే లక్ష్యమని ఉద్ఘాటించారు.

**ప్రజల దృష్టిని మళ్లించేందుకేనా?**

ఇటీవలి కాలంలో బెంజమిన్ నెతన్యాహూ రాజకీయంగా కొంత బలహీనపడ్డారు. ఆయన తీసుకొచ్చిన వివాదాస్పద న్యాయ వ్యవస్థ సంస్కరణ బిల్లుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వెస్ట్‌బ్యాంక్‌లో జెనిన్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో సాయుధ ముఠాలు బలం పుంజుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల దృష్టిని మళ్లించాల్సిన అవసరం ఆయనకు ఏర్పడిందని రాజకీయ నిపుణులు అంటున్నారు. అందుకే జెనిన్ క్యాంప్‌లో సైనిక ఆపరేషన్‌కు ఆదేశాలు ఇచ్చారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### మోదీ లూటీ విధానాల వల్లే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుదల

**ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టీకరణ**



న్యూఢిల్లీ: దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగానికి నరేంద్ర మోదీ ప్రభుత్వ చేతగానితనమే కారణమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. ప్రభుత్వ డొల్ల నినాదాలను ప్రజలు ఎంతమాత్రం నమ్మడం లేదని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పరాభవం తప్పదని జోస్యం చెప్పారు. మోదీ ప్రభుత్వం ప్రజలను లూటీ చేయడమే పనిగా పెట్టుకుందని, అందుకే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆరోపించారు. జనం కష్టాల్లో ఉంటే బీజేపీ మాత్రం అధికారం కోసం పాకులాడుతోందని దుయ్యబట్టారు. ఈ మేరకు ఖర్గే బుధవారం ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు ఆకాశంలోకి దూసుకెళ్తున్నాయని, నిరుద్యోగం 8.45 శాతానికి చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని, పనులు లేక కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల ముందు అచ్చే దిన్, అమృత్ కాల్ అంటూ నినాదాలు ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పుడు వాటిని పూర్తిగా విస్మరించారని ఖర్గే ఆక్షేపించారు. ఈసారి ఎన్నికల్లో ఎన్ని రకాలుగా ప్రచారం చేసుకున్నా ఫలితం ఉండదని, బీజేపీని జనం ఓడించడం తథ్యమని జోస్యం చెప్పారు.

### అమెరికాలో తూటాలకు మరో ఇద్దరు బలి

వాషింగ్టన్: అమెరికాలో స్వాతంత్ర్య దిన సంబరాలు తూటాల వర్షంతో ఎరుపెక్కుతూనే ఉన్నాయి. సోమ, మంగళవారాల్లో పలుచోట్ల జరిగిన కాల్పుల్లో పలువురు మరణించడం తెలిసిందే. బుధవారం రాజధాని వాషింగ్టన్‌లో మళ్లీ తుపాకుల మోత మోగింది. స్వాతంత్ర్య సంబరాలు చేసుకుంటున్న 9 మంది వాటిలో పలువురు గాయపడ్డారు. కారులో నుంచి కాల్పులు జరిగినట్టు చెబుతున్నారు. మరోవైపు లూసియానాలో మంగళవారం జరిగిన కాల్పులకు సంబంధించి బుధవారం మరో శవం దొరికింది.

### తీస్తా బెయిల్ పొడిగింపు

న్యూఢిల్లీ: 2002 గోధ్రా అనంతర అల్లర్ల కేసులో హక్కుల కార్యకర్త తీస్తా సీతల్‌వాద్ బెయిల్‌ను జూలై 19 దాకా సుప్రీంకోర్టు పొడిగించింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, ఎ.ఎస్.బొపన్న, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం బుధవారం ఈ మేరకు నిర్ణం వెలువరించింది. పిటిషనర్ మహిళ గనుక గుజరాత్ హైకోర్టే బెయిల్ రూపంలో ఆమెకు ఎంతో కొంత రక్షణ కల్పించి ఉండాల్సిందని అభిప్రాయపడింది. అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణను జూలై 19కి వాయిదా వేసింది. సీతల్‌వాద్‌కు జూలై 1న సుప్రీంకోర్టు వారం పాటు బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే.

## మహిళను నేలపైకి తోసి, పెప్పర్ స్ప్రే కొట్టి...

వాషింగ్టన్: అమెరికాలో పోలీసుల జులుం మరోసారి తెరపైకి వచ్చింది. సూపర్ మార్కెట్లో దొంగతనానికి పాల్పడిందంటూ ఓ మహిళతో పోలీసు అధికారి ఒకరు అనాగరికంగా వ్యవహరించాడు. బేడీలు వేసి నిర్బంధంలోకి తీసుకున్నాక కూడా ఆమెను నేలపైకి తోసేసి, పెప్పర్ స్ప్రే కొట్టి హింసించాడు. 'ఊపిరాడటం లేదు (ఐ కాంట్ బ్రీత్) అంటూ అల్లాడుతున్నా కనికరించలేదు. చెంపపై కొట్టడమే గాక మెడపై మోకాలు పెట్టి తొక్కినట్టు కూడా చెబుతున్నారు. ఆమెకు క్యాన్సర్ ఉందని ఆమెతో పాటున్న సహచరుడు చెబుతున్నా వినిపించుకోలేదు. జూన్ 24న జరిగిన ఈ ఉదంతాన్ని ఒక వ్యక్తి వీడియో తీశాడు. సదరు పోలీసును ఆపేందుకు అతను విఫల ప్రయత్నం చేశాడు. లాస్ ఏంజెలిస్ కౌంటీలోని లాంకస్టర్‌లో జరిగిన ఈ దారుణానికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో పోలీసు శాఖ విచారణకు ఆదేశించింది. ఉదంతంలో పాల్గొన్న ఇద్దరు పోలీసులను విధుల నుంచి తప్పించినట్టు ఫాక్స్ న్యూస్ పేర్కొంది.





### హాయ్ పుతిన్...!

పుతిన్‌ను చూశానన్న ఆనందంలో ఉన్న ఎనిమిదేళ్ల చిన్నారి రైసత్ అకిపోవాను హత్తుకుంటున్న రష్యా అధ్యక్షుడు పుతిన్. చిన్నారి ఉండే ప్రాంతం డగేస్తాన్‌లో పుతిన్ పర్యటించడం, అప్పుడు పుతిన్‌ను చూడలేకపోయానని చిన్నారి వెక్కివెక్కి ఏడ్వడం మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఆయన ఇలా ఆమెను మాస్కోకు పిలిపించుకున్నారు. స్వయంగా చిన్నారితో ఆర్థికమంత్రికి ఫోన్ చేయించి సొంత ప్రాంతానికి నిధుల కేటాయింపు పెంచేలా చేశారు. మంగళవారం మాస్కోలో అధ్యక్షభవనంలో తీసిందీ ఫొటో.



# బాబాయ్, ఇక తప్పుకో!



ముంబైలో పార్టీ నేతలనుద్దేశించి ప్రసంగిస్తున్న శరద్ పవార్



ముంబైలో సమావేశంలో అజిత్ పవార్ తదితరుల అభివాదం

### పవార్‌కు అజిత్ సూచన

- సీఎం కావాలని ఉందని వ్యాఖ్య
- పోటాపోటీగా బల ప్రదర్శన సభలు
- అజిత్ భేటీకి 32, పవార్ సభకు 18 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలు హాజరు

ముంబై: మహారాష్ట్రలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)పై ఆధిపత్యం కోసం పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్, చీలిక వర్గం నేత, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇరువురు నేతలు బుధవారం బల ప్రదర్శనకు దిగారు. ఎమ్మెల్యేలు, అనుచరులతో కలిసి సమావేశాలు నిర్వహించారు. పరస్పరం వాగ్బాణాలు విసురుకున్నారు. అయితే నంబర్ గేమ్‌లో బాబాయిపై అబ్బాయి అజిత్‌దే పై చేయి అయింది. 53 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేల్లో అజిత్ సభకు 32 మంది హాజరయ్యారని ఆయన వర్గం నేతలు వెల్లడించారు. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పుకొచ్చారు. 8 మంది ఎన్సీపీ ఎమ్మెల్సీల్లో ఐదుగురు ఇప్పటికే అజిత్‌కు మద్దతు ప్రకటించారు. అనర్హత వేటు నుంచి తప్పించుకోవాలంటే అజిత్‌కు 36 మంది ఎమ్మెల్యేల మద్దతు కావాలి. ఆయనకు 40 మంది అండ ఉందని చీలిక వర్గం ఎమ్మెల్యే అనిల్ పాటిల్ చెప్పారు. ఇక శరద్ భేటీకి 18 మంది ఎమ్మెల్యేలే హాజరైనట్లు సమాచారం. కొందరు ఎమ్మెల్యేలు ఇరు భేటీల్లోనూ పాల్గొనడం విశేషం! ఎన్సీపీకి 53 మంది ఎమ్మెల్యేలున్నారు. ఈ నేపథ్యంలో ఏ భేటీకి వెళ్లని ఎమ్మెల్యేల మద్దతు రెండు వర్గాలకూ కీలకంగా మారేలా కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు వర్గాలూ ముంబై అంతటా పోటాపోటీగా పోస్టర్లు వేసి హంగామా చేశాయి. ఒంటరి పోరు చేస్తున్న 83 ఏళ్ల యోధునికి అండగా నిలుద్దామంటూ పవార్ నివాసం ముందు అభిమానులు ప్లకార్డులు ప్రదర్శించారు.

**బీజేపీది ధృతరాష్ట్ర కౌగిలి: పవార్**

ఇప్పటిదాకా బీజేపీతో కలిసి అధికారం పంచుకున్న పార్టీలన్నీ రాజకీయంగా సర్వనాశనమే అయ్యాయని శరద్ పవార్ అన్నారు. అజిత్ వర్గానికీ అదే గతి పట్టక తప్పదని జోస్యం చెప్పారు. ''రాజకీయ భాగస్వామ్య పార్టీలను క్రమంగా బలహీనపరచడం బీజేపీ విధానం. పంజాబ్ అకాలీదళ్ నుంచి తెలంగాణ, ఏపీ, బిహార్ దాకా ఇందుకు ఎన్నో ఉదాహరణలున్నాయి. బిహార్లో నితీశ్‌కుమార్ ముందుగానే మేల్కొని బీజేపీకి గుడ్‌బై చెప్పి ఆర్జేడీతో జట్టు కట్టారు'' అన్నారు. అజిత్ బల ప్రదర్శన సభలో తన ఫొటో ప్రదర్శించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. తనను కాదనుకుని వెళ్లిపోయాక ఫొటో ఎలా పెట్టుకుంటారంటూ దుయ్యబట్టారు. ఎన్సీపీ గుర్తును ఎవరూ లాక్కోలేరని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. పార్టీ గుర్తు కేటాయించాలంటూ అజిత్ ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించడం తెలిసిందే.

**ఇక విశ్రాంతి తీసుకోండి: అజిత్**

83 ఏళ్ల శరద్ పవార్ రాజకీయాల నుంచి తప్పుకోవాల్సిన సమయం వచ్చిందని మద్దతుదారుల భేటీలో అజిత్ అన్నారు. ఐఏఎస్‌లు కూడా 60 ఏళ్లకు రిటైర్ అవుతుంటారు. బీజేపీలో నేతలు 75 ఏళ్లకే రిటైరయ్యే సంప్రదాయముంది. ఆ పార్టీ సీనియర్ నేతలు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషీ ఇప్పటికే రాజకీయాల నుంచి తప్పుకున్నారు. ప్రతి ఒక్కరికీ సొంత ఇన్నింగ్స్ ఉంటుంది. 25 నుంచి 75 ఏళ్ల దాకా మాత్రమే చక్కగా పని చేయగలుగుతారు. మీరెప్పుడు తప్పుకుంటారు?'' అని పవార్‌ను ప్రశ్నించారు. 2004 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే ఎన్సీపీకే ఎక్కువ సీట్లొచ్చినా ఆ పార్టీకే సీఎం పదవిని పవార్ కట్టబెట్టారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ''పవార్ మాకు దేవుడు. ఆయనపై అపార గౌరవముంది. ఆయన నిండు నూరేళ్లు జీవించాలని కోరుతున్నాం'' అన్నారు. తమకు ఆశీస్సులందించాలని కోరారు. తనకు సీఎం కావాలని కోరికగా ఉందని చెప్పారు. ఆయన గత ఆదివారం పలువురు ఎమ్మెల్యేలతో పాటు ఎన్సీపీని వీడి సొంత కుంపటి పెట్టుకోవడం, శివసేన (షిండే)–బీజేపీ సంకీర్ణంలో చేరడం తెలిసిందే. ఎన్సీపీని అవినీతి పార్టీగా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శిస్తుంటే అజిత్ అదే బీజేపీ పంచన చేరారంటూ పవార్ మండిపడ్డారు.

**చీలికకు ముందే ఈసీ వద్దకు అజిత్!**

ఎన్సీపీ నుంచి వేరుపడే ముందే పార్టీ పేరు, గుర్తు కోసం అజిత్ ఈసీని ఆశ్రయించినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆయన జూలై 2న తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి అధికార సంకీర్ణంలో చేరడం తెలిసిందే. తనకు 40 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేల మద్దతున్నందంటూ జూన్ 30వ తేదీనే ఈసీకి ఆయన లేఖ రాశారని, పార్టీ అధ్యక్షునిగా తనను ప్రకటించడంతో పాటు పార్టీ పేరు, గుర్తు కూడా కేటాయించాలని కోరారని సమాచారం.

## ...అలాగైతే రూ.15కే లీటర్ పెట్రోల్: గడ్కరీ

ప్రతాప్‌గఢ్ (రాజస్తాన్): వాహనాలకు ఇంధనంగా 60 శాతం ఇథనాల్, 40 శాతం విద్యుత్‌ను వాడుకోగలిగితే పెట్రోల్ ధర అమాంతం తగ్గి లీటర్ రూ.15కే అందుబాటులోకి వస్తుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. బుధవారం రాజస్తాన్‌లోని ప్రతాప్‌గఢ్‌లో ఒక ర్యాలీలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా రైతులను అన్నదాతలుగానే కాకుండా ఇంధన దాతలుగా కూడా మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వాహనాలన్నీ వారు ఉత్పత్తి చేసే ఇథనాల్‌తోనే నడవాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. ''ఇథనాల్–విద్యుత్ ఇంధనంతో కాలుష్యంతో పాటు దిగుమతుల అవసరమూ బాగా తగ్గుతుంది. రూ.16 లక్షల కోట్ల దిగుమతి వ్యయాన్ని రైతుల సంక్షేమంపై వెచ్చించవచ్చు'' అని వివరించారు.

## ఈడీని కట్టడి చేయాల్సిందే

- మితిమీరిన అధికారాలున్నాయి
- సుప్రీంకోర్టులో వాదనలు

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసుల్లో విచారణ విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి అపరిమితాధికారాలు కట్టబెట్టారని సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే ఆందోళన వెలిబుచ్చారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు తక్షణం జోక్యం చేసుకోవాలని కోరారు. లేదంటే పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛ ప్రమాదంలో పడుతుందన్నారు. దేశంలో ఎవరికీ భద్రత కూడా ఉండబోదన్నారు. ఎం3ఎం రియల్టీ గ్రూప్ డైరెక్టర్లు బన్సల్ బ్రదర్స్ అరెస్టు కేసులో మంగళవారం సుప్రీంకోర్టులో న్యాయమూర్తులు ఏఎస్ బొపన్న, ఎంఎం సుందరేశ్ ధర్మాసనం ముందు ఆయన వాదనలు విన్పించారు. విచారణకు డైరెక్టర్లు అన్నివిధాలా సహకరిస్తున్నా ఈడీ నిరంకుశ పద్ధతిలో అరెస్టు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. ముందస్తు బెయిల్ నిబంధనల్లో ఒక్కదానికి కూడా విరుద్ధంగా నడుచుకోలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. అందుకు జస్టిస్ సుందరేశ్ సరదాగా స్పందించారు. ''మీరన్నది నిజమే. ఇది పిల్లీ ఎలుకా చెలగాటం. వాళ్లు చట్టాలను ఉపయోగిస్తున్నారు'' అని వ్యాఖ్యానించారు. బన్సల్ సోదరులను ఈడీ జూన్ 14న అరెస్టు చేసింది. హరియాణాలోని పంచకుల కోర్టు విధించిన ఐదు రోజుల కస్టడీని వాళ్లు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు విజ్ఞప్తి మేరకు విచారణను ధర్మాసనం రెండు వారాలకు వాయిదా వేసింది.

### కూతురిని తెగనమ్మిన తల్లి

మయూర్‌భంజ్: రెండోసారీ ఆడపిల్లే పుట్టిందని ఆమెను రూ.800కు అమ్మేసిందో దయలేని తల్లి. పైగా ఉపాధి నిమిత్తం తమిళనాడు వెళ్లిన భర్త తిరిగొచ్చి కూతురేదని అడిగితే చనిపోయిందంటూ కథ అల్లింది. పొరుగువాళ్ల ద్వారా విషయం తెలిసి అతను పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ దారుణం ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలోని కుంటాలో జరిగింది. కరామీ ముర్ము అనే నిరుపేద గిరిజన మహిళ తనకు రెండో కూతురు పుట్టడంతో దిగాలు పడింది. ఇద్దరు అమ్మాయిలను పెంచడమెలా అని పొరుగింటావిడతో వాపోయింది. ఆమె సలహా మేరకు ఎనిమిది నెలల పాపాయిని రూ.800కు అమ్మేసింది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగి పాపను కొనుక్కున్న దంపతులతో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన పొరుగింటి మహిళను కూడా అరెస్టు చేశారు. పాపను చిన్నారుల వసతి గృహానికి తరలించినట్టు ఎస్పీ బత్తుల గంగాధర్ తెలిపారు.



ప్రపంచంలోనే అతిపెద్ద గోళాకార భవంతి ఇది. 5.8 లక్షల చదరపు అడుగుల భవన ఉపరితలంపై ఎల్‌ఈడీ ఫలకాలను అమర్చారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లాస్‌వెగాస్‌లో తొలి సారిగా వాటినిలా అమెరికా జాతీయజెండా రంగుల్లో వెలిగించారు.



### గడువు పొడిగింపు

సాక్షి, సిటీబ్యూరో: ఎయిర్ పోర్ట్ మెట్రో ప్రాజెక్టు బిడ్డింగ్ గడువును ఈ నెల 12 వరకు పొడిగించినట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.



### లాల్‌దర్వాజా బోనాలకు రండి

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా బోనాలను ప్రారంభించాలని నగర కొత్వాల్ సీవీ ఆనంద్‌కు ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

### నేడు యాంటీ రేబిస్ ఉచిత వ్యాక్సినేషన్

హిమాయత్‌నగర్: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా గురువారం ఉదయం నారాయణగూడలోని వెటర్నరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో శునకాలకు, ఇతర జంతువులకు 'యాంటీ రేబిస్' ఉచిత వ్యాక్సిన్‌ను ఇవ్వనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వ్యాక్సినేషన్ క్యాంప్ ఉంటుందన్నారు.

## న్యూస్‌రీల్

### లోకేశ్‌కుమార్‌కు కేటీఆర్ అభినందనలు

సాక్షి, సిటీబ్యూరో: సుదీర్ఘ కాలం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా పనిచేసి బదిలీ అయిన సీనియర్ ఐఏఎస్ అధికారి లోకేశ్‌కుమార్‌కు మంత్రి కేటీఆర్ అభినందనలు తెలిపారు. లోకేశ్‌కుమార్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ అనేక కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా నగరంలో మౌలిక వసతుల కల్పన, ప్రజారవాణాను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన ఎస్సార్‌డీపీ, లింక్ రోడ్ల నిర్మాణం, ఎస్ఎన్‌డీపీ వంటి వ్యూహాత్మక కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఆయన చేసిన కృషికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. లోకేశ్‌కుమార్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో నగర మేయర్ విజయలక్ష్మితో పాటు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, జలమండలి ఎండీ దాన కిషోర్, జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్ రోనాల్డ్ రాస్, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ జోనల్, డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

### రోనాల్డ్ రాస్ బాధ్యతల స్వీకరణ



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్‌గా రోనాల్డ్ రాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పని చేసిన లోకేశ్‌కుమార్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు సచివాలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా వివిధ విభాగాల అధికారులు లోకేశ్‌కుమార్‌కు వీడ్కోలు, రోనాల్డ్ రాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో అడిషనల్ కమిషనర్లు ప్రియాంక అలా, వి.కృష్ణ, సరోజ, విజయలక్ష్మి, జయరాజ్ కెనెడీ, జోనల్ కమిషనర్లు మమత, పంకజ, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, ఈఎన్సీ జియావుద్దీన్, సీసీపీ దేవేందర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ సీఈ దేవానంద్, హౌసింగ్ ఓఎస్డీ సురేష్‌కుమార్, పలువురు డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

### తెలంగాణ మట్టిది ఘనమైన చరిత్ర

చార్మినార్: తెలంగాణలో ఎక్కడ మట్టిని ముట్టుకున్నా.. ఏ ఊరును కదిపినా.. సంపద్వంతమైన చరిత్ర ఊటలాగా పుట్టుకొస్తుందని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో జరిగిన 'మన ఊరు- మన చరిత్ర' ప్రాజెక్టుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సిటీ కళాశాల విద్యార్థులు కాకతీయుల కాలం నుంచి నేటి వరకు తెలంగాణ గ్రామీణ చరిత్రను వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో తిరిగి రాయాలన్నారు. విద్యార్థులు చరిత్ర ఆనవాళ్లలోకి వెళ్లి పరిశీలిస్తే.. పాఠ్యాంశాలలో లేని అనేక విషయాలు అవగతమవుతాయన్నారు. వీర తెలంగాణ పోరాటంలో గ్రామీణ యువకులు చేతి కర్రను తుపాకీగా మార్చి ఆధిపత్య వాదులపై అలుపెరగని పోరాటం చేసిన విధానాన్ని చరిత్రగా రాయాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులు అందుకునే డిగ్రీ పట్టా విలువ కంటే తమ స్వగ్రామాల గురించి రాసే చరిత్ర ఎంతో విలువైనదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవనం నిర్మించి రోగుల కష్టాలను తీర్చాలని నినాదాలు చేస్తున్న వైద్యులు, నర్సింగ్ విద్యార్థినులు



## ఉస్మా 'నయా' ఎప్పుడో?

నిత్యం వేలాది మంది పేద రోగులకు వైద్య సేవలందిస్తున్న ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి వెంటనే నూతన భవన నిర్మాణం చేపట్టాలని ఓజీహెచ్ జేఏసీ నాయకులు డాక్టర్ పాండూ నాయక్, బి.రమేష్ డిమాండ్ చేశారు. వైద్యులు, నర్సింగ్ విద్యార్థినులు సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఉస్మానియాకు కొత్త భవనం కావాలని నినాదాలు చేశారు. - అఫ్జల్‌గంజ్

# తారెత్తిస్తున్న కారు

### సిటీలో తరచూ చోటు చేసుకుంటున్న వీటి ప్రమాదాలు

- రెండ్రోజుల క్రితం నార్సింగిలో తల్లీకూతుళ్ల మృత్యువాత
- ఈ పరిస్థితులు ఏర్పడటానికి లోపాలు, కారణాలు అనేకం
- లైసెన్సింగ్ విధానం మారాలంటున్న ట్రాఫిక్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని జన్వాడ ప్రాంతంలో శాంతమ్మ. జవహర్‌నగర్ ఫైరింగ్ కట్ట వద్ద షేక్ అమీనా. మల్రిగూడ శివార్లలో రాజు మహతో. హైదర్‌షాకోట్ పరిధిలో తల్లీకూతుళ్లు అనురాధ, మమత.. ఇటీవల కార్లు సృష్టించిన బీభత్సాల్లో అసువులు బాసిన వారిలో కొందరు వీరు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఈ తేలికపాటి వాహనాలు తారెత్తించేస్తున్నాయి. ఈ ఘటనలు చోటు చేసుకోవడం వెనుక అనేక కారణాలు ఉంటున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఏటా నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో తేలికపాటి వాహనాలుగా పిలిచే కార్ల వాటా పది శాతానికి పైగా ఉంటోంది.

**మద్యం నుంచి.. నిర్లక్ష్యం వరకు..**

కార్ల వంటి తేలికపాటి వాహనాలకు సంబంధించిన ప్రమాదాల్లో అత్యంత సంచలనాత్మక ఘటనలూ ఉంటున్నాయి. బంజారాహిల్స్ ఠాణా పరిధిలోని పంజగుట్ట శ్మశాన వాటిక వద్ద జరిగిన చిన్నారి రమ్య ఉదంతం, నారాయణగూడ ఫ్లైఓవర్‌పై పట్టపగలు ఓ నిండు ప్రాణాన్ని తీసిన వైనం.. ఇలా ఎన్నో సంచలనాత్మక ఉదంతాలు గత ఏడాది చోటు చేసుకున్నాయి. ఇలాంటి ప్రమాదాలు జరగడానికి అనేక కారణాలు ఉంటున్నాయని పోలీసులు చెబుతున్నారు. ప్రధానంగా మద్యం మత్తులో డ్రైవింగ్ చెయ్యడంతో పాటు నిర్లక్ష్యంగా వాహనం నడపడం కూడా ఓ కారణంగా మారుతోందని అధికారులు చెబుతున్నారు. వీటికి తోడు నగరంలోని రహదారుల్లో ఉన్న ఇంజినీరింగ్ లోపాలు, డ్రైవర్ల నిద్ర మత్తు సైతం ప్రమాద హేతువులుగా మారుతున్నాయి. సిటీలో వంపులు లేకుండా ఉన్న రహదారుల్ని వేళ్ల మీద లెక్కట్టొచ్చు. అందులోనూ అనేక బాటిల్‌నెక్స్ ఉంటాయి. ఇవన్నీ ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా ఉంటున్నాయి.

**డ్రైవింగ్ అంటే 'ఆ మూడే' అని..**

ఇటీవల కాలంలో నగరంలో కార్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రజల జీవన ప్రమాణాలతో పాటు సెకండ్ హ్యాండ్ మార్కెట్ పెరగడం, ఫైనాన్సింగ్ విధానాలు ఇలా అనేక కారణాల నేపథ్యంలో కార్లు ఖరీదు చేస్తున్న వారు ఎక్కువగానే ఉంటున్నారు. వీరంతా ప్రాథమికంగా వివిధ డ్రైవింగ్ స్కూళ్లల్లోనో, పరిచయస్తుల వద్దో డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. ఆ సమయంలో వీరి దృష్టంతా స్టీరింగ్, క్లచ్, బ్రేక్‌లపైనే ఉంటోంది. ఈ మూడింటినీ నిర్వహించగలిగితే ఎక్కడైనా వాహనం నడపవచ్చని భావిస్తుంటారు. అయితే హఠాత్పరిణామాలు, మార్జిన్స్, ఓవర్ టేకింగ్ తదితర సందర్భాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీరికి పూర్తి స్థాయిలో పట్టు ఉండట్లేదు. దీంతో 'ఆ మూడు' నేర్చుకుని రోడ్లపైకి వస్తున్న వాహనచోదకులు అనేక సందర్భాల్లో ప్రమాదాలకు లోనుకావడంతో పాటు కారకులుగానూ మారుతున్నారు.

**లైసెన్స్ జారీ విధానాల్లోనూ లోపాలెన్నో..**

నగరంలోనే కాదు దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ డ్రైవింగ్ లైసెన్సులు జారీ వ్యవహారం లోపభూయిష్టంగా ఉంది. ఎల్ఎల్ఆర్ జారీ చేయడానికి ముందు నిర్వహించే కంప్యూటర్ పరీక్ష తూతూమంతంగా సాగిపోతోంది. దీని తర్వాత ట్రాక్ టెస్ట్ జరుగుతోంది. ఇప్పటికే ఏ కేంద్రంలోనూ పూర్తిస్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాక్ టెస్ట్ చేసే సామర్థ్యం లేదు. కేవలం మాన్యువల్‌గా మాత్రమే, కేవలం కొన్ని అంశాలనే అలా తనిఖీ చేస్తున్నారు. లైసెన్సులు జారీ చేసే విధానంలో లోపాల కారణంగా డ్రైవింగ్‌పై పూర్తి పట్టులేని వారికీ లైసెన్సులు వచ్చేస్తున్నాయి. వీరిలో కొందరు క్యాబ్ డ్రైవర్లు కూడా ఉంటున్నారు. ఇలాంటి డ్రైవర్ల కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్ని పూర్తిగా మార్చి, లోపాలను సరి చేయడంతో పాటు నిబంధనల్ని కఠినతరం చేస్తేనే ప్రమాదాలను నిరోధించే అవకాశం ఉందని పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

### 'ఆ ఇద్దరికీ' ఇస్తే యజమానీ బాధ్యుడే..

హైదర్షాకోట్ వద్ద తల్లీకూతుళ్ల ఉసురు తీసి, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటానికి కారణమైన కారు ప్రమాదం ఉదంతాన్ని నార్సింగి పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ కేసులో అధికారులు తీసుకున్న చర్యలు మైనర్లు, డ్రైవింగ్ లైసెన్సు లేని వారికి వాహనాలు ఇచ్చే వ్యక్తులకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ ప్రమాదానికి కారణమైన కారు నడిపిన మహ్మద్ బదియుద్దీన్ ఖాద్రీతో పాటు కారు యజమాని అబ్దుల్ రెహ్మాన్‌ను అరెస్టు చేశారు. ఫాంహౌస్‌లో జరిగే పుట్టిన రోజు వేడుకల్లో హంగామా చేయడానికి బదియుద్దీన్ తీసుకువెళ్తున్న కత్తి (డాగర్) సైతం ఈ కారులో లభించింది. దీంతో కేసులో ఐపీసీ, మోటారు వాహనాల చట్టంతో పాటు ఆయుధ చట్టంలోని సెక్షన్‌ను జోడించారు. ఎవరైనా తమ వాహనాలను మైనర్లు, డ్రైవింగ్ లైసెన్సు లేని వారికి ఇవ్వడం నేరమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. అలాంటి వారు వాహనం నడుపుతూ దొరికినా, ఇలాంటి ప్రమాదాలకు కారణమైనా వాహన యజమానుల పైనా చర్యలు ఉంటాయని చెబుతున్నారు.

### కారు బీభత్సం కేసులో ముగ్గురి అరెస్టు

మణికొండ: నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలోని హైదర్షాకోట్ వద్ద తల్లీకూతుళ్ల మృతికి కారణమైన కారు ప్రమాదంలో పోలీసులు మొత్తం ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిని బుధవారం ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. కారును నడిపిన బదియుద్దీన్‌తో పాటు ఇతడికి కారు ఇచ్చిన రెహ్మాన్, స్పీడ్‌గా నడపాలంటూ ప్రేరేపించిన గణేష్‌లను అరెస్టు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో కారు దాదాపు 150 కి.మీ వేగంతో పయనిస్తోందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

# వార్డు ఆఫీసులే వారధి

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో ఇటీవల ప్రారంభించిన వార్డు కార్యాలయాలను మరింతగా ప్రజల్లోకి తీసుకుపోయేలా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి కేటీఆర్ అధికారులకు సూచించారు. ఇందుకుగాను వార్డు పరిధిలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల (ఆర్‌డబ్ల్యూఏ) భాగస్వామ్యంతో వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్థానిక మహిళా సంఘాలు, ఇతరత్రా సంఘాల సహకారంతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వార్డు కార్యాలయ వ్యవస్థపై బుధవారం హైదరాబాద్ మెట్రోరైల్ భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వార్డు కార్యాలయాలకు పౌరుల నుంచి క్రమేపీ స్పందన పెరుగుతోందని, దీన్ని మరింతగా పెంచేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పౌరుల భాగస్వామ్యంతోనే పురపాలన లక్ష్యాలు సాధ్యమవుతాయని ప్రభుత్వం బలంగా నమ్ముతోందన్నారు.

- వార్డు కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదులు పెరిగితే దాన్ని సానుకూలంగా చూస్తామని చెప్పారు. ఈ వ్యవస్థ బాగా పని చేస్తోందనే నమ్మకం పెరిగితేనే తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ప్రజలు ఎక్కువగా వస్తారన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని సూచించారు. పౌర సేవలందించే ప్రక్రియను ఎప్పటికప్పుడు మెరుగుపరిచే చర్యల్లో భాగంగానే ఈ వార్డు కార్యాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలన్నారు. ఈ వ్యవస్థ ప్రస్తుతం ప్రారంభ దశలో ఉన్నందున అవసరమైతే మార్పులు చేర్పులు చేసుకోవాలని చెప్పారు. అవసరమైన టెక్నాలజీని వాడుకొని వార్డు కార్యాలయ వ్యవస్థను మరింతగా బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు.

### పౌరుల భాగస్వామ్యంతోనే లక్ష్యాల సాధన

- అధికారులతో సమీక్ష సమావేశంలో మంత్రి కేటీఆర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

**వర్షాకాలం సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉండాలి..**

ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ వారాంతం నుంచి భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అంతర్గత విభాగాలతో పాటు ఇతర శాఖలతో కలిసి వర్షాలతో ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమన్వయంతో పని చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని అధికారులను కోరిన మంత్రి కేటీఆర్.. ఈ ప్రక్రియలో అత్యంత కీలకమైన పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో ఎక్కడికక్కడ భోజన సమావేశాలు ఏర్పాటు చేసుకొని, వారి సేవలకు అభినందనలు తెలుపుతూనే, నగర పారిశుద్ధ్యాన్ని మరింతగా మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేయాలని ఆదేశించారు.


**ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజల సంతృప్తి..**

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ వార్డు కార్యాలయ వ్యవస్థకు ప్రజల నుంచి వస్తున్న స్పందన గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలతో వార్డు కార్యాలయాన్ని సందర్శించిన పలువురితో తాము స్వయంగా ఫోన్లో మాట్లాడామని, ఫిర్యాదు అందాక పరిష్కారమవుతున్న తీరుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని జోనల్, డిప్యూటీ కమిషనర్లు తెలిపారు.

# సైబర్ కేటుగాళ్ల స్వైరవిహారం

### నెక్సాన్ కారు గెలిచావని రూ.36 లక్షలు స్వాహా

- మాయ మాటలు చెప్పి రూ.53 లక్షలు దోచేశారు
- బిట్‌కాయిన్ పేరుతో రూ.18 లక్షలు ఊడ్చేశారు
- ఒక్కరోజులోనే నగరంలో మూడు ఘటనలు
- రూ.1.7 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు



హిమాయత్‌నగర్: సైబర్ నేరగాళ్లు ఒక్కొక్కరిని ఒక్కో తీరుగా మోసం చేస్తున్నారు. ఒక్కరోజులోనే మూడు ఘటనల్లో దాదాపు రూ.1.7 కోట్లు కొట్టేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిటీ సైబర్ క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.. నగరానికి చెందిన యువకుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు 'నెక్సాన్ ఎక్స్ ఎంఏ కారు గెలుచుకున్నావు. మార్కెట్‌లో దీని విలువ రూ.10 లక్షలు. ఇది మీ ఇంటికి రావాలంటే కొన్ని ఫార్మాలిటీస్ పూర్తిచేయాలి'. ఆర్టీఏ రూల్స్, ట్యాక్స్‌లు, ఇన్సురెన్స్ తదితర సాకులు చెప్పారు. యువకుడి నుంచి రూ.36 లక్షలు దోచుకున్నారు. మరో ఘటనలో.. యూట్యూబ్‌లో తాము పోస్ట్ చేసే వీడియోలను లైక్/కామెంట్/షేర్/సబ్‌స్క్రైబ్ చేస్తే కమీషన్ ఇస్తామన్నారు. తొలి రోజుల్లో రెండు రెట్లు ఎక్కువ ఇచ్చి నగర యువకుడికి నమ్మకం కలిగించారు. ఆపై ఇన్వెస్ట్‌మెంట్ వైపు మళ్లించారు, తాము చెప్పే వెబ్‌సైట్‌లలో ఇన్వెస్ట్ చేయాలన్నారు. వీటిలోనూ తొలుత లాభాలు ఇచ్చారు. ఆ తర్వాత రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టగా రూపాయి లాభం ఇవ్వలేదు. రూ.10 లక్షలు రావాలంటే టాస్క్‌లు పూర్తి చేయాలని చెప్పి రూ.53 లక్షలు దోచేశారు. ఇంకో ఘటనలో.. సిటీ పరిధిలోని ట్రాఫిక్ ఏఎస్సై సోదరుడికి సైబర్ నేరగాళ్లు పరిచయమయ్యారు. బిట్‌కాయిన్స్ కొనాలని, కొన్ని వెబ్‌సైట్‌లలో ఇన్వెస్ట్ చేయాలని సూచించారు. తొలిరోజుల్లో లాభాలు రావడంతో బంధువులకు కూడా చెప్పి ఆనందాన్ని పంచుకున్నాడు. ఆ తర్వాత బంగారం తాకట్టు పెట్టి, అప్పులు తెచ్చి మరీ బిట్‌కాయిన్స్‌పై ఇన్వెస్ట్ చేశాడు. ఇలా పలు దఫాలుగా రూ.18 లక్షలు కోల్పోయాడు. తన సోదరుడికి న్యాయం చేయాలంటూ ఆ ట్రాఫిక్ ఏఎస్సై సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు.

# డబ్బు పంపి.. క్రిప్టో కొనిపించి..

### సైబర్ నేరగాళ్ల కొత్తరకం మాయాజాలం

- పోలీసుల్ని ఆశ్రయించిన బాధితురాలు

హిమాయత్‌నగర్: సైబర్ నేరగాళ్లు మరో కొత్త తరహా మోసానికి తెర తీశారు. నగరానికి చెందిన మహిళకు పార్ట్‌టైం ఉద్యోగమిస్తామంటూ వాట్సాప్ ద్వారా పరిచయమైన కేటుగాళ్లు టెలిగ్రాంలోని ఓ గ్రూపులోకి తీసికెళ్లి అక్కడ ఆమెను నిండా ముంచారు. ఆమె వద్ద డబ్బు లేదని చెప్పడంతో వారే డబ్బు పంపి.. ఆ డబ్బుతో క్రిప్టో కరెన్సీని కొనిపించారు. వారు పంపిన డబ్బును రీక్లెయిమ్ చేసుకోవడంతో ఆమె ఖాతా మైనస్‌లోకి వెళ్లింది. ఓ పక్క సైబర్ నేరగాళ్ల కొత్త మోసం.. మరో పక్క బ్యాంకు అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో తనకు న్యాయం చేయాలంటూ బాధితురాలు సిటీ సైబర్ క్రైం పోలీసుల్ని ఆశ్రయించింది. ఈ కొత్త తరహా మోసంపై సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి..

తొలుత రూ.150 గెలుచుకున్న మహిళకు ఆ మొత్తాన్ని ఆమె ఖాతాకు టెలిగ్రాంలో పరిచయమైన ఓ రిసెప్షనిస్టు పంపింది. ఆ తర్వాత రూ.10 వేలు ఇన్వెస్ట్ చేయాలన్నారు. అంత డబ్బు తన వద్ద లేదని చెప్పడంతో వారే బాధిత మహిళ అకౌంట్‌కు పలు దఫాలుగా కొంత డబ్బు జమ చేశారు. అనంతరం ఆమె మొబైల్‌లో 'మెటా మాస్క్', 'హాబీ' అనే అమెరికాకు చెందిన రెండు క్రిప్టో యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయించారు. వాటిలో యూఎస్‌డీటీని కొనుగోలు చేయించి ఇండియన్ కరెన్సీగా మార్చి వీరి ఖాతాల్లోకి మహిళ ద్వారా క్రెడిట్ చేయించుకున్నారు. ఇందుకోసం ఆమెకు 20 శాతం కమీషన్ ఇస్తామన్నారు.

**బ్యాంకు నుంచి కాల్**

మీ అకౌంట్ రూ.43 వేలు మైనస్ బ్యాలెన్స్‌లో ఉంది. తక్షణం కట్టాలంటూ మహిళకు బ్యాంకు మేనేజర్ ఫోన్ చేశారు. మీకు డబ్బు ఎవరైతే పంపారో వారు ఆ డబ్బును రీక్లెయిమ్ చేసుకున్నారు కాబట్టి రూ.43 వేలు కట్టాలన్నారు. తాను కట్టలేనంటూ బ్యాంకు నుంచి వచ్చిన కొద్ది గంటల్లోనే రూ.43 వేలు కాదు రూ.4.5 లక్షలు కట్టాలని మళ్లీ బ్యాంకు నుంచి కాల్ వచ్చింది. దీంతో మహిళా హుటాహుటిన బ్యాంకు వెళ్లి ఆరా తీసింది. 'మీకు డబ్బు పంపిన వారు దానిని వెనక్కి పంపాలంటూ రీక్లెయిమ్ చేసుకున్నారు. దీంతో మీ బ్యాంకు ఖాతా రూ.4.5 లక్షలు మైనస్‌లోకి వెళ్లింది. ఈ డబ్బు చెల్లిస్తానని' అఫిడవిట్ ఇవ్వాలంటూ హుకుం జారీ చేశారు. అదేవిధంగా మీపై ఢిల్లీలోని ఓ సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదైందన్నారు. మహిళను మోసం చేసిన విధంగానే ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తిని కూడా ట్రాప్ చేశారు. ఆ వ్యక్తి నుంచి రూ.2.63 లక్షలను మహిళ అకౌంట్‌కు జమ చేయించారు. తాను మోసపోయానని గ్రహించిన అతగాడు.. తన నుంచి హైదరాబాద్‌లో ఉండే ఓ మహిళకు గుర్తు తెలియని వారు డబ్బు పంపేలా చేశారంటూ ఫిర్యాదు చేయడంతో అక్కడి పోలీసులు కేసు కూడా నమోదు చేసినట్లు సిటీ సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు.

**మోసగాళ్ల బుట్టలో పడొద్దు..**

ఇదో కొత్త రకం మోసం. గుర్తు తెలియని వ్యక్తుల మాటలతో బుట్టలో పడొద్దు. మీకు సంబంధం లేని వారు డబ్బు పంపి ఇన్వెస్ట్ చేయమన్నా, క్రిప్టోలో ట్రేడింగ్ చేయమని కోరినా అలా చేయొద్దు.



- కేవీఎం ప్రసాద్, సిటీ సైబర్ క్రైం ఏసీపీ

# వినువీధిలో విహరిస్తూ..

### కాచిగూడ నుంచి ఎంజీబీఎస్ మీదుగా జూపార్కు వరకు రోప్‌వే

- మొదట ఎంజీబీఎస్ నుంచి జూపార్కు వరకు ఏర్పాటు
- ప్యారడైజ్ నుంచి హుస్సేన్‌సాగర్ మీదుగా అసెంబ్లీ వరకు మరో మార్గం
- పీపీపీ పద్ధతిలో ఏర్పాటుకు సన్నాహాలు
- వివిధ విభాగాల అధికారుల బృందం అధ్యయనం
- ఒక్కో కారిడార్‌లో రూ.700 కోట్ల వరకు అంచనాలు



సాక్షి, సిటీబ్యూరో: ఆకాశమార్గంలో పయనించి నచ్చిన చోటుకు చేరుకుంటే ఎంత బాగుంటుంది. పర్యాటకప్రియులకు అలాంటి అద్భుతమైన అనుభూతి త్వరలోనే అందుబాటులోకి రానుంది. హిమాచల్‌ప్రదేశ్, ముంబై తరహాలో నగరంలో రోప్‌వేలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది.

- ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టు కోసం గతంలోనే ప్రణాళికలను రూపొందించినప్పటికీ వివిధ కారణాలతో జాప్యం జరిగింది. తాజాగా మరోసారి రోప్‌వేల ఏర్పాటులో కదలిక వచ్చింది. గతంలో రోప్‌వేల ఏర్పాటుకు వివిధ మార్గాల్లో సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసిన నిపుణులు.. చివరకు ప్రతి రోజు వందలాది మంది పర్యాటకులు సందర్శించే ట్యాంక్‌బండ్, జూపార్కులను ఎంపిక చేశారు. ప్రస్తుతం ఈ రెండు రూట్లలో రోప్‌వేల ఏర్పాటుపై అధికారులు కసరత్తు చేపట్టారు.
- తొలుత కాచిగూడ నుంచి మహాత్మాగాంధీ బస్ స్టేషన్ మీదుగా జూపార్కు వరకు నిర్మించనున్నారు. ఆ తర్వాత ప్యారడైజ్ నుంచి హుస్సేన్‌సాగర్‌పై విహరించి అసెంబ్లీ వరకు చేరుకొనేలా ఏర్పాటు చేస్తారు. ఈ మార్గంలో రెండు వైపులా రాకపోకలు సాగించవచ్చు. అంటే సందర్శకులు అసెంబ్లీ వైపు నుంచి కూడా హుస్సేన్‌సాగర్ విహారానికి వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

**నింగిలోంచి సాగర విహారం..**

- సందర్శకులు ఆకాశంలోంచి హుస్సేన్‌సాగర్ చుట్టూ విహరించేలా రోప్‌వేను ఏర్పాటు చేస్తారు. ప్యారడైజ్ నుంచి అసెంబ్లీ వరకు ఈ మార్గం కూడా 6.5 కిలమీటర్లకు పైగా ఉంటుందని అంచనా. దీని నిర్మాణానికి కూడా రూ.600 కోట్లకు పైగా ఖర్చయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జూపార్కు రూట్‌లో వచ్చే స్పందనను బట్టి ట్యాంక్‌బండ్ మార్గంలో ఏర్పాటు చేస్తారు. రెండు రూట్‌లలోనూ పీపీపీ మోడల్‌లోనే నిర్మించనున్నారు.
- 'రోప్‌వేల నిర్మాణం కోసం వివిధ మార్గాల్లో భవనాలు, మెట్రో, ఫ్లైఓవర్ల ఎత్తును బట్టి 6 నుంచి 80 మీటర్ల ఎత్తు వరకు పటిష్టమైన పిల్లర్లను నిర్మించి మూడు వరుసల్లో కేబుల్స్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ నిర్మాణం కోసం అవసరమయ్యే సాంకేతిక సామర్థ్యంపై సీరియస్‌గా దృష్టి సారించాం' అని ఒక అధికారి తెలిపారు. ఈ అధ్యయనం కోసం యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఉమ్టా), హెచ్ఎండీఏ, ఆర్‌వీఎన్ఎల్, టీఎస్ఆర్టీసీ తదితర విభాగాలకు చెందిన అధికారులతో ఒక కమిటీ పని చేస్తోంది.

**ఎంజీబీఎస్ నుంచి జూపార్కు వరకు..**

- ట్యాంక్‌బండ్ మార్గంలోనే మొదట రోప్‌వే ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ ప్రస్తుతానికి మాత్రం అధికారులు జూపార్కు మార్గంపై దృష్టి సారించారు. కాచిగూడ నుంచి ఎంజీబీఎస్ మీదుగా జూపార్కు వరకు సుమారు 8 కిలోమీటర్ల వరకు (రోడ్డు మార్గం కాదు) ఉంటుందని అంచనా. కాచిగూడ రైల్వేస్టేషన్ వెనుకవైపు నుంచి ఎంజీబీఎస్‌కు, అక్కడి నుంచి జూపార్కు వరకు ఎంపిక చేసిన రూట్‌లో రోప్‌వేను ఏర్పాటు చేస్తారు.
- ప్రభుత్వ,ప్రైవేట్ భాగస్వామ్యంలో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు సుమారు రూ.700 కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 25 శాతం చొప్పున నిధులు కేటాయిస్తే, మిగతా 50 శాతం నిధులను ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేస్తాయి. ఈ రోప్‌వే నిర్వహణ కూడా ప్రైవేట్ సంస్థల పరిధిలోనే ఉంటుంది.
- మొదట ఎంజీబీఎస్ నుంచి జూపార్కు వరకు ఏర్పాటు చేసి ఆ తర్వాత రెండోదశలో కాచిగూడ నుంచి ఎంజీబీఎస్ వరకు విస్తరిస్తారు. ప్రతి రోజు వేలాది మంది జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులు జూపార్కును సందర్శిస్తారు. వివిధ మార్గాల్లో జూపార్కుకు చేరుకోవడం ఎంతో కష్టంగా ఉంటుంది. ముఖ్యంగా వాహనాల రద్దీ దృష్ట్యా ప్రయాణం భారమవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైలు, బస్సు ప్రయాణికులకు అనుకూలంగా ఉండేలా ఎంజీబీఎస్, కాచిగూడను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.

## మైనర్ బాలిక కిడ్నాప్

- లైంగిక దాడికి దుండగుల యత్నం
- తప్పించుకున్న బాలిక

**హయత్‌నగర్:** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలికను అపహరించి లైంగిక దాడి యత్నం చేయగా..ఆ బాలిక దుండగుల నుంచి తప్పించుకుని పోలీసుల చెంతకు చేరిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ కథనం ప్రకారం... పెద్దఅంబర్‌పేట్‌లో నివసించే ఓ బాలిక(17) టెన్త్ వరకు చదివి ఇంటివద్దనే ఉంటోంది. మంగళవారం రాత్రి పది గంటల సమయంలో ఓ గుర్తు తెలియని యువకుడు బైకుపై వచ్చి బాత్రూంకు వెలుతున్న బాలికను పిలిచి అడ్రస్ తెలపమని ఫోన్ చూపించాడు. ఆమె ఫోన్ చూస్తుండగానే ఆ అడ్రస్‌కు తీసుకెళ్లమని కోరి బైకుపై ఎక్కించుకుని వెళ్లాడు. మధ్యలో మరో యువకుడు బైకుపై ఎక్కాడు. వారిద్దరు బాలికను బైకుపై ఔటర్ రింగురోడ్డు సమీపంలోని నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లారు. అక్కడ ఓ చిన్నరూంలోకి తీసుకెళ్లి లైంగికదాడికి ప్రయత్నించారు. భయాందోళనకు గురైన బాలిక వారి నుంచి తప్పించుకుని జాతీయ రహదారిపైకి చేరింది. రోడ్డుపై తచ్చాడుతున్న బాలికను గమనించిన ఓ హిజ్రా ఆమెను ప్రశ్నించగా..తన తల్లికి ఫోన్ చేయమని కోరింది. తల్లి స్పందించక పోవడంతో పక్కనే ఉన్న హోటల్ వద్దకు వెళ్ళి వారి సహాయంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అపస్మారక స్థితికి చేరిన బాలికను చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలిక తప్పించుకుని చెట్ల పొదల నుంచి రావడం వల్ల చిన్న చిన్న గాయాలయ్యాయని, ఆమెకు వైద్య పరీక్షలు చేయించామని లైంగికదాడి జరగలేదని డీసీపీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. నిందితులను పట్టుకునేందుకు 4 టీంలను ఏర్పాటు చేశామన్నారు. కాగా దుండగులు బాలికపై మత్తుమందు స్ప్రే చేశారని అనుమానిస్తున్నారు. ఇద్దరు నిందితులను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.



## నయనం... ప్రధానం

- దృష్టి నాణ్యతకే తొలి ప్రాధాన్యత
- 50 ప్లస్ వయసువారి అభిప్రాయం
- వెల్లడించిన సర్వే ఫలితాలు..

పెద్ద వయసు మీద పడుతున్న పరిస్థితుల్లో రకరకాల అనారోగ్యాలు చుట్టుముట్టే ప్రమాదం పొంచి ఉంటుంది. వాటన్నింటిలో తమకు కంటి చూపు సన్నగిల్లడమే పెద్ద సమస్యగా అత్యధికులు భావిస్తున్నారు. నేత్ర సంరక్షణ సేవలకు పేరొందిన అల్కాన్, గత మార్చి, ఏప్రిల్ నెలల్లో 10 దేశాలలో 50 ఏళ్లు పైబడిన వారిపై నిర్వహించిన 'అల్కాన్ ఐ ఆన్ క్యాటరాక్ట్' సర్వే ఫలితాలలో ఈ విషయం వెల్లడైంది. – సాక్షి, సిటీబ్యూరో

- వృద్ధాప్యంలో ఎదుర్కోబోయే వాటి పట్ల ఆందోళనలో జ్ఞాపకశక్తి చలనశీలత వంటివి ఉన్నా వాటికంటే దృష్టిలోపం తొలి స్థానంలో ఉందని సర్వే తేల్చింది. చాలా మంది (90శాతం) స్పష్టమైన దృష్టి కోసం కంటిశుక్లం శస్త్రచికిత్స వ్యయానికి కూడా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేసింది. సర్వే వెల్లడించిన మరికొన్ని విశేషాలు...
- కంటి అద్దాలు ధరించడం అనేది తమను పెద్ద వయసువారిగా మారుస్తుందని దాదాపు 54 శాతం మంది భావిస్తుండగా, వీరిలో 92 శాతం మంది అద్దాల నుంచి విముక్తి కలిగించే లెన్స్ కోసం డబ్బులు ఖర్చుకు సైతం సిద్ధంగా ఉన్నారు.
- కంటిశుక్లం శస్త్రచికిత్సకు సంబంధించిన సమాచారం గురించి కంటి సంరక్షణ నిపుణులను సంప్రదించే అవకాశం ఉందని 59శాతం మంది చెప్పారు. అయితే 39 శాతం కుటుంబ సభ్యుల్ని 37 శాతం మంది స్నేహితులను సంప్రదిస్తామని అంటున్నారు. అయితే 36 శాతం మంది ఆరోగ్య–నిర్దిష్ట వెబ్‌సైట్‌లను సెర్చ్ చేస్తామన్నారు
- దాదాపు 90 శాతం కంటే ఎక్కువ మంది కంటిశుక్లం శస్త్రచికిత్స తర్వాత చదవడం, ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించడం, డ్రైవింగ్ చేయడం, నడవడం క్రాస్‌వర్డ్ పజిల్‌లను పరిష్కరించడం వంటి కార్యకలాపాలు చేయగలుగుతున్నారు.
- శస్త్రచికిత్స తర్వాత వారి దృష్టి మెరుగుపడిందని 88 శాతం మంది చెప్పారు, అదే విధంగా 45 శాతం మంది తమ చూపు యుక్తవయస్కులతో సమానంగా ఉందన్నారు.

## బంజారాహిల్స్ పోలీసులకు కొత్వాల్ అభినందన



పోలీసులను అభినందిస్తున్న కమిషనర్ సీవీ ఆనంద్

**బంజారాహిల్స్:** ముగ్గురు బెగ్గర్లను దారుణంగా హత్య చేసిన సైకోపాత్ కిల్లర్‌కు జీవితఖైదు పడేందుకు ఎంతో కృషి చేసిన అధికారులను నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్ బుధవారం అభినందించారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ ఎన్.నరేందర్, ఎస్.సైదాబాబు, ఖలీల్‌బాషాతో పాటు కానిస్టేబుల్స్ హసీబ్ అహ్మద్, ఎస్.శివాజీ, ఖదీర్, గణేష్, సాయి ప్రసాద్, భాను చందర్, 4వ ఎంఎస్‌జే అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.శ్రీవాణి తదితరులను శాలువాలు, మెమొంటోలతో సత్కరించారు.



# పిల్లల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

– రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్ చౌహాన్ తదితరులు

**సాక్షి, సిటీబ్యూరో:** రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో తప్పిపోయిన పిల్లలను గుర్తించి వారి తల్లి తండ్రుల వద్దకు చేర్చడం, అనాథలకు పునరావాసం కల్పించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ తొమ్మిదో సమన్వయ సమావేశం నేరెడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ ఆఫీస్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీపీ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ.. తప్పిపోయిన చిన్నారుల వివరాలను సేకరించి వారి ఫోటోలు కలిగిన ఆల్బమ్‌ను రూపొందిస్తారని, ఆయా వివరాలతో ప్రత్యేక టీమ్‌లు కమిషనరేట్ పరిధిలో అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్టాండ్లను, జనసామర్థ్యం కలిగిన జంక్షన్లు, చౌరస్తాలు, నిర్మాణ స్థలాలు, హోటళ్లు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లను తనిఖీ చేస్తారని వివరించారు. వెట్టి చాకిరిలో ఉన్న బాలబాలికల విముక్తి కోసం కూడా ఈ ప్రత్యేక టీమ్‌లు పని చేస్తాయని చెప్పారు. పిల్లల అక్రమ రవాణా, బాల కార్మికులుగా పిల్లలను నియమించుకుని వారి చేత పని చేయించుకునే వారి మీద కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టడానికి ఒక ఎస్.ఐ, నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లు కలిగిన మఫ్టీలో ఉండే ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. తనిఖీల సందర్భంగా గుర్తించిన పిల్లల ఫొటోలతో కూడిన సమాచారాన్ని చైల్డ్ ట్రాక్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ సత్యనారాయణ, షీ టీమ్స్ ఏసీపీ వెంకట్ రెడ్డి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

**మానవ అక్రమ రవాణాదారులపై నిఘా...**

మానవ అక్రమ రవాణాదారులపై సైబరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. బాలికలు, మహిళలను అక్రమంగా రవాణా చేస్తూ, వారితో వ్యభిచారం చేయిస్తున్న నేరస్తులపై నిఘా పెట్టారు. సెక్స్ రాకెట్ నిర్వాహకులు, మధ్యవర్తులు, పాత నేరస్తుల రికార్డును ఏర్పాటు చేశారు. బీట్ పోలీసింగ్, లోకల్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌లో ఆయా వివరాలను ట్రాకింగ్ చేస్తుంటారు. నిఘాలో భాగంగా బుధవారం మేడ్చల్, మాదాపూర్, బాలానగర్, రాజేంద్రనగర్, శంషాబాద్ ఐదు జోన్లలో పోలీసు సిబ్బంది మానవ అక్రమ రవాణాదారులపై గస్తీ నిర్వహించారు. నిఘా వల్ల నేరాలు పునరావృతం కాకుండా నిరోధించవచ్చని సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు.

## టాస్క్‌ఫోర్స్ పోలీసులమంటూ బెదిరించి..

**ఫిలింనగర్:** తాము టాస్క్‌ఫోర్స్ పోలీసులమంటూ ముగ్గురు అగంతకులు ఓ యువకుడిని బెదిరించి బలవంతంగా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. టోలిచౌకి ఎస్‌ఏ కాలనీలో నివసించే ఖాషిఫ్ అహ్మద్‌చౌదరి బీటెక్ చదువుతున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి గుల్బర్గా వెళ్లి ఈ నెల 4వ తేదీన సాయంత్రం హకీంపేట దర్గా బృందావన కాలనీలోని హబీబ్ మంజిల్‌లో ఉండే సోదరుడి వద్దకు బైక్‌పై వెళ్లాడు. ఇంటి సమీపంలోకి వెళ్లగానే ముగ్గురు అగంతకులు టీఎస్ 13సీఎస్ 8600 నెంబర్ యాక్టివా బైక్‌పై వచ్చి అడ్డగించారు. తాము స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులమని, ఈ సమయంలో ఇక్కడ ఏం చేస్తున్నావంటూ బెదిరించారు. తన సోదరుడిని కలవడానికి వచ్చానని చెప్పగా డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బులు లేవని ఇయర్ బడ్స్ ఉన్నాయని వాటిని ఇచ్చాడు. అయితే డబ్బులు లేకపోతే కేసు రిజిస్టర్ చేసి బొక్కలో తోస్తామంటూ బెదిరించారు. బలవంతంగా ఫోన్ తీసుకొని రూ.3 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించుకొని అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నూజో పోలీసుల కోసం గాలిస్తున్నారు.

## సెప్టెంబర్‌లో ఎల్‌డీఎఫ్ ఇండియా ఎగ్జిబిషన్

**మాదాపూర్:** పశుసంపదలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ సి.సువర్ణ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో సెప్టెంబర్ 21వ తేదీ నుండి 23 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎల్‌డీఎఫ్ (లైవ్‌స్టాక్, డైరీ, ఫిషరీస్ ఎక్స్‌పో) ఇండియా ఎగ్జిబిషన్ వివరాలను ఆమె బుధవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పశు సంపద, పాడిపరిశ్రమ, మత్స్య సంపదకు సంబంధించి సాధించిన ప్రగతిని ఈ ప్రదర్శనలో వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భారతదేశం నుండి 100 మంది ఎగ్జిబిటర్లు పాల్గొంటారన్నారు.

## రూ.1.37 కోట్ల బంగారం స్వాధీనం

1.01 లక్షల విదేశీ సిగరెట్లు సైతం

**శంషాబాద్ రూరల్:** శంషాబాద్ విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు బుధవారం మూడు కేసుల్లో రూ.1.37 కోట్ల విలువైన 2.279 కేజీల బంగారం స్వాధీనం చేసుకున్నారు. మరోపక్క ముగ్గురు ప్యాసింజర్ల నుంచి 1.01 లక్షల విదేశీ సిగరెట్లు సీజ్ చేశారు. రస్ అల్ ఖైమా నుంచి హైదరాబాద్ వచ్చిన విమానం సీటు కింది భాగంలో స్మగ్లర్లు పేస్టు రూపంలో ఉన్న బంగారాన్ని దాచారు. ఈ విషయం గుర్తించిన అధికారులు దాన్ని స్వాధీనం చేసుకుని విశ్లేషించగా 1196 గ్రాముల పసిడిగా తేలింది. కువైట్ నుంచి దుబాయ్ మీదుగా శంషాబాద్ చేరుకున్న ఓ ప్రయాణికుడు 752 గ్రాముల బంగారు బిస్కెట్లను ముక్కలుగా తీసుకువచ్చి పట్టుబడ్డాడు. షార్జా నుంచి వచ్చిన మరో ప్రయాణికుడు 331 గ్రాముల బంగారాన్ని పేస్టు రూపంలో తీసుకురాగా కస్టమ్స్ అధికారులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కాంబోడియా నుంచి బ్యాంకాక్ మీదుగా నగరానికి చేరుకున్న ముగ్గురు ప్రయాణికులు తమ వెంట 1.01 లక్షల విదేశీ సిగరెట్లు తీసుకువచ్చి ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులకు పట్టుబడ్డారు. ఈ కేసుల్లో దర్యాప్తు కొనసాగుతోందని కస్టమ్స్ అధికారులు తెలిపారు.

## గ్లోబల్ సిటీ వైపు ప్రయాణం

– మునిసిపల్ శాఖ నివేదికలో జీహెచ్‌ఎంసీ అభివృద్ధి పనుల వివరాలు

**సాక్షి, సిటీబ్యూరో:** ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల ద్వారా 2050 నాటికి హైదరాబాద్ అత్యున్నత గ్లోబల్ నగరాల్లో ఒకటిగా ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. మునిసిపల్ పరిపాలన శాఖ 'పట్టణీకరణ ద్వారా అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లడం' పేరిట వెలువరించిన పది సంవత్సరాల (2014–2024) నివేదిక, 2023–24 కార్యాచరణ ప్రణాళిక) పుస్తకంలో ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాల ద్వారా హైదరాబాద్ గ్లోబల్ నగరాల సరసన చేరనుందని పేర్కొంది. వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తికి దేశంలోనే అతిపెద్ద సదుపాయాలు హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని తెలిపింది. మొత్తం రవాణాలో ప్రజా రవాణా 75 శాతం ఉండేలా ప్రణాళికలున్నాయని పేర్కొంది. నగరంలో ఎస్సార్‌డీపీ, సీఆర్‌ఎంపీ, మిస్సింగ్ లింక్ రోడ్ల కార్యక్రమాలు చేపట్టామని పేర్కొంది.

**కార్యాచరణ ప్రణాళిక ఇలా..**

- సదుపాయాలు మరింత మెరుగుపరిచే క్రమంలో ఎస్సార్‌డీపీలో కింద జీహెచ్‌ఎంసీకి చెందిన 10 పనులు, ఇతర శాఖలకు చెందిన 3 పనులు పూర్తి చేస్తామని పేర్కొంది. వీటి అంచనా వ్యయం రూ. 3515.33 కోట్లు, వీటిల్లో 9 ఫ్లై ఓవర్లు, 2 గ్రేడ్ సెపరేటర్లు, 2 ఆర్‌ఓబీలున్నాయి.
- హెచ్‌ఆర్‌డీసీఎల్ ద్వారా హైదరాబాద్ చుట్టూ ఉన్న పురపాలికల్లో 121 కి.మీ.ల మేర 50 మిస్సింగ్ లింక్‌రోడ్ల నిర్మాణం.
- రూ. 545 కోట్ల అంచనా వ్యయంతో మూసీపై 14 కొత్త వంతెనల నిర్మాణం.
- హైదరాబాద్ మెట్రో ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ లైన్ కోసం పనులు.
- ఎస్‌ఎన్‌డీపీ మొదటి దశ పనులన్నీ ఈ సంవత్సరంలో పూర్తి.

## ఎర్రగడ్డలో ట్రావెల్ బస్సు బీభత్సం

**అమీర్‌పేట:** ఎర్రగడ్డలో ధనుంజయ ట్రావెల్‌కు చెందిన బస్సు బీభత్సం సృష్టించింది. సిగ్నల్స్ వద్ద నిలుచున్న వాహనాల పైకి దూసుకెళ్లడంతో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. అందులోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 6.30 గంటల సమయంలో జరిగిన సంఘటన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం..ధనుంజయ ట్రావెల్‌కు చెందిన బస్సు మహారాష్ట్ర నుంచి ఉదయం నగరానికి చేరుకుంది. ఎర్రగడ్డ రైతు బజార్ ఎదురుగా రెడ్ సిగ్నల్స్ పడటంతో సెయింట్ థెరిసా చర్చి ముందు మూసాపేట వైపు నుంచి వచ్చిన వాహనాలు నిలబడి ఉన్నాయి. అదే సమయంలో వేగంగా వచ్చిన ట్రావెల్ బస్సు నిలిపిన వాహనాలను ఢీకొట్టింది. మొదట కియా సెల్టోస్ కారును ఢీకొట్టగా అది ముందున్న టాటా కారును ఢీకొంది. దీంతో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. ఈ సంఘటనతో జనం భయంతో పరుగులు తీశారు. కాగా ఈ ఘటనలో కార్లలో ఉన్నవారికి స్వల్పగాయాలయ్యాయి. ట్రావెల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ధనుంజయ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మహేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

# మహేశ్వరంలో మెడికల్ కళాశాల

– వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి సబితారెడ్డి

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** మహేశ్వరం నియోజకవర్గంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాల ఏర్పాటుతో 100 ఎంబీబీఎస్ సీట్లతో పాటు అనుబంధ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కూడా అందుబాటులోకి రానుంది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గత నెల 19న మహేశ్వరం నియోజకవర్గం తుమ్మలూరులో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ మెడికల్ కళాశాల మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ కళాశాల ఏర్పాటుతో కందుకూరు, మహేశ్వరం, ఆమనగల్లు, తలకొండపల్లి, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాల్లోని ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి.

**మీర్‌ఖాన్‌పేట వైపే మొగ్గు**

ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన మెడికల్ కళాశాలను ఏ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేయనున్నారనే అంశంపై ఇంకా స్పష్టత లేదు. అయితే కళాశాల ఏర్పాటుకు అవసరమైన భూమి, రవాణా సదుపాయం, విద్యుత్, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో పుష్కలంగా ఉన్నాయి. ఇప్పటికే ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం భారీగా భూములు సేకరించిన విషయం తెలిసిందే. యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల నుంచి 19,333 ఎకరాల భూమి సేకరించింది. ఇక్కడ వంద ఎకరాల భూమిని కొత్త మెడికల్ కళాశాల ఏర్పాటుకు కేటాయించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**సీఎం సార్.. థ్యాంక్స్**

మహేశ్వరం నియోజకవర్గానికి మెడికల్ కళాశాల మంజూరు చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ బుధవారం జీవో జారీ చేయడం హర్షణీయమని విద్యాశాఖ మంత్రి పి.సబితా రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

## బాబ్జీకి పీఆర్‌ఎస్‌ఐ సత్కారం

**లక్డీకాపూల్:** సీనియర్ పబ్లిక్ రిలేషన్స్ వృత్తి నిపుణుడు, 'పీఆర్ వాయిస్' పత్రిక ఎడిటర్ వై.బాబ్జీ పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్‌ఎస్‌ఐ) జాతీయ సెక్రటరీ జనరల్‌గా అందించిన సేవలకు గాను ఆ సంస్థ హైదరాబాద్ చాప్టర్ బుధవారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలోఘనంగా సత్కరించింది. జాతీయ స్థాయిలో బాబ్జీ చేసిన సేవలు వెలకట్టలేనివని హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఎస్.రాము కొనియాడారు. బాబ్జీ చేసిన కృషికి గౌరవసూచకంగా, హైదరాబాద్ చాప్టర్ ఆయనను జాతీయ కమిటీ సభ్యునిగా నామినేట్ చేస్తున్నట్లు ప్రకటించింది.

## సమగ్ర 'మురుగుశుద్ధి' ప్లాన్ అమలు

**సాక్షి, సిటీబ్యూరో:** దక్షిణాసియాలోనే వంద శాతం మురుగు శుద్ధి చేసే తొలి నగరంగా హైదరాబాద్ అవతరించనుంది. సమగ్ర మురుగునీటి మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా వంద శాతం మురుగు నీటిశుద్ధికి జలమండలి చర్యలు ఉపక్రమించిన విషయం విదితమే. బుధవారం మంత్రి కేటీఆర్ దశాబ్ది నివేదిక విడుదల చేశారు. అందులో జలమండలి మురుగునీటి ప్రాజెక్టులను వివరించారు. వంద శాతం మురుగు నీటి శుద్ధి లక్ష్యంగా 3 ప్యాకేజీల్లో రూ.3866.41 కోట్ల వ్యయంతో నూతన 31 ఎస్టీపీల నిర్మాణాలు చేపడుతోంది.

# శునకాల్లో 'టిక్ ఫీవర్'

- మనుషులకు వచ్చే డెంగీ మాదిరిగా లక్షణాలు
- రక్త కణాలు పడిపోవడం, అంతర్గతంగా తీవ్ర రక్తస్రావం
- వెటర్నరీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి క్యూ కడుతున్న శునకాల యజమానులు

**హిమాయత్‌నగర్:** మనుషులకు ప్రబలే 'డెంగీ' ఫీవర్ లాంటిదే శునకాల్లోనూ ప్రబలుతోంది. 'టిక్ ఫీవర్'గా పిలుస్తున్న ఈ వ్యాధి ఇప్పుడు నగరంలోని వందలాది శునకాలకు సోకింది. దీంతో వాటి యజమానులు నారాయణగూడలోని వెటర్నరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. ఇక ముందుస్తుగా గుర్తించి చికిత్సలు చేయడం వల్ల 95 శాతం శునకాలు రికవరీ అవగా కేవలం 5 శాతం మాత్రం మృత్యువాతకు గురైనట్లు వైద్యులు చెబుతున్నారు. 'టిక్ ఫీవర్'కు గురైన శునకాల్లో ఎక్కువగా లక్షణాలు కనిపించకపోవడం కూడా ప్రధానమైన సమస్యగా వైద్యులు ధ్రువీకరిస్తున్నారు.

**ఇవీ లక్షణాలు..**

'టిక్' అంటే గోమార్లు అని అర్థం. గోమార్ల బారిన పడి అనారోగ్యానికి గురైన శునకాలు సైతం అనేక కేసులు వస్తున్నాయి. గోమార్లు శునకాలను కుట్టడం కారణంగా వాటిలో ఉమ్మును శునకాల్లోకి విడుదల చేస్తున్నాయి. దీని కారణంగా వీటికి జ్వరం వ్యాపిస్తుంది. దీనినే 'టిక్ ఫీవర్'గా పిలుస్తున్నారు వెటర్నరీ వైద్యులు. ఈ 'టిక్ ఫీవర్'కు గురైన శునకాల్లో క్రమేణ రక్తకణాలు తగ్గిపోతుండటం, అంతర్గతంగా తీవ్ర రక్తస్రావం అవ్వడం, ముక్కులో నుంచి బ్లీడింగ్, నీరసం, తిండి సరిగా తినకపోవడం వంటివి మాత్రమే కనిపిస్తుంటాయి. ఈ విధంగా శునకాలు సమస్యలను ఎదుర్కొంటే వైద్యులను సంప్రదిస్తే వారు చికిత్స అందించి వాటికి ప్రాణం పోస్తారు.

**విదేశీ శునకాల్లోనే ఎక్కువ...**

ఈ 'టిక్ ఫీవర్' అనేది శునకాల్లో ఎక్కువగా ఎండలు తగ్గుముఖం పట్టి వర్షాలు ప్రారంభమయ్యే సమయం నుంచి ప్రారంభం అవుతాయి. ప్రధానంగా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఖరీదైన శునకాలు వీటికి గురౌవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. నారాయణగూడలోని సూపర్ స్పెషాలిటీ వెటర్నరీ ఆస్పత్రికి ప్రతిరోజూ 4–5 కేసులు వస్తున్నాయని, వీటిలో కొన్ని చికిత్స వల్ల బతుకుతుండగా మరికొన్ని మరణిస్తున్నట్లు వెటర్నరీ వైద్యులు వెల్లడిస్తున్నారు.

**రికవరీ ఎక్కువగానే ఉంది**



సహజంగా ఈ 'టిక్ ఫీవర్'కు గురైన పెట్స్‌ను గుర్తించడం కాస్త కష్టమే. ఎందుకంటే 'టిక్ ఫీవర్'కు గురైనట్లు వాటిలో పెద్దగా లక్షణాలు కనిపించవు. మావద్దకు వస్తున్న వాటిలో 90–95 శాతం రికవరీ అవుతుండగా.. 3–5 శాతం చనిపోతున్నాయి. మీ పెట్స్ నీరసంగా ఉన్నా, బ్లీడింగ్‌కు గురైనా తక్షణం వైద్యుల్ని సంప్రదించి చికిత్స అందించడం మంచిది.

– డాక్టర్ ప్రవీణ్, సూపరింటెండెంట్, వెటర్నరీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, నారాయణగూడ

## క్లుప్తంగా...

### సత్కారం



పొంగులేటిని సత్కరిస్తున్న విజయారెడ్డి

ఫిలింనగర్: ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని ఆయన కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ నియోజకవర్గం నేత పి.విజయారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. అధికార బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అక్రమాలను ఎండగడుతూ పొంగులేటి చేస్తున్న పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.

### రోశయ్య సేవలు చిరస్మరణీయం

లిబర్టీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, ఆర్థిక శాఖ మంత్రిగా దివంగత కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ అన్నారు. వివాదాలకు దూరంగా ఉంటూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేశారన్నారు. దివంగత రోశయ్య జయంతి పురస్కరించుకొని లిబర్టీ వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో ఆర్థిక మంత్రిగా పని చేసి గొప్ప పేరు పొందారని గుర్తు చేశారు. వైఎస్సార్ మరణానంతరం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేశారని గుర్తు చేశారు. అనంతరం తమిళనాడు గవర్నర్‌గా ఐదేళ్లపాటు ఆ రాష్ట్రానికి విశిష్ట సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో నేతలు వాజ్డేవరావు, దశరథ్, నాగిళ్ల నవీన్‌కుమార్, అరుణరెడ్డి, నంది, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

### స్ఫూర్తిప్రదాత అల్లూరి



వెంగళరావునగర్: మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు యువతకు ఆదర్శమని మధురానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోడె సాంబశివరావు అన్నారు. అల్లూరి జయంతి ఉత్సవాలను మధురానగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాటాడుతూ... అల్లూరి త్యాగనిరతికి నిదర్శనంగా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని కాలనీలో జరిగిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, విద్యార్థులకు స్కాలర్ షిప్స్‌ను పంపిణీ చేశారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కళ్యాణ చక్రవర్తి, కోశాధికారి ఉప్పలయ్య, మాజీ అధ్యక్షులు జీఎస్ఆర్‌కెవి ప్రసాద్, కాలనీనేతలు హరిబాబు, దామోదర్‌రావు, సుబ్బారావు, సోమయాజులు, నాగార్జునరెడ్డిల, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### వాహనాల దొంగలను పట్టించిన మహిళ అదృశ్యం కేసు

వెంగళరావునగర్: మహిళకు మాటమాయలు చెప్పి తీసుకుని పోయిన కేసు పలు మలుపులు తిరిగి వాహనాలు ఎత్తుకెళ్లే దుండగులను పట్టించింది. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బుధవారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత నెల 10న అమీర్‌పేట కూడలిలోని ఫుట్‌పాత్ వద్ద నివాసం ఉంటున్న ఓ మహిళకు భరత్, గణేష్ అనే ఇద్దరు మాయమాటలు చెప్పి తీసుకెళ్లారు. ఆమెతో పాటుగా రెండేళ్ల కుమారుడినీ తీసుకెళ్లారు. దీంతో తన భార్య కనిపించడం లేదని, భరత్, గణేష్ అనే ఇరువురిపై అనుమానం ఉందని ఆటో డ్రైవర్ అయిన ఆమె భర్త పరశురామ్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఈ కేసును ఛేదించే క్రమంలో చార్మినార్ తదితర ప్రాంతాల్లో తీవ్రంగా గాలించారు. ఎట్టకేలకు వారిని పట్టుకుని తమ శైలిలో విచారణ చేశారు. ఈ క్రమంలో నిందితులు ఇరువురు పోలీసులకు దొంగతనం కేసు బహిర్గతం చేశారు. తాము (టీవీఎస్ ఎక్స్‌ఎల్) ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తుంటామని, ఇప్పటి వరకు 21 బండ్లు దొంగిలించామని పోలీసుల విచారణలో అంగీకరించారు. దొంగిలించిన వాహనాలను తెలియని వారికి రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు విక్రయిస్తుంటామన్నారు. ఆయా ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

### నాట్కో పాఠశాల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

రహమత్‌నగర్(బోరబండ): నాట్కో ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బోరబండలోని నాట్కో పాఠశాలను సీపీఎం నాయకుడు శేషగిరి రావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాట్కో పాఠశాలలో టీచర్ల కొరత కారణంగా చదువులు ముందుకు సాగడం లేదన్నారు. ఇతర సదుపాయాలు సైతం లేవని ఆరోపించారు. వెంటనే వాటిని పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు పార్టీ స్థానిక నేతలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్‌తో బాలల రక్షణ

- ఈ నెల 1 ప్రారంభమైన కార్యక్రమం
- ప్రతి పోలీస్ స్టేషన్ పరిధి నుంచి సమన్వయ బృందాలు
- గుర్తించిన బాలలను తల్లిదండ్రులకు అప్పగింత

బడుల్లో విద్యనభ్యసించాల్సిన చిన్నారులు, పలకా బలపం పట్టి పాఠశాలకు వెళ్లాల్సిన వయసులో బాల కార్మికులుగా వెట్టి చాకిరీ చేస్తున్న దృశ్యాలు నిత్యం కనబడుతూనే ఉంటాయి. అయితే పాఠాలు చదవాల్సిన చిన్నారులు పనుల్లో కనిపించవద్దని ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నది. పోలీసులు, కార్మిక శాఖ, చైల్డ్‌లైన్ ప్రతినిధుల బృందంతో 2014 నుంచి ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.



ఆపరేషన్ ముస్కాన్ బృందం

బంజారాహిల్స్: వెస్ట్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మధురానగర్, బోరబండ, ఎస్ఆర్‌నగర్, పంజగుట్ట, మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్లతో పాటు సెంట్రల్ జోన్ పరిధిలోని సైఫాబాద్, ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆపరేషన్ ముస్కాన్ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి డివిజన్‌కు ఒక ఎస్ఐ ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. బాలల సంరక్షణ కమిటీ సభ్యులు కూడా ఈ బృందంలో ఉంటారు.

- ఇప్పటికే ఎంతో మంది చిన్నారులకు బాల కార్మికుల వ్యవస్థ నుంచి, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కలిగించిన పోలీసులు ఈ ఏడాది కూడా జూలై1 నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ ముస్కాన్-9 కార్యక్రమాన్ని చేపట్టింది.

#### బాల్యాన్ని ఆనందంగా ఉంచడమే లక్ష్యం...

- 18 ఏళ్లలోపు చిన్నారులతో వెట్టిచాకిరీ, బలవంతంగా భిక్షాటన చేయించడం, షాపులలో, హోటళ్లలో, పాన్ డబ్బాలలో పనిచేయించడం, వీధి బాలలు, తప్పిపోయిన పిల్లలను గుర్తించి వారి బాల్యాన్ని సురక్షితంగా ఉంచడమే ముస్కాన్ ముఖ్య ఉద్దేశం.
- ఇలా గుర్తించిన పిల్లలను వారి తల్లిదండ్రుల వద్దకు చేరుస్తారు. చిన్నారులను మళ్లీ పనికి పంపించకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నారు.
- పోలీసులు, కార్మిక శాఖ, చైల్డ్‌లైన్ శాఖ సమన్వయంతో ఏటా జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్, జనవరి 2 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్ నిర్వహిస్తున్నారు. బాల కార్మికులను గుర్తించడానికి ప్రతి డివిజన్‌లో ఎస్ఐతో పాటు ఆరుగురు సిబ్బందితో కూడిన బృందాలను నియమించారు.
- ఈ బృందాలు నిత్యం వివిధ ప్రాంతాలు, చౌరస్తాలు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పర్యటించి వెట్టి చాకిరీ, భిక్షాటన చేయిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయిస్తున్నారు.
- బాలలు పని చేస్తున్న హాట్‌స్పాట్స్‌ను గుర్తించి ఆ ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేపడతారు. ముఖ్యంగా వలస కూలీల పిల్లలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారు.
- పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వలస కూలీల పిల్లలపై దృష్టి పెట్టి ఆ మేరకు తనిఖీలు చేపడుతున్నారు. బాల్య వివాహాలు జరుగుతున్న ప్రాంతాలపై కూడా నిఘా ఉంచనున్నారు.

#### గతేడాది 74 మందికి విముక్తి...

- ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా గత సంవత్సరం వెస్ట్‌జోన్ పరిధిలోనే 74 మంది బాలలకు విముక్తి కలిగించారు. ఈ ఏడాది జనవరిలో చేపట్టిన ఆపరేషన్ స్మైల్‌లో కూడా 28 మంది చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.
- మరి కొంత మందిని హోంలకు తరలిస్తున్నారు. సమాజంలో బాల కార్మికులను గుర్తిస్తే 1098 నెంబర్‌కు ఫోన్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. సమీపంలోని పోలీస్ స్టేషన్లలో కూడా సమాచారం ఇవ్వొచ్చని తెలిపారు.
- పౌరులు కూడా ఇదొక బాధ్యతగా స్వీకరించాలని పోలీసులు పేర్కొంటున్నారు. తమ చుట్టు పక్కల ప్రాంతాల్లో బాల కార్మికులతో పని చేయించుకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వడం ద్వారా అక్కడ దాడులు చేసి వారికి విముక్తి కలిగిస్తామని వారు స్పష్టం చేస్తున్నారు.

## దళారులను నమ్మొద్దు.. డబ్బివ్వద్దు:ఎమ్మెల్యే దానం



పార్టీలో చేరిన ఇందిరానగర్ మహిళలతో ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులు కావాలని.. ఆయా పథకాల్లో లబ్ధిపొందాలనే ఆతృతతో బ్రోకర్లను నమ్మి మోసపోవద్దని, ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని ఎవరైనా డబ్బులు అడిగితే తనకు ఫిర్యాదు చేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన మహిళలు సీనియర్ నేత దీపాదేవి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం దానం మాట్లాడుతూ... మహిళల కోసం ఈ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. ప్రతి మహిళ బీఆర్ఎస్‌కు అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల సంక్షేమం కోసమే పనిచేస్తున్నారని వారిపైనే ఎన్నో ఆశలు పెట్టుకున్నారని ఈ ఎన్నికల్లో బంపర్ మెజార్టీ రావాలంటే ప్రతి మహిళా తప్పనిసరిగా బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. రోజురోజుకూ పార్టీలో చేరికలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు, దుర్గా భవానీ, సుజాత, హర్షా జబీన్, జ్యోతి, శివానీ, స్వప్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేసి ఆదర్శంగా నిలుపుతున్నట్లు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్ వద్ద రూ. 49 లక్షల వ్యయంతో నాలా స్లాబ్ పనులు, శాస్త్రీనగర్‌లో రూ. 16.5 లక్షలతో, శంకర్‌లాల్‌నగర్‌లో రూ.15 లక్షలతో కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులు, నందన్‌నగర్‌లో 35లక్షలతో సీసీ రోడ్డు పనులను శంకుస్థాపన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షాహీన్‌బేగం, మాజీ కార్పొరేటర్ షరీఫ్, డివిజన్ ప్రెసిడెంట్ సంజీవ, డీఈ రామచంద్రరాజు, గంట మల్లేష్, శాస్త్రీనగర్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు, వీరస్వామి, విష్ణువర్ధన్, సత్యనారాయణ, వెంకటేష్, రామకృష్ణ, సర్వయ్య, ప్రకాష్, కళావతి, స్వర్ణలత, బాలసూర్య, మంగ, గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## ఎమ్మెల్యే దానంకు సమస్యల ఏకరువు

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ డివిజన్‌లో పలు పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన కోసం విచ్చేసిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను స్థానికులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. ప్రధానంగా తాగునీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మంచినీటి, సివరేజీ పైప్‌లైన్ నిర్మాణాల పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే దత్తానగర్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రజలు 'సార్ ఇక్కడ కొత్త పైప్‌లైన్ వేయడం కారణంగా బస్తీల్లో ఉండే తమకు మంచినీరు రాదు' అని పిర్యాదు చేశారు. కొన్ని నెలలుగా 20 నిమిషాలు మాత్రమే నీరు వస్తోందని... ఈ విషయాన్ని ఎన్నో పర్యాయాలు నారాయణగూడ జలమండలి మేనేజర్ మహేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశామన్నారు. అపార్ట్‌మెంట్‌వాసులకు ప్రయోజనం చేకూర్చేందుకే ఈ పైప్‌లైన్ వేయడం తప్ప తమకేమీ ప్రయోజనం లేదన్నారు. ఈ విషయంపై మేనేజర్ మహేందర్‌రెడ్డిని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రశ్నలకు మహేందర్‌రెడ్డి తెల్లమోహం వేయడంతో ఒక్కసారిగా అందరూ మహేందర్‌రెడ్డిపై విరుచుకుపడ్డారు. ఈ ప్రాంతంలో ఉన్న 4 ఇంచెల పైప్‌లైన్ స్థానంలో 6 ఇంచెల పైప్‌లైన్‌ను నిర్మిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ హామీ ఇచ్చారు.

## బెయిల్ ఇప్పించడంలో జాప్యం చేశావంటూ బెదిరిస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్: తనకు బెయిల్ ఇప్పించడంలో ఆలస్యం చేశావంటూ వ్యాపారిని వేధింపులకు గురిచేస్తుండటంతో పాటు రూ. 10 లక్షలు ఇవ్వకపోతే అంతుచూస్తానంటే బెదిరిస్తున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్ నెం 4లో నివసించే సందీప్ అమర్ చంద్ బోహ్రాకు 2021లో కొండపాట భిక్షపతి అలియాస్ ర ఘు అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. ఓ హత్య కేసులో అరెస్టయి జైలుకు వెళ్లిన భిక్షపతి తనకు బెయిల్ ఇప్పించాలని సందీప్ అమర్‌చంద్‌ను కోరాడు. దీనికి అంగీకరించిన సందీప్ తనకు తెలిసిన హైకోర్టు న్యాయవాదిని మాట్లాడి ఏడాది తర్వాత బెయిల్ ఇప్పించాడు. అయితే తనను ఏడాది కాలంగా జైల్లోనే ఉంచడంతో తీవ్రమైన మనో వేదనకు గురయ్యానని, దీనికి కారణం బెయిల్ ఇప్పించడంలో చేసిన జాప్యమే అంటూ ఇటీవల భిక్షపతి పలుమార్లు సందీప్‌వద్దకు వచ్చి బెదిరింపులకు దిగడంతో పాటు రూ. 10 లక్షలు ఇవ్వకుంటే అంతుచూస్తానంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. దీంతో బుధవారం సందీప్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఇనుపరాడ్‌తో కస్టమర్ తల పగలగొట్టిన సేల్స్‌మెన్

ఫిలింనగర్: కస్టమర్‌ను అసభ్య పదజాలంతో దూషిస్తూ దురుసుగా ప్రవర్తిస్తున్న సేల్స్‌మెన్‌ను ఇదేమి పద్ధతని ప్రశ్నించినందుకు ఇనుపరాడ్‌తో తలపగలగొట్టిన సేల్స్ మెన్ మీద ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ... అత్తాపూర్‌లో నివసించే బిలాల్ ఖాన్, సులేమాన్‌ఖాన్ ఇద్దరూ మంగళవారం సాయంత్రం జానకీనగర్ కాలనీలో ఉన్న పోడియం మాల్‌కు దుస్తుల కొనుగోలు కోసం వెళ్లారు. ఓ కస్టమర్‌ను సేల్స్‌మెన్ తిడుతుండడంతో ఆలా మాట్లాడడం పద్ధతి కాదంటూ సులేమాన్, బిలాల్‌లుహితవు పలికారు. ఆగ్రహించిన సేల్స్‌మెన్ సులేమాన్ తలమీద రాడ్‌తో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు ఐపీసీ 324 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### దాడి చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

బంజారాహిల్స్: ఆటో అద్దెకు తీసుకోవడమే కాకుండా ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడి తననే బెదిరిస్తూ చితకబాదిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ... ఆసిఫ్‌నగర్‌లో నివసించే మహ్మద్ అబ్బాస్(23) ఫర్నీచర్ షాప్ నిర్వహిస్తుంటాడు. తనకున్న ఆటోను సేహితుడు హకీంపేటకు చెందిన మహ్మద్ ఇర్ఫాన్‌ఖాన్‌కు అద్దెకు ఇచ్చారు. ఇటీవల ఈ ఆటోను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. తాను ఆటో గురించి ఎన్నిమార్లు అడిగినా ఇర్ఫాన్ మాటమారుస్తూ వచ్చాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో తనను షేక్‌పేట నాలా వద్దకు పిలిపించారని అప్పటికే ఆటోలో ముగ్గురు వ్యక్తులు ఉన్నారని వారి మధ్యలో తనను బలవంతంగా ఎక్కించి బీరు తాగుతూ ద్వారకానగర్ వరకు తీసుకెళ్లారని తెల్లవారుజాము వరకు తనను తిప్పుతూ తీవ్రంగా కొట్టారని అబ్బాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాళ్లతో తన్నడంతో తన చెయ్యి విరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కడుపులో కూడా పిడిగుద్దులతో బాదారని తీవ్ర గాయాలపాలైన తాను ఆస్పత్రిలో చికిత్స కూడా చేయించుకున్నానన్నారు. తనపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఇర్ఫాన్‌తో పాటు మరో ముగ్గురిపై ఐపీసీ సెక్షన్ 324 కింద కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

### అర్ధరాత్రి దాటినా వ్యాపారం చేస్తున్న వ్యక్తికి జైలు శిక్ష



అబ్దుల్ మాజిద్

బంజారాహిల్స్: పోలీసు ఆదేశాలను బేఖాతరుచేస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తూ గడువుముగిసిన తర్వాత కూడా అర్ధరాత్రి దాకా హోటల్‌తో పాటు పాన్ డబ్బాను నిర్వహిస్తున్న వ్యాపారికి అయిదు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.

జూబ్లీహిల్స్ చౌరస్తాలోని పెట్రోల్ బంక్ వెనుకాల అబ్దుల్ మాజిద్(26) కొంతకాలంగా జూబ్లీ కాఫీ షాప్ పేరుతో హోటల్‌తో పాటు పాన్ డబ్బా నిర్వహిస్తున్నాడు. అయితే రాత్రి ఒంటి గంటకు హోటల్, పాన్‌డబ్బా బంద్ చేయాల్సి ఉండగా అర్ధరాత్రి 2 గంటలు దాటినా తెరిచే ఉంచుతుండగా సెక్టార్ ఎస్ఐ రాకేష్ తనిఖీలు నిర్వహించి మంగళవారం అర్ధరాత్రి 2 గంటల దాకా తెరిచి ఉంచడంతో పెట్టి కేసు నమోదు చేశారు. బుధవారం మాజిద్‌ను నాంపల్లిలోని ఏడవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు ఎదుట హాజరుపరచగా నిందితుడికి అయిదు రోజుల జైలు విధిస్తూ తీర్పునిచ్చారు.

## విద్యార్థి నాయకులుగా సమాజహితానికి కృషి చేయాలి

రిటైర్డ్ ఎయిర్ వైస్ మార్షల్ ఆంజనేయులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమం వ్యవస్థాపక దినోత్సవ వేడుకలతో పాటు విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఎయిర్ వైస్ మార్షల్ వి.ఆంజనేయులు మాట్లాడుతూ... విద్యార్థి నాయకులుగా తమ బృందాన్ని చక్కని మార్గంలో తీసుకెళ్లడంతోపాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థి నాయకులుగా మిగతా విద్యార్థులను క్రమశిక్షణతో నడిపిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తమ పిల్లలు పాఠశాలల్లో నాయకులుగా ఎదిగారంటే తల్లిదండ్రులు ఎంతగానో ఆనందిస్తారని వారి ఆశయాలను, ఆశలను మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నృత్యాలు, పాటలు ఆహుతులను విశేషంగా కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఎస్.గోపాలకృష్ణన్, అకడమిక్ డైరెక్టర్ సి.రమాదేవి, ప్రిన్సిపాల్ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు. స్కూల్‌లో మొత్తం ఆరు హౌస్‌లుగా విభజించగా 56 మంది విద్యార్థులు ఆయా హౌస్‌లకు ప్రమాణ స్వీకారంచేశారు. విద్యాలయ ప్రిఫెక్ట్(కెప్టెన్) బాయ్‌గా యుగ్ బోర్హా, విద్యాలయ ప్రిఫెక్ట్ గర్ల్‌గా ప్రతీక బాధ్యతలు స్వీకరించారు.




ప్రమాణ స్వీకారం చేసిన విద్యార్థి నాయకులు

## రాజ్‌బంజారాలైన్‌లో కార్పొరేటర్ పర్యటన



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ వెంకటేశ్వరనగర్ రాజ్‌బంజారా లైన్‌లో బుధవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జలమండలి తట్టికాన సెక్షన్ మేనేజర్ రాంబాబు, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పర్యటించారు. ఇక్కడ సీవరేజి పైప్‌లైన్ నూతనంగా వేస్తున్న సందర్భంగా ఈ ప్రాంతంలో పర్యటించి తగిన సూచనలు జారీచేశారు. సాధ్యమైనంత త్వరగా ఈ పనులు పూర్తిచేస్తే వానాకాలంలో సమస్యలు పరిష్కరించవచ్చునని అన్నారు. తరచూ కలుషిత మంచినీటి సరఫరా జరుగుతున్నదని స్థానికుల ఫిర్యాదు చేశారు. ఆయా సమస్యపై దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని ఆమె సూచించారు.

## ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడుతున్న బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. బుధవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో బంజారాహిల్స్ రోడ్ నెం. 10, 12, లోటస్ పాండ్‌లలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న 18 మంది వ్యాపారుల వస్తువులను సీజ్‌చేసి కేసులు నమోదు చేశారు. పాదచారులకు అడ్డంకులు సృష్టించడంతో పాటు రోడ్లపై అక్రమ పార్కింగ్‌లు పెరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## హాయ్ ఎమ్మెల్యే అంకుల్...



'హాయ్ ఎమ్మెల్యే అంకుల్' అంటూ చిన్నారులు ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పలకరించారు. వారి తియ్యని పలకరింపునకు ముగ్ధుడైన ఎమ్మెల్యే దానం దగ్గరకు వెళ్లి మరీ వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని దత్తానగర్ వద్ద పైప్‌లైన్ పనుల శంకుస్థాపన కోసం విచ్చేసిన ఎమ్మెల్యే దానంను అక్కడే ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పలకరించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ సమీపంలో ఉన్నారని తెలుసుకున్న ఆ విద్యార్థులు ఆయన కోసం గేటు వద్ద వేచి చూశారు. ఆయన కార్యకర్తలు, అధికారులతో కలసి వస్తున్న సమయంలో 'హాయ్ ఎమ్మెల్యే అంకుల్, హౌ ఆర్ యూ' అంటూ చేతులు చాపారు. వారి ఆత్మీయ పలకరింపునకు దగ్గరకు వెళ్లి అందరికీ షేక్ హ్యాండ్ ఇచ్చి అక్కున చేర్చుకున్నారు. మంచిగా చదువుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని దానం ఆకాంక్షించారు. – హిమాయత్‌నగర్

## పేదల ముంగిట్లో ప్రభుత్వ వైద్య సేవలు

మంత్రి శ్రీనివాస్‌యాదవ్



రహమత్‌నగర్ (బోరబండ): పేదల ముంగిట్లో వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశామని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. ప్రైవేటు ఆస్పత్రుల కంటే మెరుగైన వైద్య సేవలు బస్తీ దవాఖానాల్లో అందుబాటులో ఉంటున్నాయని ఆయన కొనియాడారు. బోరబండ డివిజన్ దేవయ్య బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను బుధవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ... బస్తీ దవాఖానాల్లో వైద్య సేవలు, మందులు, రోగ నిర్ధారణ పరీక్షలు అందించడం వల్ల పేదలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్ట పోవాల్సిన అవసరం లేదన్నారు. నేడు నగరంలో ప్రతి చోటా బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశామన్నారు. రోగులకు అత్యవసమైతే బస్తీ దవాఖానా నుంచే పెద్ద ఆస్పత్రులైన గాంధీ, ఉస్మానియా, నిమ్స్‌లకు రెఫర్ చేయనున్నట్లు తెలిపారు. ఇలా రెఫర్ చేసిన కేసులకు ఆయా ఆస్పత్రుల్లో సత్వర చికిత్స అందిస్తారని మంత్రి స్పష్టం చేశారు. డీఎంహెచ్ఓ వెంకటేశ్, ఎపీహెచ్ఓం డాక్టర్ అనురాధ, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సిరాజ్, కో ఆర్డినేటర్ విజయసింహ, విజయ్‌కుమార్, షేక్ షరీఫ్, సర్దార్, ధర్మ, బాబానాయక్, యూసుఫ్, బాబురాం, ఆరుద్ర తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాల తొలగింపు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లో అక్రమంగా నెలకొల్పిన వ్యాపార కేంద్రాలను బుధవారం జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ ఆధ్వర్యంలో కూల్చివేయించారు. వెంకటేశ్వకాలనీలోని నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించిన నేపథ్యంలో అక్కడ ఉన్న వ్యాపార సముదాయాలను తొలగించాలనే ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ , సెక్షన్ అధికారి తమ సిబ్బందితో కలిసి వెంకటేశ్వ కాలనీ చేరుకుని జేసీబీతో వ్యాపార కేంద్రాలను తొలగించారు. తమకు కనీసం సమాచారం ఇవ్వకుండా వ్యాపార సముదాయాలు ఎలా తొలగిస్తారంటూ వ్యాపారులు ఏసీపీ కారును అడ్డుకుని వాగ్వాదానికి దిగారు.

### జీఎస్టీ అధికారులపై దాడి.. కిడ్నాప్
## టీడీపీ నేతల అరెస్టు

- హైదరాబాద్‌లో స్క్రాప్ దుకాణం నడిపిస్తున్న నిందితులు
- జీఎస్టీ చెల్లించకపోవడంతో సీజ్ చేసిన జీఎస్టీ అధికారులు
- పంచనామా చేస్తుండగా దాడి.. కిడ్నాప్
- సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వెంటనే పట్టుకున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ చైతన్యపురి (హైదరాబాద్): జీఎస్టీ అధికారులను కిడ్నాప్ చేసిన కేసులో గుంటూరు టీడీపీ నేతలు, వారి కుటుంబసభ్యులను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరు నగర టీడీపీ నేత సయ్యద్ ముజీబ్, ఆయన కుటుంబ సభ్యులు సయ్యద్ ఫిరోజ్, సయ్యద్ ఇంతియాజ్‌లకు హైదరాబాద్ సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డాక్టర్స్ కాలనీ సాయికృష్ణ నగర్‌లో గ్రేడ్ వన్ స్క్రాప్ దుకాణం ఉంది. ప్రస్తుతం వీరు గుంటూరులోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. జీఎస్టీ చెల్లించకపోవటంతో మంగళవారం జీఎస్టీ, ఇంటెలిజెన్స్ అధికారులు తనిఖీల అనంతరం దుకాణాన్ని సీజ్ చేశారు. బుధవారం పంచనామా చేసేందుకు సూపరింటెండెంట్ ఆనంద్, ఇన్‌స్పెక్టర్ మనీశ్‌లు దుకాణానికి వచ్చారు. పంచనామా చేస్తుండగా ముజీబ్, ఫిరోజ్, ఇంతియాజ్, వారి కారు డ్రైవర్ షేక్ ముషీర్ దాడి చేశారు. గుంటూరు నుంచి తాము వెళ్లిన కారులోకి బలవంతంగా అధికారుల్ని ఎక్కించి కిడ్నాప్ చేశారు. క్షణాల వ్యవధిలో అక్కడి నుంచి పరారయ్యారు. జీఎస్టీ అధికారుల కారు డ్రైవర్ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారుల సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా మలక్‌పేట్‌లో అధికారులు వెళ్తున్న కారును పోలీసులు గుర్తించారు. రాజీవ్‌చౌక్ వద్ద కారును పట్టుకొని అధికారులను క్షేమంగా వారి నుంచి విడిపించారు. కిడ్నాప్‌నకు పాల్పడిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ముజీబ్ ప్రస్తుతం గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నారు. ఆ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. లోకేశ్ పాదయాత్రలో కూడా పాల్గొన్నారు.

**కుటుంబసభ్యులంతా నేరచరితులే...**

గుంటూరుకు చెందిన ముజీబ్ కుటుంబ సభ్యులు తొలినుంచి నేరచరిత్ర కలిగి ఉన్నారు. గుంటూరు ఆర్టీసీ కాలనీలో ఒక భూమిని ఆక్రమించిన కేసులో ముజీబ్ సోదరుడు ఫిరోజ్, ఇంతియాజ్, బషీర్‌లపై రౌడీషీట్లున్నాయి. ఆటోనగర్‌లో సైతం గతంలో కత్తులు తీసుకుని ఆ ప్రాంతమంతా హల్‌చల్ సృష్టించిన విషయంలో కాకాని పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతోపాటు కొంతమందిపై దాడిచేసిన కేసులున్నాయి. తాజాగా జీఎస్టీ అధికారులపై దాడి చేసి కిడ్నాప్ చేయడం టీడీపీలో సైతం చర్చనీయాంశమయ్యింది. రౌడీషీటర్ అయిన ఫిరోజ్ టీడీపీ నగర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

# త్వరితగతిన పోలవరం

### పూర్తయ్యేలా చూడాలని ప్రధాని మోదీకి సీఎం జగన్ వినతి

- రూ.55,548.87 కోట్లకు ఆమోదించండి
- తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు..
- వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్‌కు గనుల కేటాయింపు..
- నూతన వైద్య కళాశాలలకు సహకారం
- రాష్ట్రాభివృద్ధికి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని వినతి
- హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌తోనూ సమావేశం


కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి విభజన హామీలు సహా అపరిష్కృతంగా ఉన్న అంశాలపై దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు, జాతీయ ఆహార భద్రత చట్టం అమల్లో హేతుబద్ధత, విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు, నూతన వైద్య కళాశాలలకు ఆర్థిక సాయం తదితర అంశాలపై ప్రధానితో సుమారు గంటా ఇరవై నిమిషాలపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని విన్నవించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక హోదా ఎంతో దోహద పడుతుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలపాలని, సుదీర్ఘ కాలంగా ఇది పెండింగ్‌లో ఉందని ప్రధాని నరేంద్రమోదీకి గుర్తు చేశారు. ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడానికి తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు అవసరం అవుతుందని, ఇది కేంద్ర జల శక్తి శాఖ పరిశీలనలో ఉందని వివరించారు. తొలి దశ నిర్మాణానికి, కేంద్ర ఆర్థిక శాఖ ఇప్పటికే రూ.1,2911.15 కోట్ల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, అయితే తొలి దశలో భాగంగా మరో 36 గ్రామాల్లోని నిర్వాసితులకు సహాయ, పునరావాసం ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఇది ఇస్తేనే తొలి దశ పూర్తవుతుందని వివరించారు. మొత్తంగా పోలవరం తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు ఇచ్చేలా జల శక్తి శాఖకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన తన సొంత నిధులు రూ.1,310.15 కోట్లను వెంటనే రీయింబర్స్ చేయాలని, ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి ఆయా అంశాలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా ప్రధాని దృష్టికి సీఎం తీసుకెళ్లిన అంశాల వివరాలు ఇలా ఉన్నాయి.

**సుదీర్ఘ కాలంగా బకాయిలు**

- 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేసిన విద్యుత్తుకు సంబంధించి ఏపీకి రావాల్సిన రూ.7,230.14 కోట్ల బకాయిలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. ఏపీ జెన్‌కో ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా అవి త్వరగా వచ్చేలా చూడాలి.
- జాతీయ ఆహార భద్రతా చట్టం అమల్లో హేతుబద్ధత లోపించడంతో ఏపీ కన్నా ఆర్థికంగా ముందు వరుసలో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు అధిక శాతం కవరేజీ ఉంది. ఈ పథకం అమలుకు ఎంచుకున్న ప్రమాణాల్లో హేతుబద్ధత లేదని నీతి ఆయోగ్ కూడా నిర్ధారించింది.
- హేతుబద్ధత లేనందున రాష్ట్రంలో 56 లక్షల కుటుంబాలకు కేంద్రం రేషన్ దక్కడం లేదు. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా రూ.5,527 కోట్ల భారం పడుతోంది. ప్రతినెలా వినియోగించకుండా దాదాపు లక్ష టన్నుల బియ్యం కేంద్రం వద్ద ఉంటున్నాయి. ఇందులో 77 వేల టన్నులు రాష్ట్రానికి ఇస్తే సరిపోతుంది. దీనిపై మీరు (ప్రధాని) సత్వరమే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.
- ఏపీ పౌర సరఫరాల శాఖకు దీర్ఘకాలంగా (2012–13 నుంచి 2017–18 వరకు) పెండింగులో ఉన్న సబ్సిడీ బకాయిలు రూ.1,702.90 కోట్లను మంజూరు చేయాలి.

**విభజన హామీలు నెరవేర్చండి**

- రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రత్యేక హోదా సహా పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలి. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక హోదా దోహద పడటం ద్వారా రాష్ట్రం స్వయం సమృద్ధి దిశగా ముందుకు అడుగులు వేస్తుంది. అందువల్ల ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలి.
- వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర విభజన సందర్భంలో కేంద్రం హామీ ఇచ్చింది. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో జీవనోపాధి మెరుగుపడడానికి, జీవన ప్రమాణాలు పెంచడానికి ఈ ప్రాజెక్టు చాలా అవసరం. స్టీల్ ప్లాంట్‌కు అత్యంత అవసరమైన ముడి ఖనిజం కోసం మూడు గనులను ఏపీఎండీసీకి కేటాయించేలా కేంద్ర గనుల శాఖకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నాం.
- రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేశాం. ప్రతి జిల్లాకు కనీసంగా 18 లక్షల జనాభా ఉంది. ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు గతంలో ఉన్న 11 మెడికల్ కాలేజీలకు తోడు అదనంగా మరో 17 కళాశాలల నిర్మాణాలు చేపట్టాం. వీటికి తగిన ఆర్థిక సహాయం చేయాలి.
- సీఎం వైఎస్ జగన్.. ప్రధానితో భేటీకి ముందు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సుమారు 45 నిమిషాలపాటు, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో పలు అంశాలపై చర్చించి, రాష్ట్రానికి సహకరించాలని కోరారు. కాగా, ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో సీఎంకు వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, రెడ్డెప్ప, ఆర్.కృష్ణయ్య, తలారి రంగయ్య, చింతా అనూరాధ తదితరులు ఘన స్వాగతం పలికారు. బుధవారం రాత్రి పర్యటన ముగించుకుని తిరిగి తాడేపల్లికి బయల్దేరారు.

# నిరుపేదలకు భూమి

### పదేళ్ల తర్వాత ఏపీలో పంపిణీకి సన్నాహాలు

సాక్షి, అమరావతి: సుదీర్ఘకాలం తర్వాత ఏపీలో నిరుపేదలకు వైఎస్ జగన్ ప్రభుత్వం వ్యవసాయ భూములు పంపిణీ చేయనుంది. 23 జిల్లాల్లో 54 వేల ఎకరాలను అర్హులైన పేదలకు పంచేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లో అర్హులైన సుమారు 47 వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఆయా జిల్లాల అసైన్‌మెంట్ కమిటీల ఆమోదం కూడా దాదాపు పూర్తయింది. భూమి లభ్యతను బట్టి ఒక్కో లబ్ధిదారునికి ఒకటి నుంచి ఒకటిన్నర ఎకరం వరకు భూమి ఇవ్వనున్నారు. గ్రామాల్లో నిరుపేదలకు వ్యవసాయ భూములు ఇవ్వాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ఏడాది కిందటే కసరత్తు మొదలుపెట్టారు. అన్ని జిల్లాల్లో పేదలకు ఇవ్వడానికి అందుబాటులో ఉన్న భూమి, అర్హులైన లబ్ధిదారుల వివరాలతో నివేదికలు ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్ల పరిశీలన తర్వాత 23 జిల్లాల్లోనే భూమి అందుబాటులో ఉన్నట్లు తేలింది. వైఎస్సార్, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఆశాజనకంగా భూమి అందుబాటులో ఉండగా, మరో 8 జిల్లాల్లో వెయ్యి నుంచి 4 వేల ఎకరాల లోపు భూమి లభ్యత ఉన్నట్లు నిర్ధారణ అయింది. మరో 9 జిల్లాల్లో వెయ్యి నుంచి 2 వేల ఎకరాల భూమి ఉండగా, 4 జిల్లాల్లో వెయ్యి ఎకరాల లోపు భూమి అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్లు నివేదికలు ఇచ్చారు. విశాఖ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో భూమి అందుబాటులో లేదు. త్వరలో మంత్రివర్గం భూ పంపిణీకి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో చివరిసారిగా 2013లో భూ పంపిణీ జరిగింది.

### సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా
## జస్టిస్ భూయాన్, జస్టిస్ ఎస్‌వీ భట్టి

▶ మొదటి పేజీ తరువాయి

సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టులో మూడు న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయాల్సి ఉండడంతో కొలీజియం ఇటీవల సమావేశమైంది. కేరళ సీజే ఎస్.వెంకటనారాయణ భట్టి, తెలంగాణ సీజే జస్టిస్ ఉజ్జల్ భుయాన్ పేర్లను కొలీజియం ఏకగ్రీవంగా సిఫార్సు చేసినట్లు సుప్రీంకోర్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తులుగా సీనియారిటీ, మెరిట్, పనితీరు వంటి అంశాలతోపాటు హైకోర్టుల ప్రాతినిధ్యం, అట్టడుగు వర్గాలు, సమాజంలో వెనకబడిన వర్గాలు, లింగ వైవిధ్యం, మైనారిటీల ప్రాతినిధ్యం వంటివి మూల్యాంకనం చేసి ఈ ఇద్దరు న్యాయమూర్తులను సిఫార్సు చేసినట్లు పేర్కొంది. 2022 ఆగస్టు నుంచి సుప్రీంకోర్టులో ఏపీకి ప్రాతినిధ్యం లేదు. ఈ నేపథ్యంలో మాతృ హైకోర్టు అయిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రస్తుత న్యాయమూర్తుల్లో సీనియర్ అయిన జస్టిస్ భట్టిని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది.

**సమగ్రత, సామర్థ్యం ఉన్న జస్టిస్ భుయాన్**

తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ ఉజ్జల్ భుయాన్ చట్టంలోని విభిన్న అంశాలపై అనుభవం సంపాదించారని సుప్రీంకోర్టు కొలీజియం పేర్కొంది. లా ఆఫ్ టాక్సేషన్‌లో ఆయన ఎంతో నైపుణ్యం ఉన్నవారని తెలిపింది. బొంబాయి హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన సమయంలో ట్యాక్సేషన్ సహా పలు కేసులు సమర్థంగా డీల్ చేసిన ఆయన సమగ్రత, సామర్థ్యం ఉన్న న్యాయమూర్తి అని పేర్కొంది. జస్టిస్ భుయాన్ 2011 అక్టోబరు 17న గౌహతి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

**జస్టిస్ భట్టి అనుభవం అపారం**

ఏపీ, కేరళ హైకోర్టుల్లో సుదీర్ఘకాలం పనిచేసిన జస్టిస్ భట్టి చట్టంలోని పలు అంశాలపై అపార అనుభవం సంపాదించారని సుప్రీంకోర్టు కొలీజియం పేర్కొంది. జస్టిస్ భట్టి తీర్పులే ఆయన న్యాయపరమైన యోగ్యతకు నిదర్శనమని తెలిపింది. జస్టిస్ భట్టి జ్ఞానం, అనుభవం సుప్రీంకోర్టుకు అదనపు విలువ అందిస్తాయని పేర్కొంది. జస్టిస్ ఎస్.వి.భట్టి 1962 మే 6న చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. తల్లిదండ్రులు రామకృష్ణయ్య, అన్నపూర్ణమ్మ. మదనపల్లెలోని గిరిరావు థియోసోఫికల్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన బీసెంట్ థియోసాఫికల్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. బెంగళూరులోని జగద్గురు రేణుకాచార్య కాలేజీ నుంచి లా డిగ్రీ పొంది, 1987లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఇ.కళ్యాణ్‌రామ్ వద్ద న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, బీహెచ్ఈఎల్, బీఈఎల్, బీహెచ్‌పీవీ, ఆర్ఎస్‌వీపీ, నేషనల్ మారిటైం యూనివర్సిటీలకు న్యాయవాదిగా వ్యవహరించారు. 2000 నుంచి 2003 వరకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదిగా అప్పటి అడ్వొకేట్ జనరల్‌కు సహాయ సహకారాలు అందించారు. 2013 ఏప్రిల్ 12న అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2014లో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. హైకోర్టు విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా 2019లో ప్రమాణం చేశారు. అదే ఏడాది జస్టిస్ భట్టిని కేరళ హైకోర్టుకు బదిలీ చేస్తూ అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్, న్యాయమూర్తులు జస్టిస్ సిక్రీ, జస్టిస్ బాబ్డే, జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ అరుణమిశ్రాలతో కూడిన కొలీజియం నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్న ఆయన ఈ ఏడాది ఏప్రిల్ 24న కేరళ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, జూన్ 1న పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

## సీఐడీ విచారణకు రామోజీ, శైలజా కిరణ్ డుమ్మా

సాక్షి, అమరావతి/నగరంపాలెం (గుంటూరు వెస్ట్): మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ప్రధాన నిందితుడు చెరుకూరి రామోజీరావు, ఏ–2 శైలజాకిరణ్ బుధవారం సీఐడీ విచారణకు డుమ్మా కొట్టారు. కాగా.. ఈ కేసులో ఏ–3గా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ 7 బ్రాంచ్ కార్యాలయాల మేనేజర్లు గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. చందా దారుల నిధులను మళ్లించామని, ఇదంతా తమ ప్రధాన కార్యాలయం ఆదేశాలతోనే చేశామని వారు సీఐడీ విచారణలో వెల్లడించినట్టు సమాచారం. తమ సంస్థలో చాలా ఏళ్లుగా చేస్తున్నట్టుగానే తాము కూడా చేశామని.. అందులో తాము కేవలం పాత్ర ధారులమేనని.. పూర్తి నిర్ణయాధికారం తమ ప్రధాన కార్యాలయానిదేనని స్పష్టం చేసినట్టు సమాచారం.


**నగర వార్తలు**

### 'గాంధీ' డైట్ ఆహార పదార్థాల నాణ్యత భేష్


గాంధీలో రోగులతో మాట్లాడుతున్న తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యులు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్లు, వైద్యులకు డైట్ క్యాంటీన్ ఆధ్వర్యంలో నాణ్యమైన ఆహార పదార్థాలు అందించడం పట్ల తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కమిషన్ సభ్యులు కొంతం గోవర్ధన్‌రెడ్డి, ఓరుగంటి ఆనంద్, భారతీ, శారదల బృందం బుధవారం గాంధీ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించి, డైట్ క్యాంటీన్‌లో తయారు చేస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పలు వార్డులు తిరిగి ఇన్‌పేషెంట్లతో మాట్లాడారు. నగరం నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ జిల్లాల నుంచి వేలాది మంది నిరుపేదలు మెరుగైన చికిత్స కోసం గాంధీఆస్పత్రికి వస్తుంటారని, వైద్యంతోపాటు పౌష్టికాహారం అందిస్తే త్వరితగతిన స్వస్థత చేకూరే అవకాశం ఉందన్నారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, చీఫ్ డైటీషియన్ రమేష్‌లతో ప్రత్యేక సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

### వర్సిటీల్లోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘం నేతలు

బంజారాహిల్స్: విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డికి తెలంగాణ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, గౌరవాధ్యక్షుడు జి.మహేశ్వర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శివశంకర్, ఉపాధ్యక్షుడు అక్బర్‌బేగ్, జాయింట్ సెక్రటరీ రవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకర్ నాయక్ తదితరులు వినతిపత్రం సమర్పించారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, టైంస్కేల్ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, హెల్త్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. వైస్‌చాన్స్‌లర్ మీటింగులకు హాజరయ్యేందుకు టీచింగ్ తరపున ఒకరిని, నాన్‌టీచింగ్ తరపున ఒకరిని నియమించాలని కోరారు.

## నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**


ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి బస్తీ దవాఖానా ప్రారంభిస్తున్న మంత్రి తలసాని


తలసానికి బీపీ పరీక్షలు చేస్తున్న బస్తీ వైద్యుడు

నల్లకుంట: పేద ప్రజల ఆరోగ్యంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అందులో భాగంగానే హైదరాబాద్ నగర ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్ ప్రజల కోసం 350, ఇతర నగరాల్లో మరో 150 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు.

బుధవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ వైద్య సేవలను చేరువ చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ నగర వ్యాప్తంగా 160కి పైగా బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలకు వేద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ఉచిత రక్త పరీక్షల కోసం తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చిందని స్పష్టం చేశారు. మొన్నటి వరకు డయాగ్నస్టిక్ సెంటర్లలో 57 రక్త పరీక్షలు అందుబాటులో ఉండగా సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఇప్పుడు వాటి సంఖ్యను 134కు పెంచామన్నారు. పేద ప్రజలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా 134 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యానికి శ్రీ రామరక్షగా బస్తీ దవాఖానాలు సేవలు అందిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఫార్మా ఎగ్జిబిషన్ ప్రారంభం

- మూడు రోజుల పాటు సందర్శకులకు అందుబాటులో...
- 100కిపైగా దేశాల నుంచి 4500 మంది ప్రతినిదులు


ఫార్మా ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమ దృశ్యం

మాదాపూర్: భారతదేశం ఫార్మా ఎగుమతుల్లో 5వ అతిపెద్ద రంగంగా ఉందని ఫార్మెక్సిల్ చైర్మన్ ఎస్‌వీ వీరమణి తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో బుధవారం మూడు రోజుల పాటు నిర్వహించనున్న (ఐపీహెచ్ఈఎక్స్) అంతర్జాతీయ ఫార్మా ఎగ్జిబిషన్–2023ను ప్రారంభించారు. ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, భారత ప్రభుత్వ వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ మద్దతుతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోని 200 దేశాలను చేరుకోవడంలో భారతీయ ఫార్మా స్యూటికల్ పరిశ్రమ ప్రత్యేకతను చాటుకుందన్నారు. గత ఏడాది 25.39 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఎగుమతులు చేశామన్నారు. సదస్సులో దాదాపు 400 మంది ఎగ్జిబిటర్లు, 660 మంది విదేశీ సందర్శకులు, భారతదేశం, విదేశాల నుంచి 10వేల మందికి పైగా సందర్శకులు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐపిహెచ్ఈఎక్స్ చైర్మన్ తుసార్ కోర్టె, డీసీజీసీడీఎస్‌సీఓ డాక్టర్ రాజీవ్‌సింగ్ రఘువంశీ, ఈపీ ఫార్మా జాయింట్ సెక్రటరీ ఇందునాయర్, పిఎన్‌జి మినిస్టర్ ఫర్ హెల్త్ డాక్టర్ లీనోటాం తదితరులు పాల్గొన్నారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు.

### వ్యవసాయ వర్సిటీలో ట్రైనీ ఐఏఎస్ అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రానికి కొత్తగా కేటాయించిన శిక్షణా ఐఏఎస్ అధికారులు బుధవారం సందర్శించారు. రిజిస్ట్రార్ వెంకటరమణ, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ విద్య, పరిశోధన, విస్తరణ విభాగాలు, చేపట్టిన కార్యక్రమాలు సాధించిన పురోగతి తదితర అంశాల్ని వర్సిటీ అధికారులు శిక్షణ ఐఏఎస్ బృందానికి వివరించారు. ఈ సందర్భంగా వివిధ పంటలకు సంబంధించి వర్సిటీ రూపొందించిన కొత్త వంగడాలు వాటి సాగు అదే విధంగా రైతాంగానికి అందిస్తున్న విస్తరణ సేవల గురించి వివరించారు.



### 'మనూ'లో కొత్త కోర్సులు ప్రారంభం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫ్యాషన్ టెక్నాలజీలో కొత్త కోర్సును ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉర్దూ విశ్వవిద్యాలయం లో ఎంటెక్–సీఎస్ఈ ( ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) పార్ట్ టైమ్ కోర్సుగా ప్రారంభిస్తుండగా బీఎస్సీ ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో మరో కొత్త కోర్సును ప్రారంభిస్తారు. 2023–24 విద్యా సంవత్సరానికి లక్నో క్యాంపస్‌లో ఫ్యాషన్ టెక్నాలజీలో డిప్లొమో అండ్ సర్టిఫికెట్ కోర్సును కూడా ప్రారంభిస్తారు. హైదరాబాద్ క్యాంపస్‌లో ఫ్యాషనల్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సుకూడా అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంటెక్ సీఎస్ఈ(ఏఐ/ఎంఎల్) కోర్సును స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్స్ మోడ్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఫారాలను సమర్పించడానికి చివరి తేదీగా జూలై 31గా నిర్ణయించారు.

### ఉస్మానియాలో ప్రారంభమైన ట్రాన్స్‌జెండర్ వైద్య సేవలు

అఫ్జల్‌గంజ్ : ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌లో వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను ఇటీవలే రాష్ట్ర హోంశాఖ మంత్రి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇకపై ప్రతి బుధవారం అవుట్ పేషెంట్ బ్లాకులోని ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## కలిసికట్టుగా పనిచేద్దాం

**బల్దియా కమిషనర్ రోనాల్డ్‌రాస్**



సాక్షి, సిటీబ్యూరో: నగర ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు అందరం కలిసికట్టుగా సమన్వయంతో పనిచేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ అన్నారు. కొత్త కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లతో ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమంలో మాట్లాడారు. కొత్తగా ప్రారంభించిన వార్డు కార్యాలయాల పనితీరును ఎప్పటికప్పుడు జోనల్, డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షించాలని సూచించారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సూచనల మేరకు ఇంకా ప్రారంభం కాని వార్డు కార్యాలయాలను వేగవంతంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. శానిటేషన్ పరిస్థితిపై సమీక్షిస్తూ సంబంధిత డిప్యూటీ కమిషనర్లు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో అడిషనల్, జోనల్ కమిషనర్లతోపాటు ఆయా విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ప్లానెట్ గ్రీన్ సంస్థకు
## ది ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డు



లక్డీకాపూల్ : పర్యావరణ పరిరక్షణలో.. ప్రకృతి వ్యవసాయ రంగంలో చేస్తున్న విశేష కృషికి ఫలితంగా ప్లానెట్ గ్రీన్ సంస్థను ది ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డు వరించింది. ఈ సంస్థను మౌలిక సదుపాయాలు విభాగంలో రౌండ్ టేబుల్ ఇండియా ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఇటీవల బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్లానెట్ గ్రీన్ సంస్థను ది ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భంగా సంస్థ అధినేత వినయ్ మాట్లాడుతూ.. టీఎస్ఆర్టీసీ ఎండి వీసీ సజ్జనార్, రత్నదీప్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ అగర్వాల్, ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి, నటుడు మురళీమోహన్‌ల సమక్షంలో ఈ అవార్డు అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇది తమ టీమ్ అందరి విజయమని ఆయన స్పష్టం చేశారు.

## అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు


గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న కేవీపీ రాంచంద్రరావు

గన్‌ఫౌండ్రీ: టీటీడీ ఆస్థాన సంగీత విద్వాంసులు గరిమెల్ల బాలకృష్ణప్రసాద్, రావూరి బుల్లెమ్మల గళం నుంచి జాలువారిన అన్నమాచార్య సంకీర్తనలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. బుధవారం రవీంద్రభారతిలో వాసవి ఆర్ట్స్ ఆధ్వర్యంలో మాజీ గవర్నర్ కే.రోశయ్య 90వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. మాజీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ.... అన్నమాచార్య సంకీర్తన విభావరి మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కె.దామోదర్ గుప్తా, సీల్‌వెల్ కార్పొరేషన్ ఎండీ బండారు సుబ్బారావు, సంస్థ అధ్యక్షులు ముకుటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ప్రతిఘటన

# కట్నం ఇవ్వను



**ఎంఎస్సీ మాథ్స్ చేసి ఆన్‌లైన్‌లో లెక్కలు చెప్పే భోపాల్ యువతికి పెళ్లి కావడం లేదు. కట్నం ఇవ్వను అనడమే కారణం. '50 లక్షలు అడుగుతున్నారు మా నాన్న ఎక్కడ నుంచి తెస్తాడు' అని ఆమె ప్రశ్న. 'సంబంధం కేన్సిల్' అనేది తరచూ వినవస్తున్న జవాబు. ఇప్పటికి 12 పెళ్లి చూపులు భగ్నమయ్యాయి. విసిగిపోయిన ఆమె పోరాటానికి దిగింది. పోలీసులకు కంప్లయింట్ చేసింది. అన్ని చోట్లా చైతన్యానికి నడుం బిగించింది.**

'ఇది రొటీన్‌గా జరుగుతోంది. ఎప్పట్లాగే నేను ట్రేలో టీకప్పులు పెట్టుకుని వస్తాను. దానికి ముందు మా అమ్మ నాకు బాగుంటుందని చెప్పి ఆకుపచ్చ డ్రస్సు తీస్తుంది. నా పళ్లు కొంచెం ఎగుడుదిగుడుగా ఉంటాయని ఎక్కువగా నవ్వొద్దని హెచ్చరిస్తుంది. టీ ట్రేతో నేను హాల్లోకి రాగానే అందరూ నన్ను ఆపాదమస్తకం శల్యపరీక్ష చేస్తున్నట్టుగా చూస్తారు. ఏం చదివావు, ఏం పని చేస్తున్నావు, వంటొచ్చా... అవే ప్రశ్నలు. ఆ తర్వాత కీలకమైన సందర్భం వస్తుంది. కట్నం ఎంత ఆశిస్తున్నారు అని మా నాన్న అడుగుతాడు. అప్పుడు పెళ్లికొడుకు తరుపువారు ఏ యాభైలక్షల్లో అరవైలక్షల్లో లేకుంటే పెళ్ళిళ్లు జరుగుతున్నాయా అనంటారు. కొంచెం ఆలోచించండి అని మా నాన్న అంటాడు. మీ అమ్మాయి అందంగా ఉంది కాబట్టి డిస్కౌంట్ ఇవ్వొచ్చులేండి అని వారు జోక్ చేస్తారు. నాకు మాత్రం ఇదంతా చాలా అసహ్యంగా ఉంటుంది' అంటుంది రూప.

ఇది ఆమె అసలు పేరు కాదు. ఇలాంటి అమ్మాయిలు దేశమంతా ఉన్నారు. వారికి వేరే వేరే పేర్లు ఉంటాయి. కాని వారందరి సమస్య మాత్రం ఒకటే– కట్నం. నేషనల్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం మన దేశంలో 2017 నుంచి 2022 వరకు 35,493 మంది నవ వధువులు, కొత్త పెళ్లి కూతుళ్లు వరకట్న చావులకు గురయ్యారు. అంటే రోజుకు సగటున 20 మంది. అయినా కట్నం కొనసాగుతూనే ఉంది.

## పేరు మారిందంతే

మన దేశంలో వరకట్నం 1961లో నిషేధించారు. కాని అలాంటి చట్టం ఒకటుందని సమాజం ఆనాడు పట్టించుకోలేదు.. ఈనాడూ పట్టించుకోవడం లేదు. 1980ల కాలంలో వరకట్న పిశాచం దేశాన్ని పీడించింది. ఎందరో కొత్తకోడళ్లు కిరోసిన్ స్టవ్ మంటల్లో కాలిపోయారు. ఆ తర్వాత కొంత చైతన్యం వచ్చింది. అమ్మాయిలు చదువుకొని ఉద్యోగాలు చేస్తున్నారు. కొన్నివర్గాల ఆర్థిక స్థితి మెరుగయ్యింది. కట్నం అనే మాట వాడటం నామోషీగా మారింది. దానికి బదులుగా లాంఛనాలు అంటున్నారు. ఫార్మాలిటీస్ అంటున్నారు. ఏ మాట వాడినా ఉద్దేశం మాత్రం ఆడపిల్ల తరఫువారు మగపెళ్లి తరఫు వారికి ఆర్థికంగానో ఆస్తిపాస్తుల రూపేణానో ముట్టజెప్పాలి. అంతస్తును బట్టి ఈ లాంఛనాల స్థాయి ఉంటుంది. లక్షల నుంచి కోట్ల వరకు.



● భోపాల్ పోలీస్ కమీషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న రూప

## కట్నం ఇవ్వను

పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివి, భోపాల్‌లో తన కాళ్ల మీద తాను నిలబడే స్థితిలో ఉన్న రూపకు 27 ఏళ్లు వచ్చేశాయి. ఈమె తల్లిదండ్రులు ఐదారేళ్ల నుంచి సంబంధాలు చూస్తున్నారు. కాని కట్నం కారణంగా కుదరడం లేదు. 'మా నాన్న నూటాయాభై మంది కుర్రాళ్ల ప్రొఫైల్స్ చూసి 20 మందిని సెలక్ట్ చేశాడు. వారిలో 12 మందితో పెళ్లిచూపులు అయ్యాయి. అందరూ కట్నం అడిగేవాళ్లే. ఎవరూ 50 లక్షలకు తక్కువ లేరు. మా నాన్న అంత ఖర్చు పెట్టలేడు. అసలు కట్నం ఎందుకివ్వాలి? నేను కట్నం ఇవ్వను... కట్నం అనేది చాలా చెడ్డ ఆచారం. పెళ్లి ఖర్చులు పెట్టుకుంటాను అని ఏ అబ్బాయికి చెప్పినా నా ముందు తలాడిస్తున్నాడు కాని ఆ తర్వాత సంబంధం కేన్సిల్ అనే కబురు వస్తోంది. నా ఆత్మవిశ్వాసం మొత్తం పోయింది. మరోవైపు మా బంధువులేమో అమ్మాయి ఇప్పటికే ముదిరిపోయింది అని టెన్షన్ పెడుతున్నారు. పెళ్లి చేసుకోవాలని నాకూ ఉంది. ఒంటరిగా జీవితాన్ని లాగలేము కదా. కాని ఈ కట్నం బాధ ఏమిటి? ఎంతమంది అప్పులు చేసి, ఆస్తులు అమ్మి ఇంకా ఆడపిల్లల పెళ్లిళ్లు చేయాలి?' అని ప్రశ్నిస్తోంది రూప.

## పోలీసులు పూనుకోవాలి

కట్నం తీసుకోవడం శిక్షార్హం కాబట్టి పోలీసులు పూనుకొని ఈ దురాచారాన్ని నిలువరించాలని, ప్రతి పెళ్లి జరిగే మంటపాల్లో చెకింగులు చేయాలని, కట్నం తీసుకుంటున్న కొంతమందికైనా శిక్ష పడితే కట్నం డిమాండ్ తగ్గుతుందని అంటుంది రూప. ఈమేరకు ఆమె భోపాల్ పోలీస్ కమిషనర్ హరినారాయణ్‌ను వినతిపత్రం ఇచ్చింది. వరకట్న దురాచారం వల్ల వస్తున్న ఆర్థిక బాధల గురించి చైతన్యం రావాలని మీడియాను సంప్రదించింది రూప. 'నేను కట్నం వద్దంటున్నానని మా అమ్మ నాతో మాట్లాడటం లేదు. కట్నం వద్దంటే జన్మలో నీ పెళ్లి చేయలేనని మా నాన్న టెన్షన్ పడుతున్నాడు. నేటి కాలంలో కట్నం ఉంటే తప్ప పెళ్లి కాని స్థితిలో ఒక యువతి ఉండటం ఎంత విషాదమో ఈ సమాజం ఆలోచించాలి' అంటోంది రూప.

ఈ స్థితికి తాము ఎంత కారణమో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ఈ పరిస్థితిలో మార్పుకోసం ప్రయత్నించాలి.

అక్షరం

# ఆబాలగోపాలం అద్భుతం అనేలా...



పిల్లల పుస్తకప్రపంచంలో తనదైన ప్రత్యేకత నిలుపుకుంది రూపా పాయ్. ఫాంటసీ–అడ్వెంచర్ పుస్తకాలతో పాటు 'ది గీతా ఫర్ చిల్డ్రన్'లాంటి భిన్నమైన పుస్తకాన్ని రాసి ప్రశంసలు అందుకుంది. ఈ పుస్తకం 'క్రాస్‌వర్డ్ అవార్డ్' గెలుచుకుంది. మరో భిన్నమైన పుస్తకం 'ది యోగా సూత్రాస్ ఫర్ చిల్డ్రన్'తో పిల్లలను పలకరించింది బెంగళూరుకు చెందిన రూప...

పిల్లల పత్రిక 'టార్గెట్'తో పాటు లండన్ కేంద్రంగా ప్రచురితమయ్యే 'ట్రావెల్ ట్రెండ్స్' మ్యాగజైన్ కోసం ఎన్నో రచనలు చేసింది రూప. అయితే తనకు పిల్లల కోసం రచనలు చేయడం అంటేనే బాగా ఇష్టం. 'నేను రచయిత్రి కాకపోయి ఉంటే టీచర్‌ని అయ్యేదాన్ని' అంటుంది కంప్యూటర్–ఇంజనీరింగ్ చదువుకున్న రూప.

చిన్నప్పటి నుంచి పుస్తకాలు తెగ చదివేది. బెంగళూరులోని లైబ్రరీలన్నీ ఆమెకు సుపరిచితమే. చదవగా, చదవగా తనలో కాల్పనిక ప్రపంచం ఒకటి అస్పష్టంగా ఆవిష్కారమయ్యేది. కళ్ల ముందు ఏవేవో పాత్రలు, దృశ్యాలు కదలాడుతుండేవి. కాగితం, కలం పట్టిన తరువాత వాటికి ఒక రూపం ఇచ్చింది.

రకరకాల జానర్స్‌లో రచనలు చేయడం గురించి రూప ఇలా అంటోంది... 'కథ మంచిదైతే, ఆకట్టుకునేలా ఉంటే అది ఏ జానర్ అనేది పిల్లలు పట్టించుకోరు. వారికి కచ్చితంగా హాస్యం ఉండాల్సిందే. ముఖ్యంగా క్లైమాక్స్ అనేది వారికి నచ్చాలి'

### పిల్లలకు యోగా సూత్రాలు

భగవద్గీత శ్లోకాల సారాంశాన్ని, ఆర్థిక సూత్రాల మర్మాన్ని పుస్తకాల ద్వారా పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా చెప్పిన రూపా పాయ్ తాజా పుస్తకం 'ది యోగ సూత్రాస్ ఫర్ చిల్డ్రన్'. చిన్నప్పుడు మనసులో పడిన ఒక బీజం మొక్క అవుతుంది. ఆ తరువాత బలమైన చెట్టు అవుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాసిన పుస్తకం ఇది. 'మనలో కలిగే రకరకాల భావాలకి మనమే యజమాని' 'నేను శరీరాన్ని కాదు. కాని ఈ శరీరమనే అద్భుతమైన నిర్మాణంతో ఈ అద్భుత ప్రపంచాన్ని చూడగలుగుతున్నాను' 'నేను మనసుని కాదు. కానీ మనసు అనే మహా నిర్మాణంలో ఎన్నో అద్భుతాలను అనుభవంలోకి తెచ్చుకోగలుగుతాను'... ఇలా ఆకట్టుకునే మాటలు ఎన్నో ఉన్న 'ది యోగ సూత్రాస్ ఫర్ చిల్డ్రన్' ఆబాలగోపాలానికి ప్రియమైన పుస్తకం అవుతుంది అనడంలో సందేహం లేదు.



'ది గీతా ఫర్ చిల్డ్రన్' పుస్తకం రూపకు ఎంతో పేరు తెచ్చింది. 'మన పురాణాలకు సంబంధించిన ఎన్నో సంక్లిష్టమైన విషయాలను పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా రాస్తున్నారు కదా....మరి భగవద్గీత గురించి ఎందుకు రాయకూడదు' అని ఒకరోజు అడిగింది ఎడిటర్ వత్సల. అయితే అందుకుముందెన్నడూ భగవద్గీతను రూప చదవలేదు. అలా అని 'నేను రాయలేను' అనలేదు. 'ఓకే' అంటూ రంగంలోకి దిగింది. 'గీత'ను ఎన్నోసార్లు చదివింది. అనేకసార్లు చదివిన తరువాత 'గీత గురించి పిల్లలకు చెప్పాలనే ఆలోచన నాకు ఎందుకు రాలేదు' అనుకుంది.

నిజానికి అదొక సవాలు. కానీ ఆ సవాలును ఇష్టంగా స్వీకరించింది రూప.

'ది గీతా ఫర్ చిల్డ్రన్' పిల్లలనే కాదు వారి తల్లిదండ్రులను కూడా ఆకట్టుకుంది. 'మంచి ప్రయత్నం' అని ప్రశంసించారు.

'ది గీతా ఫర్ చిల్డ్రన్' పుస్తకం విజయవంతం అయిన తరువాత 'ఇదే కోవలో మరో పుస్తకం రాస్తే బాగుంటుంది' అని చాలామంది అడిగారు. అయితే అలా రాస్తే రొడ్డకొట్టుడుగా ఉంటుందని రూపకు అనిపించింది. 'ఇప్పుడు కావాల్సింది మరో విభిన్నమైన పుస్తకం' అని అనుకుంది. అలా వచ్చిందే...'సో యూ వాంట్ టు నో ఎబౌట్ ఎకనామిక్స్' పుస్తకం.

ఈ పుస్తకం రావడానికి మరో కారణం 'గీతను పిల్లలకు అర్థమయ్యేలా చెప్పడంలో విజయం సాధించాను' అనే ఆత్మవిశ్వాసం. ఈ పుస్తకం తరువాత వచ్చిన 'రెడీ 99'కి కూడా మంచి స్పందన వచ్చింది.



● రూపా పాయ్

పుస్తకం రాయడానికి రూప అనుసరించే పద్ధతి ఏమిటి?

పుస్తకం రాయడానికి ముందు మనసు అనే కాగితంపైనే ఎన్నో వాక్యాలు రాసుకుంటుంది. అక్కడే ఎడిటింగ్ చేసుకుంటుంది. తాను ఎంచుకున్న అంశంపై ఎన్నో పుస్తకాలు చదువుతుంది. ఆ అంశంపై పట్టు ఉన్న వాళ్లతో మాట్లాడుతుంది. విషయ అవగాహన తరువాత పిల్లలను ఆకట్టుకునేలా, అర్థమయ్యేలా ఎలా రాయాలో అనేదానిపై కసరత్తు చేస్తుంది.

'పన్నెండు సంవత్సరాల వయసులో ఒక పిల్లల మాసపత్రికను చూస్తూ...పెద్దయ్యాక ఈ పత్రికకు కథలు రాయాలనుకునేదాన్ని. నా కల నెరవేరింది. ఇంతకంటే అదృష్టం, ఆనందం ఏముంటాయి!' అంటుంది రూపా పాయ్.

# సాగరకన్య ఫర్ శాలరీ





### ఖర్చులకు సరిపోతుంది..

"టీచర్‌గా పనిచేసేటప్పుడు వచ్చే జీతం కంటే మత్స్యకన్య ఉద్యోగానికి జీతం తక్కువే. అయినా నా ఖర్చులకు తగినంత సంపాదిస్తున్నాను. ఇది చాలు. ఈ ఉద్యోగం నాకు చాలా సంతోషాన్నిస్తోంది. అమ్మకు.. మత్స్య కన్య హాబీ గురించి తెలిసినప్పుడు.. అసాధారణమైనదిగా భావించారు. కానీ దీనినే కెరీర్‌గా ఎంచుకుంటానని ఆమె అస్సలు అనుకోలేదు. నా సంతోషం చూసి ఇప్పుడు అమ్మే నన్ను ప్రోత్సహిస్తున్నారు".

– మాస్ గ్రీన్.

జలకన్య, మత్స్య కన్య అని వినపడగానే ఎక్కడ? ఎక్కడ? అని చూస్తుంటారు చాలామంది. శరీర పైభాగం మనిషిగా, కింది భాగం చేపరూపంలో ఉండే జలకన్యలంటే ఆసక్తి ఉండనిదెవరికి? జలకన్యను చూసేందుకు అందరూ ఆరాటం దగ్గరే ఆగిపోతే, మాస్ గ్రీన్ మాత్రం మత్స్యకన్యపై మరింత మక్కువతో తానే ఓ జలకన్యగా మారిపోయింది. మత్స్యకన్యలా ఈదుతూ... ఈ ఉద్యోగం ఎంత బావుందో అని తెగ సంబరపడిపోతుంది.

యూకేలోని టార్క్వే నగరానికి చెందిన ముప్పై మూడేళ్ల మాస్‌గ్రీన్ 2016లో ఇటలీలోని సిసిలీ వెళ్లింది. అక్కడ ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. కరోనా కారణంగా ఇళ్లకే పరిమితమైన సమయంలో ఏం చేయాలో తోచక కొత్తగా ఏదైనా చేయాలనుకుంది. అలా ఆలోచిస్తున్న సమయంలో ఇంటికి దగ్గరలో ఉన్న బీచ్‌లో ఒకతను 'మ్యాజికల్ మెర్మాన్' డ్రెస్‌లో కనిపించాడు. అది చూసిన మాస్‌కు చాలా ఆసక్తిగా అనిపించింది. వెంటనే జలకన్య ఎలా ఉంటుందో తెలుసుకుని, తను కూడా అలా తయారవాలనుకుంది. అప్పటి నుంచి జలకన్యగా తయారవడం తనకెంతో ఇష్టమైన హాబీగా మార్చుకుంది. మత్స్యకన్యగా రెడీ అయ్యి తనని తాను చూసుకుంటూ తెగమురిసిపోయేది.

## ఇన్‌స్టాగ్రామ్ ఆఫర్‌తో...

మత్స్యకన్యగా తయారైన ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పోస్టు చేస్తుండేది. ఆ ఫొటోలు చూసిన ఓ సంస్థ మత్స్య కన్య ఉద్యోగం ఇస్తాం అని మాస్‌ని పిలిచింది. దీంతో సిసిలీ బీచ్‌కు దగ్గర్లో ఉన్న 'లాంపేడుసా' ఐలాండ్‌లో మత్స్యకన్యగా పనిచేస్తోంది. ఊపిరిని బిగపట్టి నీటి అడుగు భాగంలో డైవింగ్ చేయడం, నిజమైన జలకన్యలా అటు ఇటు తిరగడం వంటి విన్యాసాలతో పర్యాటకుల్ని ఆకర్షించడమే ఆమె ఉద్యోగం. బోట్ టూర్స్‌కు గైడెన్స్ ఇస్తూనే, జలచరాలు నీటిలో ఎలా కదులుతాయో చెబుతూ పర్యాటకులకు ఈదడం నేర్పించడం ఈ ఉద్యోగంలో చేయాల్సిన ఇతర ముఖ్యమైన పనులు. వేసవి సమయాల్లో రోజుకు 12 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. ఇవన్నీ చేయడం కోసం మాస్ వివిధ రకాల చేపల కదలికను గమనించి, ఈదడంలో మెళకువలు నేర్చుకుంది. ఊపిరిని బిగపట్టడాన్ని ఎంతో ఛాలెంజింగ్‌గా తీసుకుని కష్టపడి అభ్యసించింది. ప్రస్తుతం తన వృత్తిలో ఎంతో సంతోషంగా ఉంది మాస్ గ్రీన్.

మాస్ గ్రీన్ తన ఆసక్తితో సరికొత్త ఉద్యోగాన్ని సృష్టించి ఎంతో మంది నిరుద్యోగులకు కొత్త దారి చూపించింది. ఇష్టం, చేయాలన్న సంకల్పం ఉంటే ఏదో రకంగా దారి దొరుకుతుందనడానికి ఈ జలకన్య ఉద్యోగమే ఉదాహరణగా నిలుస్తోంది.

ఇంటిప్స్


# ఇలా దాచుకోండి!

రుచిగా, వేగంగా వంట చేయాలంటే ఈ మూడు చిట్కాలు పాటిస్తే సరి.



కూర ఏదైనా రుచికోసం అల్లం వెల్లుల్లి పేస్టుని వాడుతుంటాం. ఈ పేస్టుని రిఫ్రిజిరేటర్లో నిల్వ చేసినప్పటికీ కొన్నిసార్లు రంగు మారి, ఎండిపోయినట్లు అవుతుంది. అల్లం వెల్లుల్లి పేస్టుని నిల్వచేసేముందు కొద్దిగా నూనె కలిపి పెడితే మరిన్ని రోజులు తాజాగా ఉంటుంది. అల్లం, వెల్లుల్లి పేస్టులను విడివిడిగా నిల్వచేసినా నూనె కలుపుకోవడం మంచిది.

మిగిలిపోయిన ఆహార పదార్థాలు, మసాలాలు, ఇడ్లీ దోశపిండిలతో రిఫ్రిజిరేటర్ నిండిపోతుంటుంది. దీంతో తలుపు తీసినప్పుడల్లా అదొక రకమైన వాసన వస్తుంటుంది. కాటన్ బాల్‌ను వెనీలా ఎసెన్స్‌లో ముంచి, రిఫ్రిజిరేటర్‌లో ఒక మూలన ఉంచితే దుర్వాసన పోతుంది.





మిగిలిపోయిన దోశ, ఇడ్లీ పిండి, గారెల పిండి వంటివాటిని రిఫ్రిజిరేటర్‌లో పెట్టినా, కొన్నిరోజులకే ఎండిపోవడమో, బాగా పులిసిపోవడమో జరుగుతుంది. అందువల్ల మిగిలిపోయిన పిండిలో రెండు మూడు ఎండు మిరపకాయలు వేసి రిఫ్రిజిరేటర్‌లో పెట్టుకోవాలి.



# సైబర్ టాక్

# వాట్సాప్ పింక్ మోసం

**వాట్సప్‌లో ఓ కొత్త మోసం వేగంగా వ్యాపిస్తోంది. ఈ వాట్సాప్ పింక్ స్కామ్ ఇప్పటికే చాలా మంది వ్యక్తులను మోసగించింది. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు విభాగాలు, సైబర్ నిపుణులు ఈ మోసాలకు వ్యతిరేకంగా ఇప్పటికే హెచ్చరించారు. ఆండ్రాయిడ్ వినియోగదారుల కోసం వాట్సాప్ 'పింక్ రెడ్ అలర్ట్'తో హెచ్చరించింది. ఇంతకీ వాట్సాప్ పింక్ అంటే ఏంటి? ఈ స్కామ్ ఎలా వ్యాపిస్తోంది. మీరు బాధితులైతే ఏం చేయాలి?! తప్పనిసరిగా తెలుసుకోవాలి.**

## పింక్ వాట్సాప్ అంటే..?

స్కామర్లు 'అదనపు ఫీచర్లతో ఉన్న పింక్ వాట్సాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమని వినియోగదారులకు మెసేజ్‌లు పంపుతారు.' ఈ యాప్ నిజానికి ప్రమాదకరమైన మాల్వేర్. వాట్సాప్ పింక్‌ని డౌన్‌లోడ్ చేయడంతో స్కామర్లు ఫోన్ డేటాకు యాక్సెస్ పొందుతారు. దీంతో ఈ యాప్ మన ఫోన్ డేటాను పూర్తిగా దొంగిలించడానికి వీలు కల్పిస్తోంది. బ్యాంక్ వివరాలు, కాంటాక్ట్ నంబర్లు, ఫొటోగ్రాఫ్స్, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని స్కామర్లు దొంగిలించి ఉండవచ్చు.

## వినియోగదారులకు వచ్చే మెసేజ్‌లు ఇలా ఉంటాయి..

- 'న్యూ పింక్' వాట్సాప్ కొత్త ఫీచర్లతో అధికారికంగా ప్రారంభించారు. న్యూ పింక్ లుక్ కొత్త ఫీచర్లతో మీ వాట్సాప్‌ను ఇప్పుడే అప్‌డేట్ చేయండి. ఈ కొత్త వాట్సాప్‌ని ఇప్పుడే ప్రయత్నించండి అనే మెసేజ్‌లు వస్తుంటాయి.
- ఫోన్ హైజాక్ చేసిన వాళ్లు మీ కాంటాక్ట్ నుండి వచ్చే మెసేజ్‌లను కూడా డౌన్‌లోడ్ చేయవచ్చు. యాప్ నకిలీ వెర్షన్ వినియోగదారుల ఫోన్‌లను హ్యాక్ చేయడమే కాదు, ఇది యాప్‌ను డౌన్‌లోడ్ చేయమని మీ పూర్తి కాంటాక్ట్‌లోని జాబితాకు మెసేజ్‌లు కూడా పంపుతుంది.
- వాట్సాప్ పింక్ అనేది హానికరమైన మాల్వేర్. మొబైల్ ఫోన్‌లను యాక్సెస్ చేయడానికి ఉపయోగించే ఓ నకిలీ సాఫ్ట్‌వేర్. ఓటీపీలు, కాంటాక్ట్స్, బ్యాంక్ ఖాతా వివరాలు, ఇతర ఆర్థిక విషయాలతో సహా వినియోగదారుల పరికరాల నుండి పూర్తి సమాచారాన్ని దొంగిలించడానికి హ్యాకర్లు దీనిని ఉపయోగిస్తారు. వ్యక్తులు లింక్‌లు ఓపెన్ చేసినప్పుడు వారి డిజిటల్ పరికరాలలో హానికరమైన సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ అవుతుంది.
- థర్డ్–పార్టీ యాప్ స్టోర్‌లు లేదా APK ఫైల్స్ నుండి ప్రోగ్రామ్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఆపిల్ ఫోన్‌లో అయితే యాక్సెస్ ఉండదు. వాట్సాప్ పింక్ స్కామ్ ఆండ్రాయిడ్ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది. థర్డ్‌పార్టీ యాప్ స్టోర్‌లు, ఏపీకే ఫైల్స్ ద్వారా ఇది వ్యాపిస్తుంది.
- తమ అక్రమ కార్యకలాపాలకోసం హ్యాకర్లు ఫోన్ గ్యాలరీలో వ్యక్తిగత ఫొటోలను తీసి, బ్లాక్ మెయిలింగ్‌కు ఉపయోగించుకుంటున్నారని సైబర్ సెక్యూరిటీ సంస్థలు, చట్టాన్ని అమలు చేసే అధికారులు హెచ్చరిస్తున్నారు.
- మీ ఫోన్‌లో వాట్సాప్ పింక్ యాప్ డౌన్‌లోడ్ చేసి ఉంటే ఇప్పుడే దానిని అన్ ఇన్‌స్టాల్ చేయండి. ఆ తర్వాత, మీ ఫోన్‌ని బ్యాకప్ చేసి ఫార్మాట్ లేదా రీసెట్ చేయండి.

మీరు ఈ వాట్సాప్ పింక్ గురించి ఇతరులకు అవగాహన కల్పించండి. తాజా స్కామ్‌లను ఎప్పటికప్పుడు తెలుసుకోండి. స్నేహితుల, కుటుంబ సభ్యులతో సమాచారాన్ని పంచుకోండి. అవగాహన పెంపొందించడం ద్వారా ఇతరుల స్కామ్‌ల బారిన పడకుండా మీరు సహాయం చేయవచ్చు. మోసానికి గురైతే బాధితులు https://www.cybercrime.gov.in/ పోర్టల్‌లో రిపోర్ట్ చేయవచ్చు.

### అనుమానాస్పద లింక్‌ల పట్ల జాగ్రత్త

- తెలియని లేదా అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయడం మానుకోవాలి. ప్రత్యేకించి అవి కొత్త ఫీచర్లు లేదా హానికరమైన లింక్‌లపై క్లిక్ చేసేలా ఆకట్టుకునే మెసేజ్‌లు ఉంటే అనుమానించాలి.
- వాట్సాప్ లేదా ఏదైనా ఇతర అధికారిక సంస్థ నుండి వచ్చినట్లు క్లెయిమ్ చేసే మెసేజ్‌ను యాక్సెస్ చేస్తే ముందు దాని ప్రామాణికతను ధ్రువీకరించాలి. సమాచారం చట్టబద్ధంగా ఉందో లేదో తెలుసుకోవడానికి వాట్సాప్ వెబ్‌సైట్, సోషల్ మీడియా అకౌంట్స్, విశ్వసనీయ వార్తా సమాచారాల నుంచి చెక్ చేయాలి.
- పేరొందిన యాంటీ మాల్వేర్ సాఫ్ట్‌వేర్‌లను ఇన్‌స్టాల్ చేయడం ద్వారా మీ మొబైల్ పరికరాన్ని సురక్షితంగా ఉంచచ్చు. ఇవి హానికరమైన యాప్‌లు లేదా లింక్‌లను గుర్తించి అడ్డుకోవడంలో సహాయపడతాయి.
- వాట్సాప్, ఇతర యాప్‌లను ఎప్పటికప్పుడు తాజా వెర్షన్‌లకు అప్‌డేట్ చేయాలి. సేఫ్టీ అప్‌డేట్ వల్ల బెదిరింపుల నుండి రక్షించుకోవడానికి సహాయపడుతుంది.
- వాట్సాప్ మీ బ్యాంకింగ్ వివరాల వంటి సెన్సిటివ్ సమాచారాన్ని మెసేజ్‌ల ద్వారా ఎప్పటికీ అడగదు. తెలియని లేదా నమ్మదగని అకౌంట్స్‌తో ఎప్పుడూ వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దు.
- వాట్సాప్ కూడా రెండు దశల ప్రామాణికతతో ఉంటుంది. దీనిని సెట్ చేసుకోవడానికి పిన్ నంబర్ ఉంటుంది. కొత్త ఫోన్‌లో మీ ఫోన్ నంబర్ యాక్సెస్ అవ్వాలంటే ఈ పిన్ నెంబర్ అవసరం అవుతుంది. మీ అకౌంట్ సేఫ్టీని మెరుగుపరచడానికి వాట్సాప్ సెట్టింగ్‌లలో ఈ ఫీచర్‌ని ఇప్పుడే ప్రారంభించవచ్చు.



ఇన్‌పుట్స్: **అనిల్ రాచమల్ల**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



## రష్మిక సంచలన విజయం

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయిలు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, సహజ యామలపల్లి సింగిల్స్ విభాగంలో శుభారంభం చేశారు. థాయ్‌లాండ్‌లో బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రష్మిక 6-0, 6-2తో ఎనిమిదో సీడ్ ఇకుమి యామజాకి (జపాన్)పై సంచలన విజయం సాధించగా... ఏడో సీడ్ సహజ 3-6, 6-2, 6-2తో దశ ఇవనోవా (అమెరికా)ను ఓడించింది. ఇకుమితో జరిగిన మ్యాచ్‌లో రష్మిక రెండు ఏస్‌లు సంధించడంతోపాటు ఐదు బ్రేక్ పాయింట్లు సాధించింది.



## టాప్ ర్యాంక్‌లోనే అశ్విన్

భారత వెటరన్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ టాప్ ర్యాంక్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి విడుదల చేసిన టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అశ్విన్ 860 రేటింగ్ పాయింట్లతో నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో భారత ఆటగాడు రవీంద్ర జడేజా అగ్రస్థానంలోనే ఉన్నాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు టాప్ ర్యాంక్ నిలబెట్టుకుంది.



## ప్రిక్వార్టర్ ఫైనల్లో విష్ణువర్ధన్-కృష్ణ ప్రసాద్ జోడీ

కాల్గరీ: కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో పంజాల విష్ణువర్ధన్ గౌడ్-గరగ కృష్ణ ప్రసాద్ (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో విష్ణువర్ధన్-కృష్ణ ప్రసాద్ ద్వయం 21-14, 21-16తో చెన్ జి రే-లు చెన్ (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో కామన్వెల్త్ గేమ్స్ మాజీ చాంపియన్ పారుపల్లి కశ్యప్‌కు నిరాశ ఎదురైంది. 36 ఏళ్ల కశ్యప్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించలేకపోయాడు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో కశ్యప్ 21-14, 22-20తో కాయ్ ష్కాఫెర్ (జర్మనీ)పై నెగ్గి.. రెండో రౌండ్‌లో 17-21, 20-22తో లె లాన్ జి (చైనా) చేతిలో ఓడిపోయాడు.

## విండీస్‌కు తొలి విజయం



బ్రాండన్ కింగ్

హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ 'సూపర్ సిక్స్' దశలో వెస్టిండీస్ తొలి విజయం నమోదు చేసింది. ఒమన్ జట్టుతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా ఒమన్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లకు 221 పరుగులు చేసింది. షోయబ్ ఖాన్ (50; 5 ఫోర్లు, 1 సిక్స్), సూరజ్ కుమార్ (53; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. విండీస్ బౌలర్లలో రొమారియో షెఫర్డ్ మూడు, కైల్ మేయర్స్ రెండు వికెట్లు తీశారు. అనంతరం వెస్టిండీస్ 39.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 222 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్ (100; 15 ఫోర్లు) సెంచరీ చేశాడు. షై హోప్ (63 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్) అజేయ అర్ధ సెంచరీ సాధించాడు. వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించాలంటే తప్పనిసరిగా 'సూపర్ సిక్స్' దశలో తాము ఆడే మూడు మ్యాచ్‌లు గెలవాల్సిన వెస్టిండీస్ తొలి మ్యాచ్‌లో స్కాట్లాండ్ చేతిలో ఓడిపోయి మొదటిసారి వన్డే వరల్డ్‌కప్‌నకు దూరమైంది.

# 'ఈతరం బ్రాడ్‌మన్'

**100వ టెస్టు ఆడనున్న స్టీవ్ స్మిత్ ● ఆస్ట్రేలియా తరఫున 15వ క్రికెటర్‌గా ఘనత**



2010 జూలై... లార్డ్స్ మైదానంలో ఆస్ట్రేలియా, పాకిస్తాన్ మధ్య తొలి టెస్టు మ్యాచ్. దిగ్గజ క్రికెటర్ షేన్ వార్న్ రిటైరై అప్పటికి మూడేళ్లవుతోంది. అతని స్థానాన్ని భర్తీ చేసే స్పిన్నర్ల వేట కొనసాగిస్తున్న ఆస్ట్రేలియా వేర్వేరు కొత్త ఆటగాళ్లతో ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో 21 ఏళ్ల లెగ్‌స్పిన్నర్ స్టీవెన్ స్మిత్‌కు అవకాశం కల్పించింది. బౌలింగ్‌లో 3 వికెట్లు తీసిన అతను... బ్యాటింగ్ 8వ, 9వ స్థానాల్లో బరిలోకి దిగి 1, 12 పరుగులు మాత్రమే చేశాడు. అయితే తర్వాతి రోజుల్లో అతను బౌలింగ్‌ను పక్కన పెట్టి అద్భుతమైన బ్యాటర్‌గా ఎదుగుతాడని ఎవరూ ఊహించలేకపోయారు. టెస్టు క్రికెట్‌లో ఘనమైన రికార్డులతో ఇప్పటికే ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకడిగా నిలిచిన స్మిత్ నేడు కెరీర్‌లో 100వ టెస్టు బరిలోకి దిగనుండటం విశేషం.

సాక్షి క్రీడా విభాగం

కెరీర్‌లో తొలి ఐదు టెస్టుల్లో రెండు అర్ధ సెంచరీలు సాధించినా... ఆస్ట్రేలియా టీమ్ మేనేజ్‌మెంట్ స్మిత్‌ను బ్యాటర్‌గా గుర్తించలేదు. బౌలింగ్‌లోనూ మూడు వికెట్లే తీయడంతో సహజంగానే జట్టులో స్థానం పోయింది. మళ్లీ టీమ్‌లోకి రావడానికి అతనికి రెండేళ్లు పట్టింది. 'హోంవర్క్‌గేట్' కారణంగా సీనియర్లపై వేటు పడటంతో అదృష్టవశాత్తూ మొహాలిలో భారత్‌తో జరిగిన టెస్టులో అతనికి అవకాశం దక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో 92 పరుగులు చేసిన స్మిత్ బ్యాటింగ్ విలువేమిటో అందరికీ అర్థమైంది. కెరీర్‌లో తొలి మూడు సెంచరీలు ఇంగ్లండ్‌పైనే నమోదు చేసిన స్మిత్... స్టెయిన్, మోర్కెల్, ఫిలాండర్‌ల పదునైన పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొని సెంచూరియన్‌లో దక్షిణాఫ్రికాపై సాధించిన శతకం అతని స్థానాన్ని సుస్థిరం చేసింది. ఆ తర్వాత అతను వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. 'ఇంతింతై వటుడింతై' అన్నట్లు అత్యుత్తమ ప్రదర్శనలతో దూసుకుపోయి స్మిత్ టెస్టుల్లో శిఖరానికి చేరుకున్నాడు. కెరీర్‌లో ఒకదశలో అత్యుత్తమంగా 64.81 సగటును అందుకున్న స్మిత్... డాన్ బ్రాడ్‌మన్ తర్వాత రెండో స్థానంలో నిలిచి 'ఆధునిక బ్రాడ్‌మన్' అనిపించుకున్నాడు. పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రపంచంలోనే అన్ని వేదికల్లోనూ పరుగులు సాధించగలడం స్మిత్ సాధించిన ఘనత.

**ఎదురులేని ప్రదర్శనలతో...**

2014-2018 మధ్య కాలం స్మిత్ కెరీర్‌లో అత్యుత్తమం. ఈ సమయంలో ఎన్నో అసాధారణ రికార్డులను అతను తన ఖాతాలో వేసుకున్నాడు. 79 ఇన్నింగ్స్‌లలో ఏకంగా 75.81 సగటుతో 5004 పరుగులు నమోదు చేశాడు. 2015 యాషెస్ సిరీస్‌లో 508 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన అతను ఈ సిరీస్ ముగియగానే పూర్తి స్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. భారత గడ్డపై జరిగిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో 3 సెంచరీలు సహా 499 పరుగులతో అతనే అగ్రస్థానంలో నిలిచాడు. ఈ సిరీస్‌లో కఠినమైన పుణే పిచ్‌పై ప్రతికూల పరిస్థితులను అధిగమించి రెండో ఇన్నింగ్స్‌లో స్మిత్ చేసిన శతకం టెస్టు క్రికెట్‌లో అత్యుత్తమ ప్రదర్శనల్లో ఒకటి. కొద్ది రోజులకే కెప్టెన్‌గా సొంతగడ్డపై 4-0తో యాషెస్ సిరీస్‌ను గెలిపించడంతోపాటు 687 పరుగులతో టాపర్‌గా నిలిచాడు. వరుసగా నాలుగేళ్లు వేయికి పైగా పరుగులు చేసి తన స్థాయి ఏమిటో అతను చూపించాడు. 2014లో తొలిసారి 50 బ్యాటింగ్ సగటును స్మిత్ అందుకోగా, ఇప్పటి వరకూ అది అంతకంటే తగ్గకపోవడం అతని నిలకడను చూపిస్తోంది.

**టాంపరింగ్ వివాదాన్ని దాటి...**

తెలివితేటలు, వ్యూహ చతురత, సాంకేతికాంశాలపై పట్టు స్మిత్‌ను విజయవంతమైన కెప్టెన్‌గా నిలిపాయి. అయితే ఇదే తెలివి కాస్త 'అతి'గా మారడంతో 2018 ఆరంభంలో దక్షిణాఫ్రికాతో టెస్టులో బాల్ టాంపరింగ్‌కు పాల్పడి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. ఏడాది పాటు నిషేధం కూడా పడింది. అయితే సంవత్సరం తర్వాత తిరిగొచ్చాక అతను తనలోని పాత స్మిత్‌ను మళ్లీ చూపించాడు. 2019 యాషెస్‌లో 4 టెస్టుల్లోనే ఏకంగా 774 పరుగులతో సత్తా చాటాడు. తర్వాత కొన్నాళ్లపాటు తడబాటు కనిపించినా... గత ఏడాది గాలే టెస్టులో 145 పరుగులతో ఫామ్‌లోకి వచ్చిన అతను ఇప్పటికీ అదే జోరును కొనసాగిస్తున్నాడు. తాజాగా డబ్ల్యూటీసీ ఫైనల్లో, లార్డ్స్ టెస్టులోనూ శతకాలు బాది మరిన్ని రికార్డులపై స్మిత్ గురి పెట్టాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో 99 టెస్టులు ముగిసేసరికి అత్యుత్తమ సగటు (59.56)తో నిలిచిన ఆటగాడైన స్మిత్ 32 సెంచరీలు, 37 అర్ధ సెంచరీలతో 9113 పరుగులు సాధించాడు.

నేటి నుంచి ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య మూడో 'యాషెస్' టెస్టు లీడ్స్‌లో జరగనుంది. హెడింగ్లీ మైదానంలో జరిగే ఈ పోరు కోసం ఇంగ్లండ్ ఇప్పటికే తుది జట్టును ప్రకటించింది. గత మ్యాచ్ ఆడిన పోప్, అండర్సన్, టంగ్ స్థానాల్లో వోక్స్, అలీ, వుడ్‌లను ఎంపిక చేశారు. సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లు నెగ్గిన ఆస్ట్రేలియా 2-0తో ఆధిక్యంలో ఉంది.

మధ్యాహ్నం గం. 3:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను 'సోనీ నెట్‌వర్క్'లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

# భారత టి20 జట్టులో తిలక్ వర్మ

**వెస్టిండీస్‌తో సిరీస్‌కు ఎంపికైన హైదరాబాద్ క్రికెటర్ ● కోహ్లి, రోహిత్ శర్మకు విశ్రాంతి**



న్యూఢిల్లీ: గత రెండు ఐపీఎల్ సీజన్‌లలో ముంబై ఇండియన్స్ జట్టు తరఫున నిలకడగా రాణించిన హైదరాబాద్ యువ క్రికెటర్ నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ తొలిసారి భారత టి20 జట్టులోకి ఎంపికయ్యాడు. వెస్టిండీస్ జట్టుతో వచ్చే నెలలో జరిగే ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాల్గొనే 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బుధవారం రాత్రి బీసీసీఐ ప్రకటించింది. 20 ఏళ్ల తిలక్ వర్మ 2022 ఐపీఎల్‌లో 14 మ్యాచ్‌లు ఆడి 131.02 స్ట్రయిక్‌రేట్‌తో 397 పరుగులు చేశాడు. ఇందులో రెండు అర్ధ సెంచరీలున్నాయి. 2023 ఐపీఎల్‌లో తిలక్ 11 మ్యాచ్‌లు ఆడి 164.11 స్ట్రయిక్‌రేట్‌తో 343 పరుగులు సాధించాడు. ఐపీఎల్, దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో కలిపి ఓవరాల్‌గా తిలక్ ఇప్పటి వరకు 47 మ్యాచ్‌లు ఆడి 142.51 స్ట్రయిక్‌రేట్‌తో 1,418 పరుగులు చేశాడు. తిలక్ ఖాతాలో మొత్తం పది అర్ధ సెంచరీలున్నాయి.

మరోవైపు సీనియర్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలకు వెస్టిండీస్ సిరీస్‌కు విశ్రాంతి ఇవ్వగా... హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా, సూర్యకుమార్ యాదవ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. ఐపీఎల్ టోర్నీలో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున పలు మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికీ ఉత్తరప్రదేశ్ డాషింగ్ క్రికెటర్ రింకూ సింగ్ జాతీయ జట్టుకు ఎంపిక కాలేకపోయాడు. భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య ఐదు టి20 మ్యాచ్‌లు ఆగస్టు 3న (ట్రినిడాడ్), 6న, 8న (గయానా), 12న, 13న (ఫ్లోరిడా) జరుగుతాయి.

**భారత టి20 జట్టు:** హార్దిక్ పాండ్యా (కెప్టెన్), సూర్యకుమార్ యాదవ్ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్, శుబ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, తిలక్ వర్మ, సంజూ సామ్సన్, అక్షర్ పటేల్, యజువేంద్ర చహల్, కుల్దీప్ యాదవ్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, ఉమ్రాన్ మాలిక్, అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్.

## నార్త్‌జోన్ 198 ఆలౌట్

బెంగళూరు: సౌత్ జోన్ జట్టుతో బుధవారం ఆరంభమైన దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో నార్త్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 58.3 ఓవర్లలో 198 పరుగులకే ఆలౌటైంది. సౌత్‌జోన్ పేసర్లు విద్వత్ కావేరప్ప (5/28), శశికాంత్ (2/52) నార్త్ జోన్‌ను హడలెత్తించారు. ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (49; 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. అనంతరం తొలిరోజు ఆటనిలిచే సమయానికి సౌత్‌జోన్ 17 ఓవర్లలో 4 వికెట్లకు 63 పరుగులు చేసింది. మయాంక్ అగర్వాల్ (37 బ్యాటింగ్; 4 ఫోర్లు), తిలక్‌వర్మ (12 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. కెప్టెన్ హనుమ విహారి (0), రికీ భుయ్ (0) డకౌటయ్యారు. హర్షిత్, బల్తేజ్ చెరో 2 వికెట్లు తీశారు. సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న మరో సెమీస్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్‌జోన్ 90 ఓవర్లలో 8 వికెట్లకు 216 పరుగులు చేసింది. పృథ్వీ షా (26; 4 ఫోర్లు), పుజారా (28; 3 ఫోర్లు) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. శివమ్ మావికి 4 వికెట్లు దక్కాయి.



విద్వత్

## స్వియాటెక్ సులువుగా...

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) మూడో రౌండ్‌లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో స్వియాటెక్ 6-2, 6-0తో సారా సొరిబెస్ టోర్మో (స్పెయిన్)పై గెలిచింది. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో స్వియాటెక్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. 11వ సీడ్ కసత్‌కినా (రష్యా) కూడా మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. కసత్‌కినా 6-0, 6-2 తో జోడీ బరేజ్ (బ్రిటన్)పై గెలిచింది. మరోవైపు మార్టా కోస్టిక్ (ఉక్రెయిన్) తొలి రౌండ్‌లో 0-6, 7-5, 6-2తో ఎనిమిదో సీడ్ మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) తొలి రౌండ్‌లో 7-5, 6-4, 6-3తో ఆర్థర్ ఫెరీ (బ్రిటన్)పై గెలిచాడు. ఆరో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్), తొమ్మిదో సీడ్ ఫ్రిట్జ్ (అమెరికా), పదో సీడ్ టియాఫో (అమెరికా) కూడా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు.



స్వియాటెక్

# సినిమా

"రంగబలి' మంచి మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్. ఈ సినిమా చూస్తున్నంతసేపు సొంత ఊరు గుర్తొస్తుంది. ఆ ఊరిని మిస్ అవుతున్నామనే ఫీలింగ్ కలిగి ఓసారి ఊరెళ్లి వద్దామనే ఆలోచన కలుగుతుంది" అని హీరో నాగశౌర్య అన్నారు. పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో నాగశౌర్య, యుక్తి తరేజ జంటగా నటించిన చిత్రం 'రంగబలి'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలకానుంది. ఈ సందర్భంగా నాగశౌర్య చెప్పిన విశేషాలు.

## సినిమా చూశాకే ప్రమోట్ చేస్తానన్నా!

- నాగశౌర్య



● నాగశౌర్య

● నటుడికి దర్శకుడు స్పేస్ ఇవ్వాలి. ఆ స్పేస్‌ని పవన్ నాకు ఇచ్చాడు. దర్శకునిగా తనకు తొలి సినిమా కాబట్టి ఏ విషయంలోనూ ఒత్తిడి తీసుకోవద్దని, ఏ సాయం కావాలన్నా చేస్తానని ముందే చెప్పాను. నా అనుభవాన్ని, పవన్ విజన్‌ని జోడించి అనుకున్నది అనుకున్నట్లుగా 'రంగబలి' లాంటి ఓ మంచి సినిమా తీశాం. ● 'రంగబలి' ప్రివ్యూ చూశాకే ప్రమోషన్స్ స్టార్ట్ చేస్తానని దర్శక-నిర్మాతలకు చెప్పాను. చూసిన తర్వాత చాలా మంచి మూవీ చేశామనే అనుభూతి కలిగింది. అందుకే సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని ప్రేక్షకులకు నమ్మకంగా చెప్పగలుగుతున్నాను. సుధాకర్‌గారు ఎక్కడా రాజీ పడకుండా 'రంగబలి' తీశారు. ఈ మూవీతో పవన్‌కి మంచి పేరొస్తుంది. యుక్తి తరేజ మంచి యాక్టర్ అండ్ డ్యాన్సర్. తెలుగులో లీడింగ్ హీరోయిన్ అయ్యే అవకాశాలు తనకు చాలా ఉన్నాయి. పవన్ సంగీతం, నేపథ్య సంగీతాన్ని ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు. ● ఇప్పుడున్న పోటీలో హీరోలందరూ అద్భుతమైన నటన, డ్యాన్స్, యాక్షన్ చేస్తున్నారు. ఇలాంటి సమయంలో నేనూ ది బెస్ట్ ఇవ్వాలి. ఈ క్రమంలో ఒక్కోసారి గాయాలవుతాయి. కష్టపడితేనే సక్సెస్ వస్తుంది. ● ఏ ప్రొడక్షన్ హౌస్‌లోనైనా పది హిట్స్ పడిన తర్వాత కూడా ఒక సినిమా నిరాశ పరిస్తే దాన్ని రికవర్ చేయడం అంత తేలిక కాదు. సినిమా అంటే మాకు పిచ్చి.. ప్యాషన్‌తోనే మా ఐరా క్రియేషన్స్ బ్యానర్‌లో సినిమాలు నిర్మిస్తున్నాం తప్ప డబ్బులు సంపాదించుకోవాలని కాదు. మాకు సినిమా తప్పితే వేరేది తెలియదు. ప్రస్తుతానికి దర్శకత్వం ఆలోచన లేదు. నేను నటిస్తున్న 24వ సినిమా షూటింగ్ స్టార్ట్ అయ్యింది.

## సినిమా బాగుంటే చాలు...

- అజయ్ సామ్రాట్



"యమదొంగ' సినిమాలో మమతా మోహన్ దాస్‌గారి నటనంటే నాకు ఇష్టం. ఆమె క్యాన్సర్ నుంచి కోలుకోవడంతో 'రుద్రంగి'లో నటించమని కోరాను. 'పదేళ్ల నుంచి ఒక్క ఫోన్ కాల్ కూడా రాలేదు.. నన్ను సంప్రదించినందుకు థ్యాంక్స్' అన్నారామె'' అని డైరెక్టర్ అజయ్ సామ్రాట్ అన్నారు. జగపతిబాబు, ఆశిష్ గాంధీ, మమతా మోహన్ దాస్, విమలా రామన్, గానవి లక్ష్మణ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రుద్రంగి'. అజయ్ సామ్రాట్ దర్శకత్వంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో అజయ్ సామ్రాట్ మాట్లాడుతూ– ''బాహుబలి, రాజన్న' సినిమాలకు డైలాగ్ రైటర్‌గా చేశాను. ఇక నా బాల్యంలో విన్న కథలు, చూసిన పరిస్థితులు, చదివిన చరిత్ర నుంచి 'రుద్రంగి' కథ రాసుకున్నాను. తెలంగాణలో దొరల అణచివేతల మీద ఇప్పటికే చాలా సినిమాలు వచ్చాయి. కానీ, 'రుద్రంగి'ని పూర్తి భిన్నంగా ఫ్యామిలీ ఎమోషనల్, సోషల్ డ్రామాగా తీశాను. రసమయిగారికి సినిమా తీయాలనే తపన ఎక్కువగా ఉంది.. నిర్మాతగా ఆయన ఏం చేయగలడో అన్నీ చేశారు. సినిమా బాగుంటే జనాలు చూస్తారు. 'కాంతారా'కి ప్రమోషన్స్ కూడా పెద్దగా చేయలేదు. కానీ, జనాలు విపరీతంగా చూశారు. మా 'రుద్రంగి' కూడా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

## కొత్త కబురు

కొత్త సినిమా కబురు చెప్పారు హీరో కల్యాణ్‌రామ్. ఆయన హీరోగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ఓ యాక్షన్ ఫిల్మ్ రూపొందనుంది. జూలై 5న (బుధవారం) కల్యాణ్‌రామ్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రకటించారు. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ సినిమాను నిర్మించనున్నారు. ''కల్యాణ్ రామ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందనున్న సినిమా ఇది. అవుట్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



● 'డెవిల్' లో కల్యాణ్ రామ్

**గూఢచారి లక్షణం అదే!**

''మనసులో ఉన్న భావన ముఖంలో తెలియకూడదు. మెదడులో ఉన్న ఆలోచన మాటల్లో బయట పడకూడదు. అదే గూఢచారికి ఉండవలసిన ముఖ్యమైన లక్షణం'' అని కల్యాణ్ రామ్ చెప్పిన డైలాగ్స్‌తో 'డెవిల్' గ్లింప్స్ విడుదలైంది. కల్యాణ్ రామ్ హీరోగా నవీన్ మేడారం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. దేవాన్ష్ నామా సమర్పణలో అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు.



● సమంత

## లాంగ్ బ్రేక్

దాదాపు దశాబ్దానికి పైగా సినిమాలతో బిజీగా ఉంటున్న సమంత వ్యక్తిగత, ఆరోగ్య కారణాల దృష్ట్యా కొంతకాలం బ్రేక్ తీసుకోవాలని అనుకుంటున్నారు. ఈ కారణంగానే ఇటీవల కాలంలో ఏ కొత్త సినిమాకు సమంత సైన్ చేయలేదని సమాచారం. ఇప్పటికే కొత్త ప్రాజెక్ట్స్ కోసం తీసుకున్న అడ్వాన్స్‌ని ఆయా నిర్మాతలకు తిరిగి ఇవ్వాలనే ఆలోచనలో సమంత ఉన్నారని భోగట్టా. ఇక గత ఏడాది మయోసైటిస్ అనే వ్యాధితో తాను బాధపడుతున్నానని సమంత వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ వ్యాధి నుంచి కోలుకున్నాక సమంత కొన్ని సినిమా షూటింగ్స్‌లో పాల్గొన్నారు. ప్రస్తుతం సమంత చేతిలో 'ఖుషి', ఇండియన్ వెర్షన్ 'సిటాడెల్' వెబ్ సిరీస్ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. మూడు రోజుల్లో 'ఖుషి' పూర్తవుతుంది. 'సిటాడెల్' షూటింగ్ పూర్తి కావచ్చింది. ఇక ఆ తర్వాత సమంత ఏడాది పాటు బ్రేక్‌లో ఉండాలనుకుంటున్నారు. ఈ బ్రేక్‌ని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి, అదనపు చికిత్సకు కేటాయించాలనుకుంటున్నారట.

## ఆయనే పిలిచి చాన్స్ ఇవ్వాలనుకుంటున్నా!

- శ్రీ సింహా

''ప్రేక్షకులకు సందేశం ఇవ్వాలనో, భావోద్వేగాలతో ఏడిపించాలనో 'భాగ్ సాలే' సినిమా తీయలేదు. ప్రేక్షకులు రెండు గంటల పాటు థియేటర్లో నవ్వుకోవాలని తీశాం'' అని హీరో శ్రీ సింహా కోడూరి అన్నారు. ప్రణీత్ బ్రహ్మాండపల్లి దర్శకత్వంలో శ్రీ సింహా కోడూరి, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'భాగ్ సాలే'. అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కల్యాణ్ సింగనమల నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజ్ అవుతోంది.

ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో శ్రీ సింహా మాట్లాడుతూ–''భాగ్ సాలే' కథని ప్రణీత్ ఎప్పుడో చెప్పాడు. కానీ, 'తెల్లవారితే గురువారం, దొంగలున్నారు జాగ్రత్త, ఉస్తాద్' సినిమాల కమిట్‌మెంట్స్ వల్ల 'భాగ్ సాలే' ఆలస్యం అయింది. ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ వల్ల లాభాలు, నష్టాలుంటాయి. కథల ఎంపిక అనేది పూర్తిగా నా నిర్ణయమే. నాకు స్క్రిప్ట్ విషయంలో ఏదైనా డౌట్ వస్తే నాన్న (కీరవాణి), బాబాయ్ (రాజమౌళి) సలహాలు తీసుకుంటాను. 'భాగ్ సాలే' బడ్జెట్ ఎక్కువైనా నిర్మాతలు రాజీ పడలేదు. 'రంగస్థలం' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసిన అనుభవం నాకు యాక్టింగ్‌లో ఉపయోగపడింది. రాజమౌళిగారితో సినిమా చేయాలనేది అందరికీ ఓ కల. అలాగని ఆయన్ను నేను ఛాన్స్ అడగలేను. నేనింకా చాలా నేర్చుకోవాలి. ఆ తర్వాత ఆయనే పిలిచి నాకు అవకాశం ఇవ్వాలి. ప్రస్తుతం 'ఉస్తాద్' సినిమా చేస్తున్నాను'' అన్నారు.



## నా నమ్మకం నిజమైంది

- శ్రీ విష్ణు



● శ్రీవిష్ణు, రాజేష్, రెబా మోనికా జాన్, అనిల్ సుంకర

''సామజ వరగమన' కథని రామ్ చెప్పినప్పుడే 'నువ్వు నాకు నచ్చావ్' లాంటి సినిమా అవుతుందని నమ్మాను. నా నమ్మకం నిజమైంది. 'సామజ వరగమన' చూసి అందరూ హాయిగా నవ్వుతున్నారు'' అని హీరో శ్రీ విష్ణు అన్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో శ్రీ విష్ణు, రెబా మోనికా జాన్ జంటగా రూపొందిన చిత్రం 'సామజ వరగమన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ సినిమా జూన్ 29న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో శ్రీ విష్ణు మాట్లాడుతూ– ''ఈ సినిమా ట్రైలర్ లాంచ్ టైమ్‌లో చిరంజీవిగారి చేయి నా గుండె మీద ఎప్పుడైతే ఆటోగ్రాఫ్‌గా పడిందో అప్పటి నుంచి ఈ సినిమా జాతకం మారిపోయింది'' అన్నారు. ''నవ్వించడం అంత తేలిక కాదు. ఆ విషయంలో వెంకటేశ్‌గారు సీనియర్ మోస్ట్. ఆ ప్లేస్‌కి ఇప్పుడు శ్రీవిష్ణు యాప్ట్'' అన్నారు అనిల్ సుంకర. ''ఐదు రోజులుగా నిద్రపట్టడం లేదు. అంత సంతోషంగా ఉంది'' అన్నారు రాజేష్ దండా. ''అన్ని వర్గాల ప్రేక్షకులు మా సినిమాని ఎంజాయ్ చేస్తున్నారు'' అన్నారు రామ్ అబ్బరాజు. ఈ కార్యక్రమంలో దర్శకులు మెహర్ రమేష్, విజయ్ కనకమేడల, వశిష్ఠ, నటుడు వీకే నరేష్, రెబా మోనికా జాన్ మాట్లాడారు.

## పరస్పర అంగీకారంతోనే విడిపోయాం


నటి-నిర్మాత నిహారిక, చైతన్య జొన్నలగడ్డ తమ వివాహ బంధానికి ముగింపు పలికారు. ఈ సందర్భంగా నిహారిక సోషల్ మీడియాలో ఓ పోస్ట్‌ను షేర్ చేశారు. ''పరస్పర అంగీకారంతోనే నేను, చైతన్య విడిపోవాలని నిర్ణయించుకున్నాం. నాకు సపోర్ట్‌గా నిలిచిన నా కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ధన్యవాదాలు. ఈ పరిస్థితుల అనంతరం మా జీవితాల్లో మేం ముందుకు కొనసాగేందుకు కావాల్సిన ప్రైవసీని ఇవ్వాలని కోరుకుంటున్నాను'' అంటూ ఆ పోస్ట్‌లో నిహారిక పేర్కొన్నారు. ఇదే తరహా పోస్ట్‌ను చైతన్య కూడా సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇక 2020 డిసెంబరులో చైతన్య, నిహారిక వివాహం జరిగింది. కాగా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ఫ్యామిలీ కోర్టులో గత నెల 5న నిహారిక, చైతన్యలకు విడాకులు మంజూరు అయ్యాయి.



● నిహారిక కొణిదెల

## సెప్టెంబర్‌లో ప్రజాకవి కాళోజీ


తెలంగాణకు చెందిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణ రావు జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో విజయలక్ష్మీ జైనీ నిర్మించిన ఈ చిత్రంలో కాళోజీగా మూలవిరాట్ నటించారు. సెప్టెంబర్ 9న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ– ''కాళోజీగారి కుటుంబ సభ్యులతో పాటు ఈ సినిమా చూసినవారంతా మూల విరాట్‌ని చూసి, కాళోజీయే తమ కళ్ల ముందు నడయాడుతున్నట్లు అనిపించిందన్నారు. కాళోజీగారు తిరిగిన ప్రదేశాల్లో, ఆయన నివసించిన ఇంట్లోనూ సన్నివేశాలు తీశాం. కాళోజీగారు వాడిన కళ్లజోడు, చేతి కర్రను ఆయన కుటుంబ సభ్యుల అనుమతితో ఉపయోగించాం'' అన్నారు. కాళోజీ సినిమా పనులు పూర్తి కావడంతో స్వాతి వారపత్రిక అధినేత వేమూరి బలరామ్ బయోపిక్ పనుల్లో బిజీగా ఉన్నారు ప్రభాకర్ జైనీ.



● మూల విరాట్

## జీనీ షురూ

'జయం' రవి హీరోగా 'జీనీ' సినిమా షురూ అయింది. అర్జునన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కృతీ శెట్టి, కల్యాణీ ప్రియదర్శన్, వామికా గబ్బి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డా.ఐసరి కె.గణేష్ నిర్మిస్తున్న ఈ సినిమా బుధవారం చెన్నైలో ప్రారంభమైంది. ''వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌లో రూపొందుతోన్న 25వ సినిమా 'జీనీ'. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమా తమిళ్, తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ అవుతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. దేవయాని కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మహేష్ ముత్తుస్వామి, సంగీతం: ఏఆర్ రెహమాన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కె.అశ్విన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కేఆర్ ప్రభు.



● కల్యాణి, కృతిశెట్టి, వామిక, రవి

| స్టాక్‌ మార్కెట్లు | | |
|---|---|---|
| దేశీ సూచీలు | | |
| సెన్సెక్స్ ▽ | 33 | 65,446 |
| నిఫ్టీ △ | 10 | 19,399 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 13,808 | ▽ | 9 |
| డోజోన్స్ | 34,296 | ▽ | 123 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,442 | ▽ | 1 |
| డాక్స్ | 15,938 | ▽ | 102 |
| షాంఘై | 3,223 | ▽ | 22 |
| నికాయ్ | 33,339 | ▽ | 84 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

| బులియన్ (రూ.లలో) ముంబై | | | |
|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్) | 58,631 | △ | 109 |
| బంగారం (22 క్యారెట్) | 58,396 | △ | 108 |
| వెండి (కిలో) | 69,699 | ▽ | 250 |



# భారత్‌లో ట్రయంఫ్ కొత్త బైక్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రీమియం బైక్స్ తయారీలో ఉన్న బ్రిటిష్ కంపెనీ ట్రయంఫ్ తాజాగా భారత మార్కెట్లో రెండు కొత్త మోడళ్లను విడుదల చేసింది. ట్రయంఫ్ స్పీడ్ 400, స్క్రాంబ్లర్ 400 ఎక్స్ వీటిలో ఉన్నాయి. బజాజ్ ఆటో, ట్రయంఫ్ సంయుక్తంగా ఈ రెండు మోడళ్లను అభివృద్ధి చేశాయి. 2017లో ఇరు సంస్థలు భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఎక్స్‌షోరూంలో ట్రయంఫ్ స్పీడ్ 400 ధర రూ.2.23 లక్షలు ఉంది. ఈ నెల నుంచే లభిస్తుంది. స్క్రాంబ్లర్ 400 ఎక్స్ ధర ఇంకా ప్రకటించలేదు. అక్టోబర్ నుంచి ఈ మోడల్ డెలివరీలు ఉంటాయి. పెద్ద ఎత్తున అమ్మకాలను ఆశిస్తున్నట్టు బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ ఈ సందర్భంగా తెలిపారు. మహారాష్ట్ర పుణే సమీపంలోని చకన్ వద్ద ఉన్న కొత్త ప్లాంటులో ఈ బైక్స్ తయారు చేస్తామన్నారు. 2024 మార్చి నాటికి 80 నగరాలు, పట్టణాల్లో ట్రయంఫ్ వరల్డ్ షోరూంలు 100కుపైగా రానున్నాయి.

## పీకేహెచ్ వెంచర్స్ ఐపీవో వెనక్కి



న్యూఢిల్లీ: నిర్మాణం, ఆతిథ్య రంగ కంపెనీ పీకేహెచ్ వెంచర్స్ పబ్లిక్ ఇష్యూ ప్రక్రియను ఉపసంహరించుకుంది. మూడు రోజుల గడువులో ఇన్వెస్టర్ల నుంచి తగిన స్పందన లభించకపోవడంతో ఇష్యూని వెనక్కి తీసుకుంది. చివరి రోజు మంగళవారాని(4)కల్లా కేవలం 65 శాతం సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. కంపెనీ 2,56,32,000 షేర్లు విక్రయానికి ఉంచగా.. 1,67,25,800 షేర్లకు మాత్రమే బిడ్స్ దాఖలయ్యాయి. షేరుకి రూ. 140–148 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 379 కోట్లు సమీకరించాలని ప్రణాళికలు వేసిన విషయం విదితమే.

# మారుతీ ఖరీదైన కారు ఇన్విక్టో

**ధర రూ. 24.8 లక్షల నుంచి ప్రారంభం**

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ తాజాగా భారత మార్కెట్లో ప్రీమియం మల్టీ పర్పస్ వెహికల్ ఇన్విక్టో మోడల్‌ను విడుదల చేసింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.24.8 లక్షల నుంచి ప్రారంభం. కస్టమర్లు 7 లేదా 8 సీట్ల మోడల్‌ను ఎంచుకోవచ్చు. రెండు వేరియంట్లలో లభిస్తుంది. ఇందులోని ఇంటెలిజెంట్ ఎలక్ట్రిక్ హైబ్రిడ్ సిస్టమ్ డ్రైవింగ్‌నుబట్టి ప్యూర్ ఎలక్ట్రిక్, పెట్రోల్ మోడ్, హైబ్రిడ్ మోడ్‌కు దానంతట అదే మారుతుంది. ఇన్–బిల్ట్ కనెక్ట్ వ్యవస్థతో స్మార్ట్‌వాచ్‌ను కారుకు అనుసంధానించవచ్చు. ఆరు ఎయిర్ బ్యాగ్స్, స్పీడ్ వార్నింగ్ బజర్, స్పీడ్ సెన్సింగ్ ఆటో డోర్ లాక్ వంటి భద్రతా ఫీచర్లను జోడించారు. స్ట్రాంగ్ హైబ్రిడ్ టెక్నాలజీతో 2.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్ పొందుపరిచారు. మైలేజీ లీటరుకు 23.24 కిలోమీటర్లు ఇస్తుందని కంపెనీ ప్రకటించింది.

**ఖరీదైన విభాగంలోకి..**

ఇన్విక్టో చేరికతో మారుతీ సుజుకీ ఇండియా రూ.20 లక్షలకుపైగా ఖరీదు చేసే వాహన విభాగంలోకి ఎంట్రీ ఇచ్చినట్టు అయింది. ప్రస్తుతం ఎంపీవీ విభాగంలో కంపెనీ వాటా సుమారు 50 శాతం ఉంది. ఇన్విక్టో రాకతో ఈ వాటా మరింత అధికం అవుతుందని సంస్థ ధీమాగా ఉంది. మూడు వరుసల్లో సీట్లు ఉండే ఎస్‌యూవీ మాదిరి ప్రీమియం వాహనం కోరుకునే కస్టమర్ల కోసం దీనిని తీర్చిదిద్దినట్టు మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాటీ టాకేయూచీ ఈ సందర్భంగా తెలిపారు. కాగా, అంతర్జాతీయ భాగస్వామ్యంలో భాగంగా ఈ స్ట్రాంగ్ హైబ్రిడ్ మోడల్‌ను టయోటా కిర్లోస్కర్ మోటార్ నుంచి సుజుకీ కొనుగోలు చేయనుంది. టయోటా ఇప్పటికే భారత్‌లో ఇన్నోవా హైక్రాస్‌ను దేశీయ మార్కెట్లో విక్రయిస్తోంది. ఇదే కారుకు డిజైన్‌తోపాటు పలు మార్పులు చేసి మారుతీ సుజుకీ ఇండియాకు సరఫరా చేస్తుంది.




## జూన్‌లో సేవల వేగం డౌన్!

**58.5కు పీఎంఐ సూచీ**



న్యూఢిల్లీ: భారత్ మొత్తం స్థూల దేశీయోత్పత్తిలో మెజారిటీ వాటా కలిగిన సేవల రంగం వేగం మేతో పోల్చితే జూన్‌లో కొంత మందగించింది. మేలో 61.2 వద్ద ఉన్న ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్, జూన్‌లో 58.5కు తగ్గింది. అయితే ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా పరిగణించడం జరుగుతుంది. ఈ ప్రాతిపదికన సూచీ 50పైన కొనసాగడం వరుసగా 23వ నెల. సూచీ తాజా సమీక్షా నెల్లో కొంత మందగించినప్పటికీ, వ్యవస్థలో డిమాండ్, కొత్త వ్యాపార పరిమాణాలు, ఉపాధి కల్పనకు సంబంధించి సానుకూల వాతావరణమే ఉన్నట్లు ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనమిక్స్ విభాగ అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు.

**తయారీ, సేవలు కలిపితే...**

తయారీ, సేవల రంగాలు కలిపిన ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ జూన్‌లో 61.6 వద్ద ఉంటే, మేలో 59.4కు తగ్గింది. ఈ సూచీ కూడా వృద్ధి ధోరణిలోనే పటిష్టంగా ఉన్నట్లు పోలీయానా డీ లిమా తెలిపారు. భారత పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 70% వాటా కలిగిన ఒక్క తయారీ రంగాన్ని చూస్తే, మేలో 31 నెలల గరిష్ట 58.7 స్థాయిని చూసిన ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ జూన్‌లో 57.8కి తగ్గింది. 400 తయారీ సంస్థల పర్చేజింగ్ మేనేజర్లకు పంపిన సమాధానాల ప్రాతిపదికన కదలికలు ఉంటాయి.

# గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ

- రికార్డుల ర్యాలీకి బ్రేక్
- మిశ్రమంగా ముగిసిన సూచీలు
- సెన్సెక్స్‌కు నష్టం, నిఫ్టీకి లాభం

ముంబై: గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణతో స్టాక్ సూచీల వరుస రికార్డు ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్ల మూడుశాతం పతనం, జూన్ దేశీయ సేవల రంగ గణాంకాలు నిరాశపరచడం సెంటిమెంట్‌ను బలహీనపరిచాయి. సెన్సెక్స్ ఉదయం 15 పాయింట్ల లాభంతో 65,494 వద్ద, నిఫ్టీ 17 పాయింట్లు పెరిగి 19,406 వద్ద మొదలయ్యాయి. ప్రారంభం నుంచీ తీవ్ర ఒడిదుడుకులకు లోనైన సూచీలు ట్రేడింగ్‌లో నష్టాలు చవిచూశాయి. ఆర్థిక, టెలికం, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఒక దశలో సెన్సెక్స్ 223 పాయింట్లు క్షీణించి 65,256 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ 49 పాయింట్లు పతనమై 19,340 స్థాయికి దిగివచ్చింది. ఆఖరి ఎఫ్‌ఎంసీజీ, ఆటో, ఇంధన, వినిమయ, విద్యుత్, సర్వీసుల రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో సూచీలు దాదాపు నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. చివరికి సెన్సెక్స్ 33 పాయింట్లు నష్టపోయి 65,446 వద్ద స్థిరపడింది. నిఫ్టీ పది పాయింట్లు స్వల్పంగా పెరిగి 19,399 వద్ద నిలిచింది. బెంచ్‌మార్క్ సూచీలు మిశ్రమంగా ముగిసినా.., మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు వరుసగా 0.68%, 0.62% లాభపడ్డాయి. ఈక్విటీ మార్కెట్‌లో లాభాల స్వీకరణ,



స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించలేకపోవడంతో ఫారెక్స్ మార్కెట్లో రూపాయి పతనాన్ని చవిచూసింది. డాలర్ మారకంలో 24 పైసలు క్షీణించి 82.25 స్థాయి వద్ద స్థిరపడింది చైనా, అమెరికాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తెరపైకి రావడం, ఎఫ్‌ఓఎంసీ మినిట్స్(బుధవారం రాత్రి) వెల్లడికి ముందు అప్రమత్తత పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ అవుతున్నాయి.

**మార్కెట్లో మరిన్ని సంగతులు**

- నష్టాల మార్కెట్లో మారుతీ షేరు పరుగులు పెట్టింది. 4 శాతం ర్యాలీ చేసి రూ.10,037 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివరికి 3.61% శాతం పెరిగి రూ.9,994.50 వద్ద స్థిరపడింది. మార్కెట్ విలువ ఒక్కరోజులోనే రూ.10,520 కోట్లు పెరిగి మొత్తం రూ.3.01 లక్షల కోట్లకు చేరింది.
- స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్ల తయారీ సంస్థ జీనస్ పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ షేరు బీఎస్‌ఈలో 20% ఎగసి రూ.169 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. సింగపూర్ సవరిన్ వెల్త్ ఫండ్ జీఐసీ 74 శాతం వాటాను రూ.16వేల కోట్లకు దక్కించుకుందనే వార్తలు ఈ షేరుకు డిమాండ్ పెంచాయి.

**ఇన్వెస్టర్ల సంపద**

**@ రూ.300 లక్షల కోట్లు**

ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ తొలిసారిగా రూ.300 లక్షల కోట్లు దాటింది. అయితే గరిష్ట స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో రూ.300 లక్షల కోట్ల మార్కు నుంచి వెనక్కి వచ్చింది. మార్కెట్ ముగిసేసరికి రూ.299.90 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. ఇటీవల స్టాక్ మార్కెట్ రికార్డు స్థాయి ర్యాలీ చేస్తుండటంతో ఇన్వెస్టర్ల సంపద అమాంతం పెరుగుతూ వస్తోంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ విషయంలో అమెరికా, చైనా, జపాన్, హాంగ్‌కాంగ్ దేశాల తరువాత భారత్ అయిదో స్థానంలో ఉంది.

| మార్కెట్ క్యాప్ | అందుకున్న తేదీ |
|---|---|
| రూ.10 లక్షల కోట్లు | సెప్టెంబర్ 2003 |
| రూ.25 లక్షల కోట్లు | డిసెంబర్ 2005 |
| రూ.50 లక్షల కోట్లు | సెప్టెంబర్ 2007 |
| రూ.100 లక్షల కోట్లు | డిసెంబర్ 2014 |
| రూ.200 లక్షల కోట్లు | ఫిబ్రవరి 2021 |
| రూ.300 లక్షల కోట్లు | జూలై 2023 |

- హోండా మోటార్స్ అనుబంధ సంస్థ యచియో ఇండస్ట్రీలో 81 శాతం వాటాను చేజిక్కించుకుంటామని ప్రకటించడంతో సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ షేరు ఆరుశాతానికి లాభపడి రూ.90 వద్ద స్థిరపడింది.

# ఈసారి రూ. 2 వేల కోట్ల బుకింగ్స్

- 2023–24లో రామ్‌కీ ఎస్టేట్స్ లక్ష్యం
- సంస్థ ఎండీ నంద కిషోర్ వెల్లడి
- త్వరలో వేర్‌హౌసింగ్‌లోకి ఎంట్రీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రియల్ ఎస్టేట్ దిగ్గజం రామ్‌కీ ఎస్టేట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023–24) రూ. 2,000 కోట్ల విలువ చేసే బుకింగ్స్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది ఇది సుమారు రూ. 1,200 కోట్లుగా ఉంది. అలాగే వేర్‌హౌసింగ్ విభాగంలోకి కూడా ప్రవేశించడంపై సంస్థ దృష్టి పెడుతోంది. బుధవారమిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో రామ్‌కీ ఎస్టేట్స్ ఎండీ ఎం నంద కిషోర్ ఈ విషయాలు తెలిపారు. సంస్థ ఇప్పటివరకు రూ. 3,500 కోట్ల పైచిలుకు విలువ చేసే 27 ప్రాజెక్టులను పూర్తి చేయగా, 15 మిలియన్ చ.అ. విస్తీర్ణంతో దాదాపు రూ. 10,000 కోట్ల విలువ చేసే 15 ప్రాజెక్టుల పనులు ప్రస్తుతం కొనసాగుతున్నట్లు వివరించారు. కొత్తగా మరో రూ. 3,600 కోట్ల విలువ చేసే ప్రాజెక్టులపై కసరత్తు జరుగుతోందని పేర్కొన్నారు. మారుతున్న కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా 'కమ్యూనిటీ లివింగ్' కాన్సెప్ట్‌కు పెద్దపీట వేస్తూ ప్రాజెక్టులను రూపొందిస్తున్నట్లు వివరించారు. మరోవైపు, వచ్చే 3–4 ఏళ్లలో వేర్‌హౌసింగ్ విభాగంలోకి కూడా ప్రవేశించనున్నట్లు నంద కిషోర్ చెప్పారు. తొలుత 15 మిలియన్ చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. వడ్డీరేట్ల హెచ్చుతగ్గుల ప్రభావంతో సంబంధం లేకుండా నివాస గృహాలకు డిమాండ్ ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. సంస్థ దగ్గర దాదాపు రూ.6,500 కోట్ల విలువ చేసే 1,000 ఎకరాల స్థలం ఉన్నట్లు డైరెక్టర్ తారక రాజేశ్ దాసరి చెప్పారు.

**రామ్‌కీవర్స్ ఆవిష్కరణ..:** ప్రాపర్టీ కొనుగోళ్లకు సంబంధించి కస్టమర్లు ఎంపిక చేసుకునే ప్రక్రియను సులభతరం చేసేలా రామ్‌కీ ఎస్టేట్స్ అత్యాధునిక టెక్నాలజీని తీసుకొచ్చింది. 'రామ్‌కీవర్స్'ను ఆవిష్కరించింది. దీనితో ప్రాజెక్టును చూసేందుకు, వివరాలు తెలుసుకునేందుకు కస్టమర్లు ప్రత్యేకంగా రావాల్సిన అవసరం లేకుండా, సౌకర్యంగా ఇంటి దగ్గర్నుంచే వర్చువల్ టూర్ చేయొచ్చని .. సేల్స్ సిబ్బందితో కూడా మాట్లాడవచ్చని సంస్థ వైస్ ప్రెసిడెంట్ శరత్ బాబు తెలిపారు.

## 'లాయిడ్స్' సీఈవోగా శిరీష ఓరుగంటి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫైనాన్షియల్ సర్వీసుల్లో ఉన్న యూకే సంస్థ లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూప్ హైదరాబాద్‌లోని లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ సీఈవో, ఎండీగా శిరీష ఓరుగంటిని నియమించింది. స్థాపన, దీర్ఘకాలిక వృద్ధి వ్యూహాన్ని ఆమె పర్యవేక్షిస్తారని కంపెనీ బుధవారం ప్రకటించింది. ఇప్పటివరకు ఆమె జేసీపెన్నీ ఎండీగా, కంపెనీ బోర్డ్ మెంబర్‌గా పనిచేశారు. పలు అంతర్జాతీయ సంస్థల్లో కీలక విధులను నిర్వర్తించారు. ఐటీ ఆర్కిటెక్చర్, డేటా ఇంజనీరింగ్, ఫిన్‌టెక్ ఆవిష్కరణలలో విస్తృత అనుభవాన్ని తీసుకు వస్తారని లాయిడ్స్ ఆశాభావం వ్యక్తం చేసింది.



# విద్య, ఉద్యోగ సమాచారం

## అస్సాం రైఫిల్స్‌లో 81 రైఫిల్స్ మ్యాన్/రైఫిల్ ఉమెన్ పోస్టులు

భారత హోంమంత్రిత్వ శాఖకు చెందిన అస్సాం రైఫిల్స్.. 2023 సంవత్సరానికి చెందిన మెరిటోరియస్ స్పోర్ట్స్ పర్సన్(అస్సాం రైఫిల్స్) స్పోర్ట్స్ కోటా ర్యాలీ నిర్వహిస్తుంది. ఈ ర్యాలీ ద్వారా రైఫిల్స్ మ్యాన్, రైఫిల్ ఉమెన్ పోస్టులు భర్తీ చేస్తోంది. అర్హులైన పురుష, మహిళా క్రీడాకారులు ఈ ర్యాలీలో పాల్గొనవచ్చు.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 81
- » **క్రీడాంశాలు:** ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, రోయింగ్, పెన్‌కాక్ సిలాట్, క్రాస్ కంట్రీ, ఆర్చరీ, బాక్సింగ్, సెపక్‌తక్రా, బ్యాడ్మింటన్.
- » **అర్హత:** మెట్రిక్యులేషన్‌తోపాటు క్రీడా అర్హతలు, నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- » **వయసు:** 01.08.2023 నాటికి 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:**వెరిఫికేషన్, డాక్యుమెంటేషన్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫీల్డ్ ట్రయల్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.07.2023.
- » **అస్సాం రైఫిల్స్ స్పోర్ట్స్ కోటా ర్యాలీ తేది:** 07.08.2023.
- » **వేదిక:** అస్సాం రైఫిల్స్ ట్రెనింగ్ సెంటర్ అండ్ స్కూల్, సుఖోవ్, నాగాలాండ్.
- » **వెబ్‌సైట్:** www.assamrifles.gov.in

## ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీలో బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు

గుంటూరు లాంలోని ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ(ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు
- » **కళాశాల:** కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్, లాం, గుంటూరు.
- » **అర్హత:** ఇంటర్మీడియట్(బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ) లేదా మూడేళ్ల డిప్లొమా(హోమ్ సైన్స్) కోర్సు ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- » **వయసు:** 31.12.2023 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ఇంటర్ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్, పరిపాలనా కార్యాలయం, ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీ, లాం, గుంటూరు చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 17.07.2023.
- » **వెబ్‌సైట్:** https://angrau.ac.in

## ఎఫ్‌సీఆర్‌ఐ, ములుగులో బీఎస్సీ ఫారెస్ట్రీ ప్రవేశాలు

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్రీ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **అర్హత:** ఇంటర్మీడియట్(పీసీబీ/పీసీఎం/పీసీఎంబీ)తో పాటు టీఎస్ ఎంసెట్–2023 ర్యాంకు సాధించి ఉండాలి.
- » **ప్రవేశ విధానం:** టీఎస్ ఎంసెట్–2023 ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు ఉంటాయి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.07.2023
- » **రూ.500 ఆలస్య రుసుముతో ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.07.2023.
- » **వెబ్‌సైట్:** www.fcrits.in

## అగ్రిసెట్ అండ్ అగ్రి ఇంజనీరింగ్ సెట్-2023

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అగ్రిసెట్ అండ్ అగ్రి ఇంజనీరింగ్ సెట్–2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలో అర్హత సాధించిన డిప్లొమా అభ్యర్థులు బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్, బీటెక్(అగ్రి ఇంజనీరింగ్) కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు.

- » **మొత్తం సీట్ల సంఖ్య:** 116
- » **అర్హత:** డిప్లొమా (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.07.2023.
- » **ఆన్‌లైన్ పరీక్ష తేది:** 26.08.2023.
- » **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

# మెడికల్ కౌన్సెలింగ్‌కు సిద్ధమా!

నీట్-యూజీ.. ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! ఇటీవల ఈ పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. తెలుగు రాష్ట్రాల నుంచి 85 వేలకు మందికి పైగా అర్హత సాధించారు. వీరందరికీ ఇప్పుడు కౌన్సెలింగ్ ప్రక్రియ ఎలా ఉంటుంది.. ఎన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయి.. ఎంత ర్యాంకు వరకు సీటు వచ్చే అవకాశం ఉంది.. ఆల్ ఇండియా కోటా అంటే ఏంటి? ఇలా అనేక సందేహాలు!! ఈ నేపథ్యంలో.. నీట్-యూజీ 2023లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఉపయోగపడేలా కౌన్సెలింగ్ తీరుతెన్నుల వివరాలు..




- **42,836:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి నీట్ యూజీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల సంఖ్య.
- **42,684:** తెలంగాణ రాష్ట్రంలో నీట్ యూజీలో అర్హత సాధించిన అభ్యర్థుల సంఖ్య.
- ఇప్పుడు ఈ విద్యార్థుల దృష్టి అంతా తదుపరి దశలో నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియపైనే.

**కన్వీనర్ కోటా**

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ ఏడాది నుంచి కొత్తగా అందుబాటులోకి రానున్న ఎంబీబీఎస్ కళాశాలలను దృష్టిలో పెట్టుకుంటే.. ఆల్ ఇండియా స్థాయిలో లక్షన్నర వరకు ర్యాంకు వచ్చిన వారికి కూడా కన్వీనర్ కోటాలో సీటు లభించే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు. అదే విధంగా జాతీయ స్థాయిలో దాదాపు 8 లక్షల ర్యాంకు వరకు ఆల్ ఇండియా కోటాలో సీటు దక్కే పరిస్థితులు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. దీనికి కారణం.. ఈ ఏడాది జాతీయ స్థాయిలోనూ మెడికల్ సీట్లు పెరగడమే. నేషనల్ మెడికల్ కమిషన్ తాజా గణాంకాల ప్రకారం–జాతీయ స్థాయిలో 695 మెడికల్ కళాశాలలు/ఇన్‌స్టిట్యూట్స్/డీమ్డ్ యూనివర్సిటీల్లో 1,06,333 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కౌన్సెలింగ్ తేదీల ఖరారు నాటికి మరి కొన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంది.

**ఏఐక్యూ, స్టేట్ కోటా**

నీట్ కౌన్సెలింగ్‌లో భాగంగా రెండు రకాల విధానాలు అమలవుతున్నాయి. ఆల్ ఇండియా కోటా(ఏఐక్యూ) పేరుతో జాతీయ స్థాయిలో, స్టేట్ కోటా పేరుతో.. ఆయా రాష్ట్రాల్లోని హెల్త్ యూనివర్సిటీలు లేదా సంబంధిత అధికార వర్గాలు కౌన్సెలింగ్ జరుపుతున్నాయి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి స్టేట్ కోటా కౌన్సెలింగ్‌ను తెలంగాణలో కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్‌లు నిర్వహించనున్నాయి.

**ఆల్ ఇండియా కోటా**

జాతీయ స్థాయిలోని మెడికల్ కళాశాలలను నేషనల్ పూల్‌లోకి తీసుకెళ్లినప్పటి నుంచి ఆల్ ఇండియా కోటా పేరుతో కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ విధానం ప్రకారం– జాతీయ స్థాయిలోని అన్ని మెడికల్, డెంటల్ కళాశాలలు, యూనివర్సిటీల్లోని 15 శాతం సీట్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ జరుపుతారు. దీనిని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని డీజీహెచ్‌ఎస్‌కు చెందిన మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ నిర్వహిస్తుంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఎంసీసీ నిర్వహించే కౌన్సెలింగ్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

- » త్వరలో ఎంబీబీఎస్, బీడీఎస్‌కు నీట్ యూజీ-2023 కౌన్సెలింగ్
- » డీజీహెచ్‌ఎస్ ద్వారా ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్
- » హెల్త్ యూనివర్సిటీల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కౌన్సెలింగ్

**స్టేట్ కోటా కౌన్సెలింగ్**

జాతీయ స్థాయిలో ఎంసీసీ కేవలం 15 శాతం సీట్లకే కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది. మిగతా 85 సీట్లను ఆయా రాష్ట్రాలు సొంత కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తాయి. తెలంగాణలో కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీలు ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నాయి. దీనిద్వారా ప్రభుత్వ కళాశాలల్లోని 85 శాతం సీట్లు(ఆల్ ఇండియా కోటాకు కేటాయించాక మిగిలిన సీట్లు),ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా పేరుతో అందుబాటులో ఉండే 50 శాతం సీట్లను.. అదే విధంగా ప్రైవేట్ కళాశాలల్లో ప్రైవేట్–బి పేరిట ఉండే 35 శాతం సీట్లు, ఎన్‌ఆర్‌ఐ కోటాగా పిలిచే 15 శాతం సీట్లు అంటే ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా పోగా మిగిలే 50 శాతం సీట్లను కూడా హెల్త్ యూనివర్సిటీలే కౌన్సెలింగ్ విధానంలో భర్తీ చేస్తాయి. ఇందుకోసం ప్రత్యేకంగా నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఇక మైనారిటీ కళాశాలల్లో అందుబాటులో ఉండే సీట్లను కూడా ఆయా వర్గాలకు చెందిన విద్యార్థులతోనే భర్తీ చేస్తారు. ఈ ప్రక్రియను కూడా హెల్త్ యూనివర్సిటీలే చేపడతాయి.

**ఏఐక్యూ.. కౌన్సెలింగ్**

- విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు ఇప్పటి నుంచే సంసిద్ధంగా ఉండాలి. జాతీయ స్థాయిలోని సీట్లకు పోటీ పడాలనుకునే విద్యార్థులు.. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ నిర్వహించే ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి.
- ఇందుకోసం నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఎంసీసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండే క్యాండిడేట్ రిజిస్ట్రేషన్ ఆప్షన్‌ను క్లిక్ చేసి.. ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకుని లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి.
- అనంతరం ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఉండే అన్ని వివరాలను నమోదు చేయాలి.
- ఆ తర్వాత అందుబాటులో ఉన్న కళాశాలలు, సీట్ల వివరాలు కనిపిస్తాయి.
- వాటికి అనుగుణంగా తమ ప్రాథమ్యాలను పేర్కొంటూ..ఆన్‌లైన్ ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తి చేయాలి. ఆ తర్వాత రౌండ్ల వారీగా సీట్ అలాట్‌మెంట్ వివరాలను వెల్లడిస్తారు.
- తొలి రౌండ్‌లో సీట్ అలాట్‌మెంట్ పొందిన అభ్యర్థులు సదరు కళాశాలలో చేరాలనుకుంటే.. నిర్దేశిత మొత్తాన్ని రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాలి. ఒకవేళ తొలి రౌండ్‌లో సీటు వచ్చిన కళాశాలలో చేరడం ఇష్టం లేకపోతే.. ఫ్రీ ఎగ్జిట్ అవకాశం అందుబాటులో ఉంది. అలాంటి అభ్యర్థులు రెండో రౌండ్ కౌన్సెలింగ్‌కు హాజరవ్వచ్చు. తొలి రౌండ్ కౌన్సెలింగ్‌లోనే సీటు లభించి ఫీజు చెల్లించిన విద్యార్థులు.. మరింత మెరుగైన సీటు కోసం తదుపరి రౌండ్‌కు హాజరయ్యే అవకాశం కూడా అందుబాటులో ఉంది.

**స్టేట్ కోటాకు ప్రత్యేక కౌన్సెలింగ్**

రాష్ట్రాల స్థాయిలో హెల్త్ యూనివర్సిటీలు నిర్వహించే స్టేట్ కోటా సీట్ల కౌన్సెలింగ్‌కు కూడా విద్యార్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఎంసీసీ కౌన్సెలింగ్ తొలి రౌండ్ ముగిసిన తర్వాత హెల్త్ యూనివర్సిటీలు ప్రత్యేకంగా నోటిఫికేషన్ విడుదల చేస్తాయి. ఈ కౌన్సెలింగ్ కూడా పలు రౌండ్లలో జరుగుతుంది. స్టేట్ కోటాకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి, వారికి వచ్చిన ఆల్ ఇండియా ర్యాంకు ఆధారంగా ముందుగా ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్‌ను ప్రకటిస్తారు. ఈ మెరిట్ లిస్ట్‌లో చోటు సాధించిన అభ్యర్థులు నిర్దేశిత రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించి.. ఆన్‌లైన్‌లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది. తదుపరి రౌండ్ల కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అవకాశం కూడా ఉంటుంది.

**అంతా ఆన్‌లైన్‌లోనే**

హెల్త్ యూనివర్సిటీలు నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది. అభ్యర్థులు నోటిఫికేషన్ వెలువడిన తర్వాత నిర్దేశించిన వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవడం, ఆ తర్వాత నీట్ ర్యాంకు సహా, ఇంటర్మీడియెట్ వరకు అన్ని అర్హతల వివరాలను పేర్కొనడం, ఆన్‌లైన్ ఛాయిస్ ఫిల్లింగ్ తప్పనిసరి.

**ప్రభుత్వ కళాశాలలకే ప్రాధాన్యం**

- నీట్ ఉత్తీర్ణత సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులు ప్రభుత్వ కళాశాలలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏఎంసీ–విశాఖపట్నం, జీఎంసీ–గుంటూరు, కాకినాడ మెడికల్ కాలేజ్, కర్నూలు మెడికల్ కళాశాలలు ముందు వరుసలో నిలుస్తున్నాయి.
- తెలంగాణలో.. ర్యాంకర్ల తొలి ప్రాధాన్యం ఉస్మానియా మెడికల్ కళాశాలకు ఉంటోంది. ఆ తర్వాత స్థానంలో గాంధీ మెడికల్ కళాశాల, కాకతీయ మెడికల్ కళాశాల, ఈఎస్‌ఐ మెడికల్ కళాశాలలు ఉంటున్నాయి.

**సిద్ధం చేసుకోవాల్సిన డాక్యుమెంట్లు**

- నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మరికొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కాబట్టి విద్యార్థులు ఇప్పటి నుంచే కౌన్సెలింగ్‌కు అవసరమైన పత్రాలు, సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోవాలి.
- నీట్ ఎంట్రన్స్ అడ్మిట్ కార్డ్, నీట్ ర్యాంక్ కార్డ్, పుట్టిన తేదీ ధ్రువపత్రం, పదో తరగతి సర్టిఫికెట్, ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు మార్క్ షీట్, సర్టిఫికెట్, ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు స్టడీ సర్టిఫికెట్స్(స్థానికతను నిర్ధారించేందుకు), పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు ఎనిమిది తదితరాలు సిద్ధంగా ఉంచుకోవాలి.

# టీచర్లు ఐదుగురు.. విద్యార్థులు ముగ్గురే


పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి (నాగార్జునసాగర్): ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కంటే ఉపాధ్యాయుల సంఖ్యనే ఎక్కువ. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని నెల్లికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదుగురు టీచర్లు ఉండగా విద్యార్థులు మాత్రం ముగ్గురే ఉన్నారు. ఇదే పాఠశాలలో 2021లో 56 మంది విద్యార్థులు ఉండగా.. గతేడాది 34 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది మొదట్లో ఎనిమిది మంది విద్యార్థులతో పాఠశాలను ప్రారంభించగా...వారిలో ఐదుగురు విద్యార్థులు మూడు రోజుల క్రితం టీసీలు తీసుకొని వెళ్లిపోయారు. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు ఈ నెల 2న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి గ్రామానికి వచ్చి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి మన బడులను మనమే కాపాడుకోవాలని చెప్పారు. సర్పంచ్‌తో కూడిన పది మంది సభ్యులతో కమిటీ వేశారు. ఈ కమిటీలోని సభ్యులు గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పించి విద్యార్థులను పాఠశాలలో చేర్చాలి. ఇలా మూడు రోజులు తిరిగినా ఒక్క విద్యార్థి కూడా పాఠశాలలో చేరలేదు.

## ఉపాధ్యాయుల నిర్బంధం

పాఠశాల రద్దుపై గ్రామస్తుల నిరసన



శాలిగౌరారం: గ్రామ పాఠశాలను అధికారులు రద్దు చేయడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు ఉపాధ్యాయులను నిర్బంధించారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం గురజాల, అడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను విద్యాశాఖ అధికారులు రద్దు చేశారు. బుధవారం అడ్లూరు పాఠశాల ఉపాధ్యాయులు రాగానే.. విద్యార్థులను వల్లాల పాఠశాలకు వెళ్లమని సూచించారు. దీంతో మండిపడ్డ విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకొని ఉపాధ్యాయులను పాఠశాలలో బంధించి తాళం వేశారు. సుమారు రెండు గంటల అనంతరం.. ఉపాధ్యాయుల విజ్ఞప్తితో శాంతించి ఆందోళన విరమించారు.

# టమాటా, పచ్చిమిర్చి చోరీ

ఎత్తుకెళ్లిన దొంగలు.. మిగిలిన కూరగాయలను వదిలేసిన వైనం..


ఖాళీ బుట్టలను చూపిస్తున్న వ్యాపారి లక్‌పతి

డోర్నకల్: అధిక ధర పలుకుతున్న టమాటా, పచ్చిమిర్చి, చామగడ్డలపై దొంగల కళ్లు పడ్డాయి. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ కూరగాయల మార్కెట్‌లోని పలు దుకాణాల్లో ఇటీవల కూరగాయలు చోరీకి గురవుతున్నాయి. గాంధీసెంటర్‌లోని కూరగాయల మార్కెట్‌లో రాత్రి వేళల్లో దుకాణాలకు తాత్కాలిక నెట్ ఏర్పాటు చేస్తారు. మార్కెట్‌కు నైట్‌వాచ్‌మన్ లేకపోవడం , ఇటీవల కూరగాయల ధరలు పెరగడంతో రాత్రి వేళల్లో పలు దుకాణాల్లోని కూరగాయలు చోరీకి గురవుతున్నట్లు వ్యాపారులు గుర్తించారు. బుధవారం ఉదయం కూరగాయల వ్యాపారి లక్‌పతి తన దుకాణం తెరిచి చూడగా అధిక ధర పలుకుతున్న టమాటా, పచ్చిమిర్చి, చామగడ్డ చోరీ అయినట్టు గుర్తించి లబోదిబోమన్నాడు.

## కర్ణాటకలో టమాటా పంట చోరీ


ఖాళీగా ఉన్న తోటలో బాధిత రైతు

యశవంతపుర: కాయగూరల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. టమాటా ధరలు కిలో వంద రూపాయలను దాటాయి. దీంతో అందరి కళ్లు ఇప్పుడు టమాటాలపై పడ్డాయి. కర్ణాటకలో హసన్ జిల్లా బేలూరు తాలూకా గోణి సోమనహళ్లి గ్రామంలో టమాటా పంటను దొంగలు ఎత్తుకుపోయారు. మంగళవారం రాత్రి తోటలోకి ప్రవేశించి, దాదాపు 60 సంచుల టమాటాలను కోసుకెళ్లారు. రైతు పొలంలోకి వెళ్లి చూడగా పంట మొత్తం మాయం కావడంతో హళేబీడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోయిన పంట ధర రూ.1.5 లక్షల వరకూ ఉంటుందని తెలిపాడు.

**టమాటా తోటకు సీసీ కెమెరా రక్షణ**

కర్ణాటకలోని హావేరి జిల్లా హానగల్ తాలూకా అక్కి ఆలూరు గ్రామంలో రైతు మల్లప్ప తన టమాటా తోటకు సీసీ కెమెరాలతో రక్షణ ఏర్పాటు చేసుకున్నాడు. ధరలు పెరగటంతో దొంగలు ఎత్తుకెళ్లే ప్రమాదం ఉందని, అందుకే జాగ్రత్తలు తీసుకుంటున్నానని చెప్పాడు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అటువైపు దొంగలు రాకుండా కాపలా కాస్తున్నట్లు తెలిపాడు.

# ఇప్పటికే ఏడుగురు.. ఇప్పుడు మరో ముగ్గురు

- భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ముగ్గురికి జన్మనిచ్చిన మహిళ
- ఇప్పటికే ఆమెకు ఏడుగురు సంతానం


చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్

భద్రాచలం అర్బన్: ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ ఆదివాసీ మహిళ ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. ఇది సాధారణ కాన్పు కావడం విశేషం. కాగా ఆమెకు ఇప్పటికే ఏడుగురు పిల్లలు ఉన్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బట్టిగూడెంకు చెందిన పుజ్జ అనే మహిళకు ఈనెల 2వ తేదీన పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం పుజ్జ మొదట ఇద్దరు మగ శిశువులకు జన్మనివ్వగా వైద్యులు కవల పిల్లలనే అనుకున్నారు. ఇంతలోనే పుజ్జ మరో ఆడశిశువుకు జన్మనిచ్చింది. ప్రస్తుతం ముగ్గురు పిల్లలు, తల్లి క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. కాగా, పుజ్జ వయసు 29 ఏళ్లు మాత్రమే కాగా, ఆమెకు ఇది ఎనిమిదో కాన్పు అని చెప్పారు. ఇప్పటికే ఆమెకు నలుగురు ఆడపిల్లలు, ముగ్గురు అబ్బాయిలు ఉండగా, ఇప్పుడు పుట్టిన ముగ్గురితో కలిపి ఆమెకు మొత్తం పది మంది సంతానం అయ్యారు. పుజ్జకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశాక డిశ్చార్జి చేస్తామని వైద్యులు వెల్లడించారు. ఇదిలా ఉండగా పుజ్జకు సాధారణ ప్రసవం జరిగేలా కృషి చేసిన హెడ్‌నర్సు విజయశ్రీ, ఇతర సిబ్బందిని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ అభినందించారు.

# హిందీ నేర్చుకుంటూ.. ఆదాయం అందుకుంటూ..

విదేశీ రోగులకు, ఆసుపత్రులకు మధ్య వారధులుగా ఆఫ్రికన్లు

ఫెసిలిటేటర్లుగా అవతారమెత్తుతున్న మాజీ రోగులు, విదేశీ విద్యార్థులు

హైదరాబాద్ నగర వైద్యరంగంతో మమేకమవుతున్న వైనం

సాక్షి, హైదరాబాద్: నగరంలోని ఒక కార్పొరేట్ ఆసుపత్రిలోని రిసెప్షన్‌లో ఉన్న వ్యక్తుల్ని ''కిత్నా రూపియా టెస్ట్ కే లియే? (పరీక్షలకు ఎంత ఖర్చవుతుంది?)''అని ఆఫ్రికాకు చెందిన కవాంగు(25) అడుగుతోంది. కెన్యా నుంచి న్యూరో సర్జన్‌ను సంప్రదించడానికి నగరానికి వచ్చిన ముగ్గురు రోగులు తనకు కస్టమర్లుగా ఉన్నారు. వారికి అవసరమైన సంప్రదింపులు, పరీక్షల ఏర్పాట్ల నుంచి రెస్టారెంట్‌లో ఆహారాన్ని ఆర్డర్ చేయడం దాకా అన్నీ కవాంగు బాధ్యతలే. విదేశీయులకు అత్యున్నత వైద్యసేవల్ని మాత్రమే కాదు ఆదాయమార్గాలను కూడా నగర వైద్యం అందిస్తున్న తీరుకు కువాంగు ఒక ఉదాహరణ. తన కుటుంబంతో నాలుగేళ్ల క్రితం నగరానికి వచ్చి అలాంటి ఫెసిలిటేటర్ సహాయంతో సంక్లిష్టమైన కాలేయ సమస్యకు కవాంగు చికిత్స పొందింది. ఆ తర్వాత తానే ఫెసిలిటేటర్‌గా మారితే రోజుకు రూ.3 వేల నుంచి 5 వేల వరకు సంపాదించవచ్చని అర్థమయ్యాక కవాంగు మూడేళ్లుగా అదే పని చేస్తూ నగరంలోనే ఉంటున్నారు. ఆ వృత్తి కోసం కొంచెం హిందీ కూడా నేర్చుకుందామె. 'హిందీ భాష నేర్చుకోవడం కోసం కోర్సులో చేరడంతోపాటు బాలీవుడ్ సినిమాలు చూడటం ప్రారంభించాను'అని ఆమె చెప్పారు.


ఓ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో సిబ్బందితో ఆఫ్రికన్లు

### టోలీచౌకి కేంద్రంగా...

ఫెసిలిటేటర్లుగా వ్యవహరిస్తున్నవారికి కేంద్రంగా నగరంలోని టోలీచౌకి మారిందని ఓ ఆసుపత్రికి చెందిన మార్కెటింగ్ విభాగ ప్రతినిధి తెలిపారు. ఈ ఏరియాలోని ప్రీమియర్ అపార్ట్‌మెంట్‌లో అద్దెకుండేవారిలో అత్యధికులు ఈ తరహా సేవల్లో నిమగ్నమవుతున్నారన్నారు. చాలామంది ఇక్కడ ట్రావెల్ లేదా స్టడీ వీసాపై మాత్రమే ఉన్నారు. కాబట్టి ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ యాక్ట్‌కి సంబంధించిన సమస్యల గురించి భయపడివారు తమపేరు తదితర వ్యక్తిగత వివరాలు రహస్యంగా ఉంచుతున్నారు. ''మాకు క్లిష్టమైన సమస్యలు వచ్చినప్పుడు నైరోబీలోని ప్రధాన కార్పొరేట్ ఆసుపత్రుల నిర్వాహకులు మాకు సహాయం చేస్తారు''అని నైరోబీకి చెందిన మార్గరెట్ కారీ చెప్పారు. కొన్ని ఆసుపత్రులు దేశీయ రోగులతో పోలిస్తే అంతర్జాతీయ రోగులకు ట్రీట్‌మెంట్ రేట్లు అమాంతం 50 శాతం మేర పెంచేసి వసూలు చేస్తున్నారు. ఇలాంటి ఆసుపత్రులు ఫెసిలిటేటర్లకు బిల్లును బట్టి 15 నుంచి 20 శాతం కూడా ఇస్తున్నారని సమాచారం. 'సోమాలియాలో ఆరోగ్య సంరక్షణకు సరైన మౌలిక సదుపాయాలు లేవు. దాంతో చికిత్స కోసం థాయ్‌లాండ్, మలేషియా, చైనాకు వెళ్లేవారు. కానీ, ఇప్పుడు చాలామంది భారతదేశానికి, అందులోనూ హైదరాబాద్‌కు వస్తున్నారు, అందువల్ల నేనిక్కడ ఉంటూ బంధువులు, స్నేహితులకు సహాయం చేయడం ప్రారంభించాను. అలా చాలామంది నాతో కనెక్ట్ అయ్యారు'అని 10 ఏళ్ల క్రితం నగరానికి వచ్చిన సోమాలియా జాతీయుడైన జువేద్ అన్నారు.

మా ఆసుపత్రికి నైజీరియా, కెన్యా, సుడాన్, సోమాలియా తదితర దేశాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. వీరి కోసం మేం అధికారికంగా ఉన్న సంస్థల నుంచి ఫెసిలిటేటర్ల సేవలు అందుకుంటాం. అరుదుగా మాత్రం తెలిసిన, పరిచయస్తులను ఉపయోగించుకుంటాం.

**ఉభయ కుశలోపరి విధానం**

రోగులకు ఎదురయ్యే భాషా పరమైన ఇతర అవరోధాలకు పరిష్కారంగానూ, మరోవైపు ఇక్కడ విద్యార్జన తదితర పనులపై వచ్చేవారికి ఆదాయమార్గంగానూ ఈ విధానం ఉపకరిస్తోంది.

–డా.కిషోర్‌రెడ్డి, అమోర్ ఆసుపత్రి

### ఏజెన్సీలూ ఉన్నాయి...

మెడికల్ టూరిజమ్ సేవలు అందించే కొన్ని అంతర్జాతీయ కంపెనీలు చట్టప్రకారం కొందరిని ఫెసిలిటేటర్లుగా నియమించుకుని రోగులకు సహాయకులుగా వినియోగిస్తాయి. ఇలాంటి సంస్థలు ఢిల్లీ, ముంబై, బెంగుళూర్‌లలో ఎక్కువ. వాటి సేవలు హైదరాబాద్‌కు ఇంకా విస్తృతంగా వ్యాపించలేదు. దాంతో ఇక్కడ వ్యక్తిగతంగా సేవలు అందించే ఫెసిలిటేటర్లకు అవకాశాలు పెరుగుతున్నాయి. వీటిని అందిపుచ్చుకుంటున్న విదేశీ విద్యార్థులు నగరంలోని హైదరాబాద్, ఉస్మానియా వంటి యూనివర్సిటీల్లో చదువుకుంటూ పార్ట్‌టైమ్‌గా ఈ విధులు నిర్వర్తిస్తున్నారు. పదేళ్లు, పన్నెండేళ్ల పాటు నర్సింగ్ స్టాఫ్, ఫిజియోథెరపీ స్టాఫ్‌గా సేవలు అందించినవాళ్లు కూడా జోర్డాన్, ఇరాక్, సిరియా తదితర మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి వచ్చి అక్కడి పరిచయాలను, అరబిక్ భాష మీద పట్టు లాంటి సానుకూల అంశాలతో ఫెసిలిటేటర్ల అవతారం ఎత్తుతున్నారు.

# పాలపుంతలో గురుత్వాకర్షణ తరంగాల గుట్టు

ఖగోళ రహస్యాలను తేల్చే శాస్త్రవేత్తల బృందంలో ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఖగోళ రహస్యాలను తేల్చే పరిశోధనలో భాగంగా.. పాలపుంతలో గురుత్వాకర్షణ తరంగాల ఆధారాలను కనుగొన్న బృందంలో హైదరాబాద్ ఐఐటీ పరిశోధకులూ భాగస్వాములయ్యారు. 'ఇండియన్ పల్సర్ టైమింగ్ అర్రే (ఐఎన్‌పీటీఏ)'తోపాటు జపాన్, యూరప్ దేశాల అంతరిక్ష శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ పరిశోధన చేశారని ఐఐటీ హైదరాబాద్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రపంచంలోని ఆరు అత్యాధునిక రేడియో టెలిస్కోప్‌లను ఉపయోగించి ఖగోళాన్ని పరిశీలించామని.. పాలపుంతలో అతి తక్కువ పౌనఃపున్యం ఉన్న గురుత్వాకర్షణ తరంగాలకు సంబంధించిన ఆధారాలను కనుగొన్నామని తెలిపింది. ఈ వివరాలు ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ జర్నల్‌లో ప్రచురితం అయ్యాయని పేర్కొంది. ఐఐటీ హైదరాబాద్ భౌతికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ శంతన్‌దేశాయ్, అమన్ శ్రీవాత్సవ, ఫిజిక్స్ పీహెచ్‌డీ విద్యార్థి దివ్యనాశ్ కర్పందా, బీటెక్ విద్యార్థులు శ్వేత అర్ముగం, ప్రజ్ఞ మాండిపాక తదితరులు పరిశోధన బృందంలో ఉన్నారని వివరించింది.

# రూ.2 వేల నోట్ల మార్పిడికి వచ్చి చిక్కారు..

- ఇద్దరు యువకుల నుంచి రూ.27.62 లక్షల నగదు స్వాధీనం
- మావోయిస్టుల డబ్బుగా పోలీసుల వెల్లడి

కాళేశ్వరం: రూ.2 వేల నోట్ల మార్పిడికి వెళుతున్న ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారినుంచి రూ.27.62 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇదంతా మావోయిస్టులకు చెందిన సొత్తుగా పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బుధవారం మహారాష్ట్రలోని కంకేర్ జిల్లా ఏటపల్లి తాలూకా రోధర్ గ్రామానికి చెందిన మంగు కుర్సా(24), పవార్ గ్రామానికి చెందిన బిప్లబ్ గిరీష్ సిక్దర్ (24)లు.. ద్విచక్రవాహనంపై గడ్చిరోలి జిల్లాకు వెళ్తుండగా అహేరి వద్ద పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆ నగదు నిషేధిత మావోయిస్టు సంస్థకు చెందినదిగా తేలినట్లు పోలీసులు వెల్లడించారు. వారినుంచి స్వాధీనం చేసుకున్న నగదులో రూ.2 వేల నోట్లు 607, మిగతావి రూ.500, 200, 100 నోట్లు ఉన్నాయని గడ్చిరోలి జిల్లా ఎస్పీ నీలోత్పల్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

# రేపు తీర్పు వెల్లడిస్తాం

దర్శకుడు శంకర్‌కు భూ కేటాయింపుపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు ఎన్.శంకర్‌కు ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం మోకిల్లా గ్రామంలో ఎకరం రూ.5 లక్షలు చొప్పున 5 ఎకరాలు కేటాయించడంపై దాఖలైన పిటిషన్‌లో ఈ నెల 7న తీర్పు వెల్లడిస్తామని హైకోర్టు పేర్కొంది. భూకేటాయింపులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారాలు ఉంటాయని.. ఈ క్రమంలోనే సినీరంగానికి, క్రీడాకారులకు భూకేటాయింపులు చేస్తుందని, ఇందులో తప్పుపట్టుకోవాల్సిన అవసరం ఏం ఉందని పిటిషనర్‌ను ప్రశ్నించింది. దర్శకుడు శంకర్‌కు ప్రభుత్వం భూమి కేటాయించడాన్ని సవాల్ చేస్తూ కరీంనగర్‌కు చెందిన జె.శంకర్ 2020లో దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది.

# కాలేజీల్లో యాంటీ డ్రగ్స్ క్లబ్బులు: సీఎస్

సాక్షి, హైదరాబాద్: మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు, డ్రగ్స్ అక్రమ రవాణాను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు.. యాంటీ నార్కోటిక్స్ బ్యూరోను ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సచివాలయంలో బుధవారం ఆమె నేతృత్వంలో నార్కో కోఆర్డినేషన్ సెంటర్ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. . కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ క్లబ్బులు ఏర్పాటు చేయాలని, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని విద్యాశాఖకు సూచించారు.


అమ్యూజ్‌మెంట్ పార్కు పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ

దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్/జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): దక్షిణ కొరియా తరహాలో తెలంగాణ రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం అక్కడి అభివృద్ధి, పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా సియోల్‌లోని డీ మిలటరీ జోన్ సమీపంలో ఏర్పాటుచేసిన చిల్డ్రన్ అమ్యూజ్‌మెంట్ పార్కు ఎంతో అద్భుతంగా ఉందని, ప్రపంచ పర్యాటకులను ఈ పార్కు ఎంతో ఆకర్షిస్తుందని చెప్పారు. రాబోయే 5 నెలల్లో మహబూబ్‌నగర్‌లోని శిల్పారామంలో చిల్డ్రన్ అమ్యూజ్‌మెంట్ పార్కు తరహాలో నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీఇచ్చారు. శిల్పారామం వెనకవైపు ఉన్న ఖాళీ ప్రదేశంలో ఈ అమ్యూజ్‌మెంట్ పార్కు ఏర్పాటు చేస్తామని, చిన్నపిల్లలు, యువతను ఈ పార్కు ఎంతో ఆకట్టుకుంటుందని అభిప్రాయపడ్డారు. పార్కు నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పాలమూరును రాష్ట్రంలోనే ప్రఖ్యాత టూరిజం డెస్టినేషన్‌గా మార్చడమే తమ ధ్యేయం అన్నారు. ట్యాంక్‌బండ్, సస్పెన్షన్ బ్రిడ్జి ఐలాండ్, శిల్పారామం, కేసీఆర్ పార్క్, టెంట్‌సిటీ, మన్యంకొండ రోప్‌వే తరహా టూరిజం అట్రాక్షన్స్ జిల్లాకు ఇతర రాష్ట్రాల వారే కాకుండా దేశవ్యాప్తంగా పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చేలా తయారు చేస్తామన్నారు. ఈ సందర్భంగా రిపబ్లిక్ ఆఫ్ కొరియాలోని ఇండియన్ అంబాసిడర్ అమిత్‌కుమార్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ మనోహర్ పాల్గొన్నారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 